RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 10 | సంచిక : 242 | మంగళవారం 01 - 04 - 2025 | ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ | అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు : 08 | వెల : 2 రూ/-

## ఆఫ్ షోర్ మైనింగ్ టెండర్లపై రాహుల్ స్పందన

● "కేరళ, గుజరాత్, అండమాన్ నికోబార్ తీరాల్లో సముద్ర గనుల తవ్వకాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిన నిర్ణయాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను"



ఢిల్లి : పర్యావరణ ప్రభావాలను అంచనా వేయకుండా అనుమతులు ఎలా ఇస్తారని విమర్శలు కేరళ, గుజరాత్, అండమాన్ నికోబార్ దీవుల సముద్ర తీరాల్లో తవ్వకాలకు అనుమతిస్తూ జారీ చేసిన టెండర్లను రద్దు చేయాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఆఫ్ షోర్ మైనింగ్ వల్ల సముద్ర జీవులకు ముప్పు వాటిల్లుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభావాలను క్షుణ్ణంగా అంచనా వేయకుండా ప్రైవేట్ సంస్థలకు సముద్ర గనుల తవ్వకాల కేటాయింపులు చేయడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. "కేరళ, గుజరాత్, అండమాన్ నికోబార్ తీరాల్లో సముద్ర గనుల తవ్వకాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిన నిర్ణయాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను" అని ప్రధాన మంత్రికి రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. మిగతా..2లో

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన వాన్ గార్డ్ సంస్థ సీఈవో, ప్రతినిధులు

★ హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబులిటీ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వాన్ గార్డ్ సీఈవో వెల్లడి

★ దేశంలోనే తొలి కార్యాలయాన్ని హైదరాబాద్‌లో స్థాపించనున్నట్లు వెల్లడి

★ 2,500 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్న సీఈవో



హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో వాన్ గార్డ్ సంస్థ సీఈవో సమావేశమయ్యారు. అనంతరం సీఈవో మరియు కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ, హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబులిటీ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దేశంలోనే మొట్టమొదటి కార్యాలయాన్ని హైదరాబాద్‌లో స్థాపించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యాలయం అందుబాటులోకి వస్తే దాదాపు 2,500 మందికి

## స్థానిక ఎన్నికలపై ఫోకస్..

## బీజేపీ టార్గెట్ ఫిక్స్



▶ ఓటేసిన ప్రజలకు వెన్నుపోటు పొడిచేందుకూ రేవంత్ ప్రభుత్వం చూస్తోందని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

▶ రైతు, విద్యుత్ కోతలు, నిరుద్యోగ సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని

▶ స్థానిక సంస్థల ఎన్నికలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని సూచించారు.

2

## విశాఖ బ్రాండ్‌ను పరుగులెత్తిస్తాం



విశాఖ బీచ్ రోడ్డులో ఓ స్టార్ హోటల్‌కు మంత్రి లోకేశ్ భూమిపూజ

హాజరైన కేంద్ర, రాష్ట్ర మంత్రులు

వైజాగ్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది.

"బ్రాండ్ బాబు నినాదం ఎప్పుడైతే తిరిగి వచ్చిందో అప్పుడే విశాఖ బ్రాండ్ అత్యున్నత శిఖరాలకు దూసుకెళ్లింది.

విశాఖపట్నం : విశాఖ బ్రాండ్‌ను నిలబెట్టుకునేందుకు సర్కార్ ఎంతో కృషి చేస్తోందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కూటమి ప్రభుత్వం రాకతో గతంలో పెట్టుబడులు పెట్టమని తిరిగి వెళ్లిపోయిన వారు కూడా ఇప్పుడు ముందుకొస్తున్నారని చెప్పారు. టీసీఎస్? కొద్ది రోజుల్లో ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నినాదంతో ముందుకు వెళు_తున్నామని వివరించారు.

## ఏపీ సర్కార్ కీలక ప్రకటన.. ఆ 51 మండలాలు..

స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకున్న కూటమి ప్రభుత్వం కరువు మండలాలపై దృష్టి

37 మండలాల్లో తీవ్రమైన కరువు ఉన్నట్లు ఉత్తర్వుల్లో వెల్లడించారు.

2024-25 కరువు మండలాలను వెల్లడిస్తూ ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ



అమరావతి: గత ఏడాది ఏపీలో సాధారణ స్థాయిలో కూడా వర్షాలు పడలేదు.. అయితే గత జగన్ ప్రభుత్వం మాత్రం కరువు మండలాలను ప్రకటించడంలో నిర్లక్ష్యం చేసింది. మొక్కుబడిగా కరువు మండలాలను ప్రకటించి చేతులు దులుపుకుంది. రైతుల ఇబ్బందులను, స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకున్న కూటమి ప్రభుత్వం కరువు మండలాలపై దృష్టి సారించింది. ఇందులో భాగంగానే కరువు మండలాలపై కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు.

ఆ నివేదిక ఆధారంగా..

ఏపీలో కరువు మండలాలుగా 51 మండలాలను ప్రకటించారు. 37 మండలాల్లో తీవ్రమైన కరువు ఉన్నట్లు ఉత్తర్వుల్లో వెల్లడించారు. 14 మండలాల్లో కరువు ప్రభావం ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు రబీ సీజన్ 2024-25 కరువు మండలాలను వెల్లడిస్తూ ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల రాష్ట్ర విపత్తుల నిర్వహణ కార్యాలయంలో నిర్వహించిన కరువు ప్రభావ కమిటీ సమావేశంలో జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖలు సమర్పించిన నివేదికలను కరువు ప్రభావ కమిటీ నిశితంగా పరిశీలించింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన నివేదికలను తాము దృష్టిలో ఉంచుకుని, వర్షపాతం లోటు, పంటల నష్టం, భూగర్భ జలాల స్థాయి, వ్యవసాయ స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని సిసోడియా ప్రకటించారు.

## 2029లోనూ మోదీనే ప్రధాని: సీఎం ఫడ్నవిస్

▶▶ మహారాష్ట్ర నుంచి మోదీ వారసుడు వస్తారంటూ సంజయ్ రౌత్ చేసిన వ్యాఖ్యలపై ఫడ్నవీస్ స్పందిస్తూ... "మోదీనే మా నేత.

▶▶ మన సంస్కృతిలో తండ్రి బతికుండగా వారసుని గురించి మాట్లాడం. అది మొఘలుల సంస్కృతి.

▶▶ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ అన్నారు. మోదీకి వారసుడిని అన్వేషించాల్సిన అవసరమే లేదని



ముంబై: దేశానికి ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీఇంకా చాలా ఏళ్లు నాయకత్వం వహిస్తారని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ అన్నారు. మోదీకి వారసుడిని అన్వేషించాల్సిన అవసరమే లేదని, 2029లోనూ మోదీని ప్రధానమంత్రిగా మనం చూస్తామని చెప్పారు. మోదీ సెప్టెంబర్‌లో రిటైర్‌మెంట్ కావాలనే ఆలోచనతో నాగపూర్‌లోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయానికి వెళ్లి మోహన్ భగవత్‌ను కలిసారని శివసేన (యూబీటీ)నేత సంజయ్ రౌత్ చేసిన వ్యాఖ్యలను ఫడ్నవిస్ కొట్టివేశారు. మిగతా..2లో

## అలకలు వద్దు..

## కష్టపడి పనిచేయండి

▶ కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని హామీ

▶ పార్టీ కేడర్ అంతా ప్రతీ మూడు నెలలకు ఒకసారి ప్రజల్లోకి వెళ్లాలన్నారు.

▶ జగన్ పై కంటే పార్టీ కార్యకర్తల కోసమే తాను ఎక్కువగా పోరాడుతుంటానని వెల్లడించారు.



2

అనకాపల్లి, మార్చి 31: అందరం కలిసి పోరాడి ఆంధ్రప్రదేశ్‌లో చరిత్ర తిరిగి రాశామని..164 స్థానాలు కైవసం చేసుకున్నామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి , మంత్రి నారా లోకేష్ అన్నారు. సోమవారం యలమంచిలి నియోజకవర్గంలో కార్యకర్తలు, నేతలతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. మిగతా..2లో

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన వాన్ గార్డ్ సంస్థ సీఈవో, ప్రతినిధులు

ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏఐ, డేటా సెంటర్, మొబైల్ ఇంజినీరింగ్ రంగాల్లో నిపుణులకు తమ సంస్థల్లో అవకాశాలు లభిస్తాయని వాన్ గార్డ్ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకర విధానాల వల్లే హైదరాబాద్‌ను ఎంచుకున్నట్లు వారు తెలిపారు. అంతేకాకుండా, అన్ని రంగాల నిపుణులు హైదరాబాద్‌లో అందుబాటులో ఉన్నారని వారు అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ కేపబులిటీ సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

# ఆఫ్ షోర్ మైనింగ్ టెండర్లపై రాహుల్ స్పందన

పర్యావరణ ప్రభావాలను అంచనా వేయకుండా సముద్ర గనుల తవ్వకాల టెండర్లను జారీ చేసిన విధానానికి వ్యతిరేకంగా తీర ప్రాంత ప్రజలు నిరసన తెలుపుతున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దీనివల్ల తమ జీవనోపాధి, జీవన విధానంపై ప్రభావం చూపుతుందని లక్షలాది మంది మత్స్యకారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని వివరించారు. 2023లో సవరించిన ఆఫ్ షోర్ ఏరియాస్ మినరల్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) చట్టంపై తీవ్ర అభ్యంతరాలు ఎదుర్కొన్నాయని రాహుల్ గాంధీ తెలిపారు. ఆఫ్ షోర్ మైనింగ్ వల్ల సముద్ర జీవులకు ముప్పు, పగడపు దిబ్బలకు నష్టం మరియు చేపల నిల్వలు తగ్గిపోవడం వంటి ప్రతికూల ప్రభావాలు కలుగుతాయని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయని పేర్కొన్నారు.

# రాష్ట్రంలో రెండే రెండు బంగారు కుటుంబాలు ఉన్నాయి

ప్రైవేటు పరం చేసిన ఘనత చంద్రబాబుదని చెప్పారు. పీ4 పేరుతో డబ్బులు ఉన్నవాళ్లని, బడా బాబుల్ని వేదికపై కూర్చోబెడుతున్నారని అన్నారు. గతంలో జన్మభూమి, శ్రమదానం అని ప్రచారం చేసుకున్న చంద్రబాబు... ఇప్పుడు పీ4 పేరుతో ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రెండే రెండు బంగారు కుటుంబాలు ఉన్నాయని... ఒకటి చంద్రబాబుది, మరొకటి పవన్ కల్యాణ్ దని అంబటి దుయ్యబట్టారు. పుట్టినప్పటి నుంచి చంద్రబాబు చేసినవన్నీ తప్పులేనని అన్నారు. ఎన్టీఆర్ దగ్గర పని చేసి... ఆయన పని పూర్తి చేశారని విమర్శించారు. లోకేశ్ లాంటి అసమర్థుడిని ప్రజలపై రుద్దాలని ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. లోకేశ్ డబ్బులు వసూలు చేసి పవన్ కు ప్యాకేజ్ ఇస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వానికి నూకలు చెల్లాయని... ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజు దగ్గరపడిందని చెప్పారు.

# 2029లోనూ మోదీనే ప్రధాని: సీఎం ఫడ్నవిస్

మోదీ ఆ ప్లాన్‌తోనే ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి వెళ్లారేమో..

మహారాష్ట్ర నుంచి మోదీ వారసుడు వస్తారంటూ సంజయ్ రౌత్ చేసిన వ్యాఖ్యలపై ఫడ్నవిస్ స్పందిస్తూ... "మోదీనే మా నేత. అలాగే ఆయన కొనసాగుతారు. మన సంస్కృతిలో తండ్రి బతికుండగా వారసుని గురించి మాట్లాడం. అది మొఘలుల సంస్కృతి. దానిపై (మోదీ వారసత్వంపై) చర్చించేందుకు ఇంకా సమయం రాలేదు" అని అన్నారు.

### భయ్యాజీ జోషి ఏం చెప్పారంటే?

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌ను మోదీ కలుసుకోవడం, మహారాష్ట్ర నుంచి మోదీ వారసుడు ప్రధాని కానున్నారనే ఊహాగానాలపై ఆర్ఎస్ఎస్ సీనియర్ నేత సురేష్ భయ్యాజీ జోషి స్పందించారు. అలాంటి సమాచారం ఏదీ తనవద్ద లేదని, అలాంటి సంభాషణలు జరిగినట్టు కూడా తనకు తెలియదని చెప్పారు. కోవిడ్ సమయంలో మోదీ అందించిన సేవలు, సంఘ్ వ్యవస్థాపకుడు హెడ్గేవార్ జయంతికి స్వయంసేవక్‌గా ఆయన హాజరుకావడం చాలా చక్కగా ఉందని ప్రశంసించారు.

# వ్యూహాత్మక బలిమికి వాషింగ్టన్‌తో చెలిమి

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ హాజరయ్యారు. అప్పుడే ఆయన ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా యాత్రకు రంగం సిద్ధం చేశారు. ఆ వెంటనే క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశంలోనూ జైశంకర్ పాల్గొన్నారు. తరవాత ప్రధాని మోదీ వాషింగ్టన్ వెళ్లి అధ్యక్షుడు ట్రంప్‌తోపాటు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తోనూ భేటీ అయ్యారు. ప్రపంచ రాజకీయాల్లో తన సైనిక, ఆర్థిక, రాజకీయ పాత్రపై అగ్రరాజ్యం అమెరికా పునర్విమర్శ చేసుకుంటోంది. ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ జాతీయ, అంతర్జాతీయ విధానాలను సమూలంగా మార్చేందుకు ఉపక్రమించారు. ఇలాంటి తరుణంలో వాషింగ్టన్‌తో భారత్ ఎలా మెలగాలి? అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ హాజరయ్యారు. అప్పుడే ఆయన ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా యాత్రకు రంగం సిద్ధం చేశారు. ఆ వెంటనే క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశంలోనూ జైశంకర్ పాల్గొన్నారు. తరవాత ప్రధాని మోదీ వాషింగ్టన్ వెళ్లి అధ్యక్షుడు ట్రంప్‌తోపాటు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తోనూ భేటీ అయ్యారు. ఇంకా అమెరికా జాతీయ ఇంటెలిజెన్స్ సంస్థల డైరెక్టర్ తులసీ గాబర్డ్, ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామి, జాతీయ భద్రతా సలహాదారు మైకేల్ వాల్ట్జ్ తదితర ముఖ్యులతో సమావేశమయ్యారు. తద్వారా ట్రంప్, ఆయన పాలనా బృందం మనస్తత్వాన్నీ, విధానాలనూ అర్థం చేసుకోవడం ప్రధాని మోదీకి వీలైంది. స్పష్టమైన అజెండాతో అధికారంలోకి వచ్చిన ట్రంప్, ఆయన బృందం- సత్వరమే దాన్ని అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

### ఉభయతారక ఒప్పందాలు

గత ప్రభుత్వాలు అడ్డూఆపూలేని ప్రపంచీకరణ విధానాలు చేపట్టడంవల్ల అమెరికాలో పారిశ్రామికోత్పత్తి బాగా దెబ్బతిందని ట్రంప్ భావిస్తున్నారు. తమ గడ్డపైకి ఇబ్బడిముబ్బడిగా వలసలు రావడం వల్ల అమెరికన్ల విలక్షణ అస్తిత్వం ప్రమాదంలో పడిందంటున్నారు. అమెరికాకు పూర్వ వైభవం తీసుకురావాలంటే వలస విధానాలను సమూలంగా సంస్కరించడంతో పాటు, అధిక సుంకాలు విధించడం ఆవశ్యకమని ఆయన నమ్ముతున్నారు. విదేశీ దిగుమతులను తగ్గించి, స్వదేశీ ఉత్పత్తిని పెంచే మార్గంగా అధిక సుంకాలను పరిగణిస్తున్నారు. నేడు అమెరికా రాజకీయాల్లో సుంకాలు, వలసలే ప్రధానాంశాలుగా మారాయి. ఈ క్రమంలో అక్రమ వలసదారులకు సంకెళ్లు వేసి విమానాల్లో ఇండియాకు తరలిస్తున్నా, గట్టిగా ఖండనలు వినపడలేదు! అమెరికాతో వాణిజ్యం సాగిస్తున్న పది ప్రధాన దేశాల్లో ఇండియా ఒకటి. మన దేశానికి వాషింగ్టన్‌తో వాణిజ్య మిగులే ఉంది తప్ప, లోటు లేదు. దీన్ని చెడగొట్టుకోకూడదని దిల్లీ భావిస్తోంది. ఇండియా తమ వస్తువులపై అధిక సుంకం విధిస్తోందని, దానివల్ల అమెరికా కంపెనీలు భారతీయ మార్కెట్లో ప్రతికూలతను ఎదుర్కొంటున్నాయని ట్రంప్ ఆరోపిస్తున్నారు. ఏప్రిల్ మొదటి వారంలో అమలులోకి వచ్చేలా ప్రతీకార సుంకాలనూ ఆయన ప్రకటించారు కూడా. మోదీ పర్యటనలో భారతీయ ప్రతినిధి బృందం సుంకాల ఊసు ఎత్తకుండా సంయమనం పాటించింది. కానీ, ఆ పర్యటన ముగింపులో విడుదలైన సంయుక్త ప్రకటన మాత్రం- వాణిజ్యపరమైన తేడాపాడాలను పరిష్కరించుకోవడానికి రెండు దేశాలు చర్చించినట్లు తెలిపింది. ఈ ఏడాది చివరికల్లా ఉభయతారకమైన వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోనున్నట్లు వెల్లడించింది.

### సాంకేతికతల్లో సహకార వృద్ధికి...

రానున్న అయిదేళ్లలో భారత్-అమెరికా వాణిజ్యాన్ని 50వేల కోట్ల డాలర్లకు తీసుకెళ్లాలని నేతలు నిశ్చయించారు. అగ్రరాజ్యం నుంచి మరింత చమురు, వంట గ్యాస్‌తో పాటు ఇతర ఇంధన వాయువులను దిగుమతి చేసుకోవాలని ఇండియా భావిస్తోంది. దీనివల్ల రెండు దేశాల వాణిజ్య పరిమాణం పెరుగుతుంది. చిన్నపాటి ఆధునిక మాడ్యులర్ అణు రియాక్టర్ల ద్వారా భారత్‌లో అణు విద్యుదుత్పాదనను పెంచాలని నిర్ణయించారు. అధిక పెట్టుబడులు, వినూత్న విధానాలతో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంపొందించుకోవాలని భారత్, అమెరికాలు భావిస్తున్నాయి. అక్రమంగా అమెరికాలో ఉంటున్న భారతీయుల్ని వెనక్కి తీసుకోవడానికి దిల్లీ అంగీకరించింది. వారిని సంకెళ్లతో బంధించి పంపడం గురించి ప్రభుత్వం బహిరంగంగా విమర్శించలేదు. కానీ విద్యార్థులు, వృత్తి నిపుణుల వలసలను మరింత క్రమబద్ధం చేయడానికి అమెరికాతో చర్చలు జరుపుతోంది. సాంకేతిక పరిజ్ఞానం, నవీకరణల విషయంలో మోదీ-ట్రంప్ భేటీ గణనీయ ఫలితాలిస్తోంది. సెమీ కండక్టర్లు, క్వాంటమ్ సాంకేతికత, ఇంధన, అంతరిక్ష తదితర అత్యాధునిక టెక్నాలజీల్లో సహకార వృద్ధికి ప్రత్యేక ఒప్పందం కుదిరింది. అరుదైన ఖనిజ వనరులు, వస్తు సరఫరా గొలుసుల్లోనూ సహకారం పెంపొందించుకోవాలని రెండు దేశాలు నిశ్చయించాయి. రక్షణ రంగంలోనూ ఉభయ దేశాల మధ్య సహకారం బలపడనుంది. ఆయుధాల సంయుక్త ఉత్పత్తి, ఆయుధ పరిశ్రమల మధ్య సహకార వృద్ధికి చర్యలు తీసుకోనున్నారు. ట్యాంక్ విధ్వంసక జావెలిన్ క్షిపణులు, సైనిక శకట వాహనాలను ఉమ్మడిగా తయారు చేయాలని తలపెట్టారు. అమెరికా నుంచి అదనంగా ఆరు పీ81 సముద్ర నిఘా విమానాలను భారత్ కొనుగోలు చేయనుంది. భారత్‌కు అమెరికా ఆయుధ విక్రయాలు 20వేల కోట్ల డాలర్లకు పెరిగాయి. ఇండియా నుంచీ అక్కడికి ఆయుధ ఎగుమతులు పెరగడం విశేషం. భద్రతా సమస్యలకు పరిష్కారాలు ట్రంప్ అధ్యక్షుడైన తరవాత ఐరోపా మిత్రులతో సంబంధాల బలోపేతం... రష్యా-ఉక్రెయిన్, హమాస్-ఇజ్రాయెల్ యుద్ధాలపై ప్రధానంగా దృష్టి సారిస్తారని భావించారు. కానీ, ఉక్రెయిన్ విషయంలో ఐరోపా మిత్రులతో అగ్రరాజ్యానికి పొరపొచ్చాలు వచ్చాయి. ట్రంప్ బాధ్యతలు చేపట్టడంతోనే భారత్, జపాన్, ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రులతో 'క్వాడ్' సమావేశాన్ని ఏర్పాటుచేశారు. మొత్తం నలుగురు విదేశీ నాయకులతో ఆయన భేటీ కాగా, వారిలో ఇద్దరు భారత్, జపాన్ ప్రధానులే! ఏతావతా ద్వైపాక్షికంగానే కాకుండా, అంతర్జాతీయంగానూ భారత్-అమెరికా బంధం బలపడనుంది. కాబట్టి, అమెరికా సుంకాలు, వలసల విషయంలో విభేదించడం కంటే- పాకిస్థాన్, చైనా, బంగ్లాదేశ్‌ల నుంచి పొంచి ఉన్న భద్రతాపరమైన సమస్యలపై వాషింగ్టన్‌తో సహకారం పెంచుకోవడానికే దిల్లీ ప్రాధాన్యమివ్వడం మేలు. అంతర్జాతీయ సమీకరణాలు మారుతున్న క్రమంలో ప్రజాస్వామ్య దేశాలైన భారత్-అమెరికా బంధం కీలక పాత్ర పోషించనుంది.

# అలకలు వద్దు.. కష్టపడి పనిచేయండి

మొదటి పేజి తరువాయి




జూన్ నుంచి మనం సాధించిన విజయాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. భిన్నాభిప్రాయాలు ఉన్నా అందరూ కలసికట్టుగా ముందుకు సాగాలన్నారు. తెలుగుదేశం పార్టీలో కార్యకర్తకే అగ్రతాంబూలమని, ఆ తర్వాతే ఎవరైనా అని స్పష్టం చేశారు. తొలిసారి అవకాశం రాకపోయినా మూడు విడతల్లో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని, అధైర్యపడవద్దని హామీ ఇచ్చారు. అలకలుమాని పార్టీ కోసం పని చేయాలని కోరారు. మే తర్వాత కేడర్ అంతా ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. మే నెలలో కడపలో మహానాడు నిర్వహించబోతున్నామని తెలిపారు. మహానాడులో జాతీయ అధ్యక్షుడి ఎన్నిక తర్వాత రాష్ట్ర కమిటీ నియమాకం చేపడతామన్నారు. పార్టీ కేడర్ అంతా ప్రతీ మూడు నెలలకు ఒకసారి ప్రజల్లోకి వెళ్లాలన్నారు. జగన్ పై కంటే పార్టీ కార్యకర్తల కోసమే తాను ఎక్కువగా పోరాడుతుంటానని వెల్లడించారు. ఇకపై నిరంతరం యువరక్తం ఎక్కిస్తామన్నారు. ఏ నాయకుడు కూడా ఒకే పదవిలో మూడుసార్లకు మించి ఉండకూడదని ప్రతిపాదిస్తున్నామన్నారు. గ్రామస్థాయి అధ్యక్షుడికి కూడా పొలిట్‌బ్యూరోలో స్థానం లభించే పరిస్థితి రావాలని తెలిపారు. పార్టీలో కరుడుగట్టిన కార్యకర్తలంతా అయిదేళ్లు నరకం అనుభవించారని.. ఎన్నో కేసులుపెట్టి హింసించారన్నారు.

ప్రత్యేక విమానంలో ముంబైకి కొడాలి నాని.. కారణమిదే

ఇతర పార్టీ ఎమ్మెల్యే ఉన్నచోట సమన్వయ లోపం కారణంగా సమస్యలు వస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే లేనిచోట అక్కడ ఇన్‌చార్జి ప్రతివారం కూర్చుని మాట్లాడుకోవాలని సూచించారు. చట్టపరిధిలోని పనుల కోసం కార్యకర్తలు కార్యాలయాలకు వెళితే పనులు చేయాల్సిందే అని తెలిపారు. తప్పుడు కేసుల ఎత్తివేతకు చర్యలు తీసుకుంటామన్నారు. వైసీపీ సర్పంచ్‌లతో పాటు 10 శాతం వైసీపీ వారు కూడా టీడీపీ సభ్యత్వ కార్డులు తీసుకున్నారని అన్నారు. తప్పుడు కేసులకు సంబంధించి పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని సంప్రదించాలని మంత్రి లోకేష్ తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ దామచర్ల సత్య, యలమంచిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వారిని ఇబ్బంది పెట్టొద్దు.. సీఎం రేవంత్‌రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్

మొదటి పేజి తరువాయి




హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వివాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని వేధింపులకు గురిచేసి పాసులు అడిగిన విషయంపై వివరాలు సేకరించారు. ఈ మేరకు సీఎంఓ కార్యాలయం ముఖ్యమంత్రితో చర్చించింది. అనంతరం మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని పాసుల విషయంలో బెదిరించిన అంశంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సిందిగా విజిలెన్స్ డీజీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని పాసుల కోసం ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మధ్య వైరం నెలకొన్న విషయం తెలసిందే. ఫ్రీ పాసుల కోసం తమను వేధిస్తోందని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం ఆరోపించింది. దీంతో హైదరాబాద్‌ను వీడి వెళ్లిపోతామని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం తెలిపింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు ఎస్ఆర్‌హెచ్ ప్రతినిధి లేఖ రాశారు. హెచ్‌సీయూ అధ్యక్షుడు జగన్మోహనరావు ఫ్రీ టికెట్స్ కోసం తమను వేధిస్తున్నారంటూ లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికే పదిశాతం టికెట్లు ఇస్తున్నామని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం స్పష్టం చేసింది. టికెట్ల కోసం బెదిరిస్తూ మ్యాచ్‌కు ముందు.. కార్పొరేట్ బాక్స్‌లకు తాళం వేశారని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం తెలిపింది. ఐపీఎల్ కోసం స్టేడియం అద్దె మొత్తం చెల్లిస్తున్నా.. %ఎజా% పెత్తనం చేయాలని చూస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అపెక్స్ కౌన్సిల్‌తో చర్చలకు ఏర్పాటు చేయాలని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం కోరింది. చర్చలు సఫలం కాకపోతే బీసీసీఐతో చర్చించి వేదికను మార్చుకుంటామని సన్‌రైజర్స్ హైదరాబాద్ తేల్చిచెప్పింది.

# స్థానిక ఎన్నికలపై ఫోకస్.. బీజేపీ టార్గెట్ ఫిక్స్

మొదటి పేజి తరువాయి



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేయడంలో విఫలమైందని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఇవాళ(సోమవారం) హైదరాబాద్‌లోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి అధ్యక్షతన పదాధికారుల సమావేశం జరిగింది. ఈ మీటింగ్‌లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులు హాజరయ్యారు. కీలక అంశాలపై కిషన్‌రెడ్డి చర్చించారు. సంస్థాగత వ్యవహారాలపై కిషన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. మిగిలిన జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు పూర్తి చేయాలని చర్చించారు. రేవంత్ ప్రభుత్వంపై ప్రజల తరపున పోరాటాలకు సిద్ధం చేసేలా బీజేపీ కేడర్‌కు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆరు గ్యారెంటీలపైన రైతుల తరపున పోరు బాట పట్టేలా తీసుకోవాల్సిన చర్యలపై కిషన్‌రెడ్డి చర్చించారు. రాష్ట్రంలోని ప్రజలు ఇప్పుడు బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పారు. బీజేపీ నేతలు ఇంకా పోరాటాలు చేయాలని, అధికారంలోకి రావాలని ఎదురు చూస్తున్నామని అన్నారు. టీచర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాము గెలిచామని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుట్రలు చేసినా రెండు సీట్లు తాము గెలిచామని అన్నారు. గత బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పోటీ చేయలేదని.. కాంగ్రెస్ ఎన్నికల ముందే చేతులు ఎత్తేసిందని కిషన్‌రెడ్డి విమర్శించారు. ఓటేసిన ప్రజలకు వెన్నుపోటు పొడిచేందుకూ రేవంత్ ప్రభుత్వం చూస్తోందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం చేయాలని .. పోరాటాలకు సిద్ధం కావాలని బీజేపీ కేడర్‌కు పిలుపునిచ్చారు. కేసీఆర్ కుటుంబం, బీఆర్ఎస్‌పై ప్రజల్లో వ్యతిరేకత ఉందని అన్నారు. పోరాటాల ద్వారా పార్టీని పటిష్ఠం చేసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కమిటీలను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. పార్టీని సంస్థాగతంగా పటిష్ఠం చేసుకోవాలని చెప్పారు. అంబేద్కర్ జయంతి సమయం లోపుల కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని కిషన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. వందశాతం బూత్, మండల కమిటీలు పూర్తి చేసుకోవాలని కిషన్‌రెడ్డి అన్నారు. రైతు, విద్యుత్ కోతలు, నిరుద్యోగ సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని చెప్పారు. యువమోర్చా, మహిళా సమస్యలపై మహిళా మోర్చా పోరాటాలు చేయాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలవాలనే నినాదంతో ముందుకు పోవాలని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం అవుతూనే, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# విశాఖ బ్రాండ్‌ను పరుగులెత్తిస్తాం: మంత్రి లోకేశ్

మొదటి పేజి తరువాయి



విశాఖ బీచ్ రోడ్డులో ఓ స్టార్ హోటల్‌కు భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకుముందు తల్లి భువనేశ్వరితో కలిసి హోటల్ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. విశాఖపట్నం చుట్టుపక్కల ఐదు లక్షల ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. విశాఖ ఒక ఐకానిక్ కాపిటల్?గా అవతరిస్తోందని చెప్పారు. అదేవిధంగా టాటా పవర్ కూడా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టనున్నట్లు చెప్పారు. భోగాపురం ఎయిర్?పోర్ట్ కొద్దీ నెలలో అందుబాటులోకి వస్తుందని లోకేశ్ వివరించారు. "బ్రాండ్ బాబు నినాదం ఎప్పుడైతే తిరిగి వచ్చిందో అప్పుడే విశాఖ బ్రాండ్ అత్యున్నత శిఖరాలకు దూసుకెళ్లింది. విశాఖ బ్రాండ్‌ను నిలబెట్టుకునేందుకు సర్కార్ ఎంతో కృషి చేస్తోంది. వైజాగ్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. దేశంలో ఏపీలో తప్ప ఎక్కడైనా పెట్టుబడులు పెడతామని బహిరంగంగా ప్రకటించిన లూలూ సంస్థ సైతం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తోంది. ఎన్నికోట్లు పెట్టుబడులు వస్తున్నాయోనన్నది కాదు. ఎంతమందికి ఉపాధికి కల్పిస్తున్నామో అన్నదే ముఖ్యం. వరుణ్ గ్రూప్ నిర్మించే ఈ హోటల్‌లో ఆఫీస్ స్పేస్ ఏర్పాటు నాలో మరింత ఉత్సాహాన్ని నింపింది. వారికి హామీ ఇస్తున్నాను. రెండేళ్లలో వారి ఆఫీస్ స్పేస్ మొత్తం నిండిపోవడం ఖాయం." - లోకేశ్, మంత్రి వరుణ్ గ్రూప్? రాకతో విశాఖపట్నం రూపురేఖలు మారనున్నాయని కేంద్ర మంత్రి రామ్మోహన్?నాయుడు తెలిపారు. చంద్రబాబు, లోకేశ్‌కు విశాఖపై అమితమైన ప్రేమ ఉందని చెప్పారు. పెట్టుబడులు పెట్టేందుకు ఎవరు ముందుకొచ్చినా ముందుగా ఉత్తరాంధ్రలోనే ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనిత, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, మాజీ కేంద్ర మంత్రి అశోక్‌గజపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ నగరంలోని.గరీబ్ బస్తి వాసులకు ఇంటి నెంబర్లు కరెంటు సౌకర్యం కల్పించాలి



**నర్సంపేట డివిజన్, తెలంగాణ సేన :** సాంబరాజు మల్లేశం విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి సోమవారం ఆధ్వర్యంలో నర్సంపేట తహసిల్దార్ కార్యాలయం పాత వద్ద.నిర్వహించిరిలే దీక్షలు ఏడవ రోజు చేరుకోవడం జరిగింది దీక్షకి.సభాధ్యక్షులుగా. తడుగుల విజయ్ మాదిగ ఎంఎస్పి పార్టీ రాష్ట్ర నాయకులు నిర్వహించగా ముఖ్య అతిథులుగా సాంబరాజుమల్లేశం విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి తెలంగాణ ఉద్యమ నేత దళితరత్న కల్లే పెల్లి ప్రణయ్ దీప్ ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రతినిధి మహాజన సోషలిస్టు పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ అంబేద్కర్ నగరంలోనిగరీ బస్తీగుడిసెలు కు పట్టాలుఇచ్చికాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలి.నర్సంపేట పట్టణంలో నిలువ.నీడలేని వందలాదిమంది పేదలు ప్రభుత్వ స్థలాలను గుర్తించి నివాసాలు ఏర్పరచుకొని నాలుగు సంవత్సరాలుగా కావస్తుంది. లి కాలనీలో కనీస సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే గుర్తించి కాలనీకి సౌకర్యంలి కల్పించారు. కరెంటు మంచినీళ్లు రోడ్లు డ్రైనేజీ తదితర తదితర సౌకర్యాలు కల్పించకపోవడం అన్యాయం అన్నారు.భూములనుక్రమబద్ధీకరించి గుడిషవాసులకు పట్టాలి ఇవ్వాలి. ప్రభుత్వ భూములను కబ్జా చేసి తమ ఇష్టానుసారంగా క్రయవిక్రయాలు చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా అండగా నిలవడం ఆందోళన కలిగిస్తుంది అన్నారు. ఇప్పటికైనా తక్షణమే ప్రభుత్వ భూములు రక్షించి పేదల స్వాధీనంలోనిప్రభుత్వ భూములకు పట్టాలు ఇచ్చి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. లేకపోతే పేదల పోరాటాలు రాజకీయాలకతీతంగా ఉధృతం అవుతాయని తెలిపారు. వరంగల్ రోడ్ లోని 813 సర్వేనెంబర్ పట్టణ శివారులో గత నాలుగు సంవత్సరాల క్రితం ఏర్పడిన అంబేద్కర్ నగర గరీబస్తికాలనీ వాసులకు తక్షణమే ఇంటి నెంబర్లు కేటాయించి కరెంటు వీధిలైట్లు త్రాగునీటి సౌకర్యం రోడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ దీక్షల్లో ప్రజా దండోరా దండోరా జాతీయ వ్యవస్థకు అధ్యక్షుడు విమల విజయ సమ్మక్క సరస్వతి సుధారాణి స్వరూప నిర్మల వనజ రామకృష్ణ నాగలక్ష్మి రాజు రాజమణి చక్రపాణి వేణు సుధాకర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# 2వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

**మహబూబాబాద్, తెలంగాణ సేన :** ఎప్రిల్ ల్ 5 వ తేదీన నారాయణ పేట్ జిల్లా కేంద్రంలో జరిగే తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (అనుబంధం ) రాష్ట్ర 2వ మహాసభలలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కొత్తపల్లి రవి కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభ గోడపత్రికను జిల్లా కేందంమైన మహబూబాబాద్ లో నేడు విడుదల చేశారు.ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రావ్యాప్తంగా దాదాపు 60 వేల మంది గ్రామ పంచాయతీ కార్మికులు ఉన్నారని,వారు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామం లోని అన్నిరకాల పనులు చేస్తున్నారు. అటువంటి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలు ఇవ్వకుండా ఇవ్వటం లేదన్నారు.కేవలం 9500 ఇచ్చి సంవత్సరాల తరబడి వారిని శ్రమ దోపిడీ చేస్తున్నదని పీఫ్ కానీ, ఈ ఎస్ ఐ కానీ లేదని అన్నారు. మేము అధికారం లోకి వస్తే వెంటనే పర్మినెంట్ చేసి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని నాటి ప్రతిపక్ష నేటి అధికార కాంగ్రెస్ పార్టీ కార్మికుల సమ్మే సందర్భంగా ఇచ్చిన హామీ పదిహేను నెలలు గడుస్తున్నా కూడా ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శలు చేశారు. కనీసం ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలు కూడా ఇవ్వడం లేదు. ప్రతి రెండు నెలలకు ఒక సారి వేతనాలకోసం కార్మికులు ఆందోళనలు చేయవలసిన దుస్థితి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేసినారు. కార్మికుల సమస్యలు పరిస్కారం కావాలంటే ప్రతినిత్యం పోరాటం చేయాలనీ అందుకు ప్రతి కార్మికుడు



సిద్ధంగా ఉండాలని రవి పిలుపునిచ్చారు.కార్మిక వర్గం తరపున అనేక పోరాటాలు నిర్వహించింది అన్నారు. అనునుత్యం కార్మికుల తలలో నాలుకగా ఉంటూ వారి సమస్యలపై మరియు సమాజం లోని అసమానతలపై నిత్యం వారిని చైతన్యం చేస్తుంద అన్నారు. అందులో భాగంగానే గత పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్తు పోరాటాల నిర్మాణం కొరకు మహాసభ ను జరుపుకొంటున్నది. ఏప్రిల్ 5 జరుగు రాష్ట్ర 2వ మహాసభలలో గ్రామ పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.జిల్లా ప్రధాన కార్యదర్శి బిళ్ల కంటి సూర్యం మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా నుండి గ్రామపంచాయతీ కార్మికులు ఈ మహాసభలకు అత్యధిక మంది హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో జీపీ కార్మిక యూనియన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు పాడియా బీకు, బ్రహ్మచారి రవికుమార్ రాజేష్ రాజు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆకారపు కృష్ణస్వామికి బయోగ్రఫీ మెమంటోను అందజేసిన ఆర్టీసీ గురిజాల ఉద్యోగులు

**వరంగల్ జిల్లా తెలంగాణ సేన న్యూస్ తేదీ, మార్చి 31 :** నర్సంపేట: నర్సంపేట మండలం గురిజాల గ్రామానికి చెందిన ఆర్టీసీ మెకానిక్ ఉద్యోగి ఆకారపు కృష్ణస్వామి, లలిత దంపతుల పదవీ విరమణ నర్సంపేట డిపోలో జరుగగా... అదే గ్రామానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగుల బృందం అతని బయోగ్రఫీ కి చెందిన మెమొంటోను డిపో మేనేజర్ కె. ప్రసూనలక్ష్మితో కలిసి బహు మానంగా అందజేశారు.మెకానిక్ ఆకారపు కృష్ణస్వామి బాల్యము, విద్యాభ్యాసము, ఉద్యోగ ప్రస్థానం, వైవాహిక జీవితము తదితర అంశాలతో కూడిన అతని బయోగ్రఫీని డిపోకు చెందిన ఉద్యోగి గొలనకొండ వేణు రచించిన మెమొంటోను గురిజాల గ్రామానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగుల బృందం గొలనకొండ వేణు, డ్యాగల వెంకట్రామనర్సయ్య, నామాల అశోక్ కుమార్, గొడిశాల వెంకటేశ్వర్లు, నీలం రాజ్ కుమార్, ఆముదాల లక్ష్మీనారాయణలు



బయోగ్రఫీ మెమొంటోను కృష్ణ స్వామి, లలిత దంపతులకు అందించి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గొలనకొండ వేణు మాట్లాడుతూ ఆర్టీసీలో మెకానిక్ గా కృష్ణస్వామి సుదీర్ఘంగా 27 సంవత్సరాల పాటు వృత్తినే దైవంగా భావించి చేసిన సేవలను ఆయన కొనియాడారు. మానవ శరీరంలోని ప్రతి పార్ట్ మనిషికి ఎంత ముఖ్యమైనదో, బస్సుకున్న ప్రతి పార్ట్ కూడా అంతే ముఖ్యమైనదని, బస్సు పరిపూర్ణమైన ఆరోగ్యంగా ఉండాలంటే... దాని వెనకాల మెకానిక్ ల పాత్ర ఎంతో క్రియాశీలకంగా ఉంటుందని ఆయన అభివర్ణించారు. ప్రయాణికులను రోడ్లమీద బస్సులు ప్రమాదాలకు గురికాకుండా సురక్షితంగా వారి యొక్క గమ్యస్థానాలకు డ్రైవర్లు చేర్చుతున్నారంటే దాని వెనకాల మెకానిక్ ల కృషి ఎంతో ఉందని ఆయన అన్నారు. మెకానిక్ లు కూడా డాక్టర్లు, వెటర్నరీ డాక్టర్ల వలె బస్సులకు ట్రీట్మెంట్ చేస్తారని అన్నారు. డాక్టర్లు పేషెంట్లకు ఆరోగ్య సమస్యలను చెబితే వారికి ట్రీట్మెంట్ చేస్తారని, వెటర్నరీ డాక్టర్లు మూగజీవాల యొక్క శరీర సమస్యలను, వాటి ప్రవర్తన తీరును బట్టి ట్రీట్మెంట్ చేస్తారని, అదే విధంగా వాహనాల వైద్యులు ( మెకానిక్) కేవలం వాహనాల సౌండ్ ని బట్టి వాటి సమస్యలను తెలుసుకొని రిపేర్ చేస్తారని కాబట్టి మెకానిక్ వృత్తి పవిత్రమైనదని, చాలా విలువైనదని, కావున ప్రతి ఒక ఆర్టీసీ ఉద్యోగి మెకానికులను గౌరవించి కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరి మీద ఉందని, మెకానిక్ ల ప్రాముఖ్యతను తెలియపరిచారు. మెకానిక్ లు ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకూడదని, విధి నిర్వహణలో అతి జాగ్రత్తగా ఉండి బస్సులను ఎప్పటికప్పుడు బాగు చేయవలసిన అవసరం ఉందని ఆయన మెకానికుల గొప్పతనాన్ని కొనియాడారు.ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన కక్కెర్ల రవీందర్ గౌడ్, ఎడ్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూ సంఘటిత శక్తిని ప్రదర్శించాలి

**హనుమాన్ శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణలో**

**విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సహాయ కార్యదర్శి తోట భాను ప్రసాద్**

**భువనగిరి ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్ ,మార్చి 31 :** వీర హనుమాన్ విజయ శోభాయాత్ర, విజయవంతానికి యువకులు హిందూ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ,విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ,తోట భాను ప్రసాద్ పిలుపునిచ్చారు.విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలో ఏప్రిల్ 12 న జరగబోయే వీర హనుమాన్ విజయ శోభాయాత్ర విజయవంతం కై బ్రాహ్మణ వాడలోని భవాని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో సమావేశం నిర్వహించిసందర్భంగా పోస్టర్ ఆవిష్కరించారు.హిందువులందరూ పరిపూర్ణంగా ఈ శోభాయాత్రలో పాల్గొనాలని కోరారు హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి సుక్కల శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ గ్రామ గ్రామాన యువత తరలివచ్చి శోభాయాత్రని విజయవంతం చేసి హిందూ సంఘటన శక్తిని ప్రదర్శించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కోశాధికారి చామ రవీందర్ ,జిల్లా సామాజిక సమరసత కన్వీనర్ కేమోజు మల్లికార్జున చారి, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ సాల్వేరు వేణు , వి హెచ్ పి పట్టణ అధ్యక్షులు కందికొండ సహదేవ్ ,సత్సంగ్ ప్రముఖ్ వల్లబోజు సతీష్ ,జిల్లా బజరంగ్ దళ్ కన్వీనర్ బింగి



భరత్ కుమార్ , పట్టణ కన్వీనర్ నమిలె నవీన్, ఆర్ఎస్ఎస్ సుదగాని ఆంజనేయులు ,ఎం కె శ్రీధర్, హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు దేవరకొండ నరసింహా చారి , పట్టణ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు రత్నపురం శ్రీశైలం, బిజెపి పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం, హిందువాహిని జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ చందు, పట్టణ అధ్యక్షులు రామరాజు, ప్రధాన కార్యదర్శి ఉడతల భరత్ , వి హెచ్ పి రామన్నపేట ప్రఖండ అధ్యక్షు లు నోముల శ్రీనివాస్, అధ్యక్షులు కొండూరు శంకర్, బచ్చు రమేష్, పట్టణ సత్సంగ్ ప్రముఖ్ శ్రీనివాస్ చారి, భువనగిరి మండల కార్యదర్శి రెడ్డబోయిన బాలరాజు, బీబీనగర్ మండల అధ్యక్షులు రాజు ,బీజేవైఎం పట్టణ అధికార ప్రతినిధి సాయికిరణ్, సాయి కృష్ణ, నాగరాజు, మల్లికార్జున్, రావుల సంతోష్, వాస సాయి చరణ్, విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ హిందువాహిని ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీ ల రాజ్యసాధన కోసమే జేఏసీ

**ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జేఏసీ**

**సమన్వయకర్త డాక్టర్ విశారదన్ మహరాజ్**

**తెలంగాణ సేన హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రాన్ని స్థాపించడానికి ఆనాడు అన్ని పార్టీలు అన్ని సంఘాలు ఒక్కటిగా చేయడానికి తెలంగాణ రాష్ట్ర జేఏసీ ని స్థాపించినప్పుడు అదే తెలంగాణలో మన బీసీ ఎస్సీ ఎస్టీల రాజ్యం స్థాపించడానికి తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీ రాజ్య సాధన జేఏసీ అవసరం ఉందని భావించి ఈ వేదికని ప్రారంభిస్తున్నామని %జీూజ% సమన్వయకర్త సభ అధ్యక్షులు డాక్టర్ విశారదన్ అన్నారు. సోమవారం అయన హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీ రైట్స్ రాజ్యాధికార సాధన జేఏసీ ఆవిర్భావ సభలో ప్రసంగించారు. తెలంగాణలో 93% ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీల హక్కులు అంతిమంగా రాజ్యాధికారం కోసం ఈ నూతన జేఏసీ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవి, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ తిరుమలి , జస్టిస్ ఈశ్వరయ్య ఏపీ రిటైర్డ్ చీఫ్ జస్టిస్ నేషనల్ బీసీ కమిషన్ చైర్మన్ చేతులమీదుగా ఈ నూతన జేఏసీ ఆవిర్భావం ఘనంగా జరిగింది.ఈ జేఏసీ ఒక తెలంగాణ రాజ్య సాధన దీపంగా వెలిగిద్దామని దీనిని ఆరకుండా చేతులు అడ్డం పెట్టుకుని బీసీ ఎస్సీ ఎస్టీ జే ఏ సి తో కాపాడుకుందామని ఉస్మానియా యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ రామయ్య యాదవ్ గారు అన్నారు.తెలంగాణ రాష్ట్రం వచ్చిందే నీళ్లు నిధులు నియామకాలు అనే నినాదంతో... తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీలకు భూమి లేనప్పుడు ఆ నీళ్లు ఎవరి పొలంలో పారాలి ? పన్నులు కట్టేది బీసీ ఎస్సీ ఎస్టీలు కానీ ఆ పనుల ద్వారా వచ్చిన సొమ్మును మాత్రం అగ్రవర్ణాలు దోచుకుంటున్నారు... మరీ ఇందులో మన బీసీ,ఎస్సీ, ఎస్టీ వాటా ఎంత ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని స్థాపించడానికి ఆనాడు అన్ని పార్టీలు అన్ని సంఘాలు ఒక్కటిగా చేయడానికి తెలంగాణ రాష్ట్ర జేఏసీ ని స్థాపించినప్పుడు అదే తెలంగాణలో మన బీసీ ఎస్సీ ఎస్టీల రాజ్యం స్థాపించడానికి కూడా తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ అవసరం ఉందని భావించి ఈ వేదికని ప్రారంభించాలి అని %జీూజ% సమన్వయకర్త సభ అధ్యక్షులు డాక్టర్ విశారదన్ అన్నారు. తెలంగాణలో 93% ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీల హక్కులు అంతిమంగా రాజ్యాధికారం కోసం ఈ నూతన జేఏసీ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవిలు జస్టిస్ ఈశ్వరయ్య ఏపీ రిటైర్డ్ చీఫ్ జస్టిస్ నేషనల్ బీసీ కమిషన్ చైర్మన్ చేతులమీదుగా ఈ నూతన జేఏసీ ఆవిర్భావం జరిగింది. ఈ జేఏసీ ఒక దీపంగా వెలిగింది దీనిని ఆరకుండా చేతులు అడ్డం పెట్టుకుని కాపాడుకుందాం అని ఉస్మానియా యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ రామయ్య యాదవ్ గారు అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిందే నీళ్లు నిధులు నియామకాలు అనే నినాదంతో... తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీలకు భూమి లేనప్పుడు



ఆ నీళ్లు ఎవరి పొలంలో పారాలి ? పన్నులు కట్టేది బీసీ ఎస్సీ ఎస్టీలు కానీ ఆ పనుల ద్వారా వచ్చిన సొమ్మును మాత్రం అగ్రవర్ణాలు దోచుకుంటున్నారు... మరీ మన బీసీ,ఎస్సీ, ఎస్టీ వాటా ఎంత అన్నారు.తెలంగాణ రాష్ట్రాన్ని స్థాపించడానికి ఆనాడు అన్ని పార్టీలు అన్ని సంఘాలు ఒక్కటిగా చేయడానికి తెలంగాణ రాష్ట్ర జేఏసీ ని స్థాపించినప్పుడు అదే తెలంగాణలో మన బీసీ ఎస్సీ ఎస్టీల రాజ్యం స్థాపించడానికి కూడా తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ అవసరం ఉందని భావించి ఈ వేదికని ప్రారంభించాలి అని %జీూజ% సమన్వయకర్త సభ అధ్యక్షులు డాక్టర్ విశారదన్ అన్నారు. తెలంగాణలో 93% ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీల హక్కులు అంతిమంగా రాజ్యాధికారం కోసం ఈ నూతన జేఏసీ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవిలు జస్టిస్ ఈశ్వరయ్య ఏపీ రిటైర్డ్ చీఫ్ జస్టిస్ నేషనల్ బీసీ కమిషన్ చైర్మన్ చేతులమీదుగా ఈ నూతన జేఏసీ ఆవిర్భావం జరిగింది. ఈ జేఏసీ ఒక దీపంగా వెలిగింది దీనిని ఆరకుండా చేతులు అడ్డం పెట్టుకుని కాపాడుకుందాం అని ఉస్మానియా యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ రామయ్య యాదవ్ గారు అన్నారు.తెలంగాణ రాష్ట్రం వచ్చిందే నీళ్లు నిధులు నియామకాలు అనే నినాదంతో... తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీలకు భూమి లేనప్పుడు ఆ నీళ్లు ఎవరి పొలంలో పారాలి ? పన్నులు కట్టేది బీసీ ఎస్సీ ఎస్టీలు కానీ ఆ పనుల ద్వారా వచ్చిన సొమ్మును మాత్రం అగ్రవర్ణాలు దోచుకుంటున్నారు... మరీ ఇందులో మన బీసీ,ఎస్సీ, ఎస్టీ వాటా ఎంత అన్నారు.ఇంకా ఈ సమావేశం లో... దాసోజు లలిత, అశోక్ సార్, రాంబాబు నాయక్, తెలంగాణ విఠల్, ప్రొఫెసర్ లు, %దీజ,ాజ,ాు% నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కుంభం

**కాంగ్రెస్ పార్టీ నాయకుడు అమానతుల్లా గృహంలో వేడుకలో ఎమ్మెల్యే**

**భువనగిరి ప్రతినిధి ,తెలంగాణ సేన న్యూస్ ,మార్చి 31 :** రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలకు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహమ్మద్ అమానుతుల్లా ఆహ్వానం మేరకు గృహంలో వేడుకలో పాల్గొంచుకున్నారు.కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్ , తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తి ,మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్లు ఈరపాక నరసింహ పట్టణ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# హనుమాన్ శోభయాత్ర కరపత్ర ఆవిష్కరణ



**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన :** 12న వీర హనుమాన్ విజయయాత్ర పాల్గొననున్న జగద్గురు శ్రీశ్రీశ్రీ డా. శ్రీకాంతేంద్ర స్వాములవారు.విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి సందర్భంగా 12 వ తేదీన వీర హనుమాన్ విజయ యాత్ర శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ నర్సంపేట ప్రఖండ అధ్యక్షులు చోల్లేటి జగదీశ్వర్ కార్యదర్శి వేల్పుల శ్రీధర్ బజరంగ్ దళ్ కన్వీనర్ మేరుగు శోభన్ కుమార్ తెలిపారు. సోమవారం నర్సంపేట లోని శివాంజనేయ స్వామి దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించి కరపత్ర ఆవిష్కరణ చేసి వారు మాట్లాడుతు శోభాయాత్ర ప్రారంభం లో వెయ్యి మందితో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందన్నారు. సాయంత్రం 3:30 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి జగద్గురు శ్రీశ్రీశ్రీ డా.శ్రీకాంతేంద్ర స్వాములవారు శోభయాత్ర ప్రారంభిస్తారు నర్సంపేట అయ్యప్ప స్వామి దేవాలయం నుండి శోభయాత్ర ప్రారంభమై సర్వపురం హనుమాన్ దేవాలయం వద్ద హనుమాన్ హారతి తో ముగుస్తుంది హిందూ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని శోభాయాత్ర విజయవంతం చేయాలనీ తెలిపారు.ఈ కార్యక్రమం లో జిల్లా బద్దిక్ ప్రముఖ్ భాషబోయినా వెంకటేష్ విశ్వహిందూ పరిషత్ జిల్లా సహా కార్యదర్శి మల్యాల రవి నర్సంపేట సేవా ప్రముఖ్ %ఎతీ%. వీరన్న గో రక్ష ప్రముఖ్ గన్నోజు నాగార్జున సురక్ష ప్రముఖ్ చరణ్ లీగల్ సెల్ కన్వీనర్ రాజు ఖానాపురం బజరంగ్ దళ్ కన్వీనర్ హరిప్రసాద్ నల్లబెల్లి ప్రముఖ్ శంకర్ రెడ్డి యాదండ్ల రాజు గద్దం రాము కిరణ్ హనుమాన్ గురుస్వాములు రాజన్న గోపగాని వెంకటేశ్వర్లు సుదర్శన్ రాము రాందాస్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ చార్జీలు పెంపు




**హైదరాబాద్ మార్చి 31 :** రాష్ట్ర రాజధాని ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ ఛార్జీల పెంచారు. ఏప్రిల్ ఒకటి నుంచి అమలులోకి రానున్నాయి. కారు, జీపు, లైట్ వాహనాలకు కిలోమీటర్‌కు రూ.2.34 నుండి రూ.2.44కు పెంపు మినీ బస్, ఎల్సీవీలకు కిలోమీటర్‌కు రూ.3.77 నుండి రూ.3.94కు పెంపు 2 యాక్సిల్ బస్సులకు కిలోమీటర్‌కు రూ.6.69 నుండి రూ.7కు పెంపు భారీ వాహనాలకు కిలో మీటర్‌కు రూ.15.09 నుండి రూ.15.78కు పెంచనున్నట్లు సమాచారం.

# ఎండి నజీర్ శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ ఎమ్మెల్యేలు



**భువనగిరి ప్రతినిధి ,తెలంగాణ సేన న్యూస్, మార్చి 31 :** రంజాన్ పర్వదినం పురస్కరించుకొని ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండి నజీర్ కు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిలు నజీర్ భువనగిరి లోని ఆయన నివాసం కు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

# పుట్టినరోజు వేడుకకి హాజరై చిన్నారులను ఆశీర్వదించిన నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి

**నెక్కొండ తెలంగాణ సేన :** మండలం చంద్రుగొండ గ్రామానికి చెందిన మహంకాళి ప్రభాకర్ గారి కుమారుడు యశ్విన్ మొదటి పుట్టినరోజు వేడుకకు హాజరై చిన్నారులు ప్రేమాసి యశ్విన్ లను ఆశీర్వదించిన నర్సంపేట శాసనసభ్యులు దోంతి మాధవ రెడ్డి ఈ కార్యక్రమంలో నర్సంపేట పిసిసి సభ్యులు రంజిత్ రెడ్డి, పెండెం రామానంద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కీ అశోక్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్ నర్సంపేట కోర్టు ఏజీపీ అడ్వకేట్ బండి శివకుమార్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కుసుమ చెన్నకేశవులు ఈదునూరి సాయి కృష్ణ బూరుగు నరేష్ తదితరులు చిన్నారులను ఆశీర్వదించారు.



# ఈత మంచిదే కాని ఓ తల్లి కడుపుకోత మంచిది కాదు

**దేశి సాయి పటేల్ , నర్సంపేట పట్టణ యువజన కాంగ్రెస్ కార్యదర్శి**



**తెలంగాణ సేన నర్సంపేట డివిజన్ :** వేసవి కాలం కావడంతో పట్టణంలో విద్యార్థులు యువకులు పొలాల వెంట, బావుల వెంట తిరిగి కాలక్షేపం సాగిస్తున్నారని బావులలో చెరువులలో స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి మునిగి తమ కుటుంబాలకు తీరని శోకం కలిపిస్తున్నారని నర్సంపేట జాతీయ కాంగ్రెస్ (ఐ) యువజన కార్యదర్శి దేశి సాయికిరణ్ పటేల్ అన్నారు. ఎండ వేడిమికి ఉక్కపోత ఉండడంతో ఎక్కడైనా చెరువులలో,బావులలో, కాలువలలో ఈతకు వెళ్లి సేద తీరుతుంటారని ఈతలు అజాగ్రత్త వలన విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని తల్లిదండ్రులు కడుపుకోత మిగులుస్తున్నారని ఇలాంటి విషాద సంఘటనలు జరగకుండా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని ఈత వచ్చిన వారి వెంట తీసుకెళ్లాలి ఈతల నేర్పించాలని ఎండ వేడిమికి తట్టుకోలేక చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ వేసవిలో ఈతలకు వెళ్లి మృత్యువాత పడుతున్నానని ఇలాంటి సంఘటనలు వలన తల్లిదండ్రులకు గర్భశోకం మిగులుతుందని సంఘటన జరగకుండా పునరావృతం కాకుండా ఉండాలంటే తగు జాగ్రత్తలు అవసరం అని దేశి సాయికిరణ్ పటేల్ అన్నారు.

# సహనం దాన దయా గుణ ప్రతిరూపమే రంజాన్

**ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన దరిపెల్లి ప్రవీణ్ కుమార్**



**భువనగిరి ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్, మార్చి 31 :** సహనం ,దాన ,దయ ,గుణ ప్రతిరూపమే రంజాన్ పర్వదినం అని ,వాత్సల్య గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ , కృషి ఐటిఐ, పారా మెడికల్ ఇన్స్టిట్యూట్, శ్రీ వాగ్దేవి జూనియర్, ఒకేషనల్ కళాశాల ,విజ్ఞాన్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ,సాయి కృప డిగ్రీ ,పీజీ కళాశాల ,ఎంజి యూనివర్సిటీ ఉమ్మడి నల్గొండ జిల్లా ఫైనాన్స్ సెక్రటరీ దరిపల్లి ప్రవీణ్ కుమార్ అభివర్ణించారు.ముస్లిం సోదర సోదరీ మణులందరికీ ,రంజాన్ పండగ పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేశారు.సాంప్రదాయ పద్ధతుల ఆచరణ క్రమంలోనే, మంచి విలువలు కలిగిన సమాజం ముందుకు సాగుతుందని అన్నారు. తద్వారా , బావి మానవాళి మనుగడకు మార్గం సుగమం అవుతుందని తెలిపారు.

# నమాజ్ పల్లి లో వార్షిక బ్రహ్మోత్సవాలు

**స్వయంభు పూర్ణగిరి శ్రీ సుదర్శన లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాలు**

**ఏప్రిల్ 14 న స్వామి వారి స్వాతి జన్మ నక్షత్రం సందర్భంగా కళ్యాణం**



**భువనగిరి ప్రతినిధి ,తెలంగాణ సేన న్యూస్, మార్చి 31 :** నమాత్ పల్లి లో పూర్ణగిరి లక్ష్మి నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల వివరాలను, దేవాలయ కమిటీ చైర్మన్ రావి సురేందర్ రెడ్డి ఒక ప్రకటనలో విడుదల చేశారు. భువనగిరి మండలం నమాజ్ పల్లి గ్రామంలో, స్వయంభు పూర్ణ గిరి శ్రీ సుదర్శన లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా, లగ్న పత్రికను విడుదల చేశారు. ఏప్రిల్ 12 నుంచి 14 వరకు వైభవంగా ఉత్సవాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.12 వ తేదీ శనివారం ఉదయం 8 గంటలకు ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. 13వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటలకు కొండా పైన స్వామి వారి పాదాల పూజ, ఉదయం 8:30 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం,14 వ తేదీ సోమవారం స్వామి వారి స్వాతి జన్మ నక్షత్రం సందర్భంగా , లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణం నిర్వహించడం జరగనుందని తెలిపారు.ఆలయ ప్రధాన అర్చకులు జ్యోషి పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారి కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆలయ ధర్మకర్తలు పబ్బతి ఉప్పలయ్య, బత్తిని సుధాకర్ గౌడ్, సురపంగ పద్మ నర్సింహా, ఎల్లంల జంగయ్య యాదవ్ , మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎల్లంల జంగయ్య యాదవ్, గుడి సేవకులు కొత్తపల్లి నాగయ్య, శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.

# వైరస్‌ను మించిన వైరల్

విశ్వ మహమ్మారిగా మారిన కరోనా సృష్టించిన బీభత్సం ఇంతా అంతా కాదు. 70 కోట్ల పైచిలుకు మంది వైరస్ బారిన పడితే అందులో ఏడు లక్షల మంది కన్నా ఎక్కువే ప్రాణాలు విడిచారు. సకల వ్యవస్థలు స్తంభించిపోయాయి. అంతటి ఘోరకలి చూసి ఉండటం వల్ల ఇప్పుడు ఏ చిన్న వైరస్ చిటుక్కుమన్నా ప్రపంచం ఉలిక్కి పడుతున్నది. తాజాగా చైనాలో బయటపడిన హెచ్ఎంపీవీ (హ్యూమన్ మెటాన్యూమో వైరస్) కలకలం సృష్టిస్తున్నది. కరోనా భయావహ జ్ఞాపకాల నీడలో ఈ సరికొత్త వైరస్ కొంత బెదురు కలిగించడంలో ఆశ్చర్యం లేదు. కరోనా లాగే ఇదీ చైనాలో పుట్టడం, సోషల్ మీడియా ఊదరగొట్టడం ప్రస్తుత కలకలానికి కొంత కారణమని చెప్పక తప్పదు. గతవారం రోజులుగా మీడియాలో హెచ్ఎంపీవీ గురించిన కథనాలు చక్కర్లు కొడుతున్నాయి. వైరస్ కన్నా వైరల్ అవుతున్న ప్రచారం ప్రమాదకరం. కరోనా పిల్లలకు ఎక్కువగా సోకకపోవడం, ప్రస్తుత వైరస్ పిల్లల్లోనే ముఖ్యంగా కనిపిస్తుండటం వంటి కారణాలు భయాలకు దారితీస్తున్నాయి. ఇప్పటివరకు పది లోపు కేసులు, అదీ గుజరాత్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోనే నమోదయ్యాయి. చైనాలో వ్యాపించింది నిగూఢమైన, లేదా సరికొత్త వైరస్ అనే కథనాలు విరివిగా వచ్చాయి. కానీ, ఇవేవీ నిజాలు కావని వెల్లడైంది. ఏటా శీతాకాలంలో శ్వాసకోశ వైరస్‌లు కొత్త రూపంలో బయటపడటం జరుగుతూనే ఉంటుంది. హెచ్ఎంపీవీ కూడా అంతేనని తెలియవస్తున్నది. ఎలక్ట్రానిక్ మీడియాలో ఈ వైరస్‌ను కొవిడ్‌తో పోల్చి చూపడం జరుగుతున్నది. ఒక చానెల్ అయితే ఏకంగా మరో మహమ్మారి అంటూ చాటింపు వేస్తున్నది. ఇదంతా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరుతుండటం వల్ల అనవసరమైన ఆందోళనకు దారితీస్తున్నది. కొవిడ్‌కు, ప్రస్తుత వైరస్‌కు మధ్య మౌలిక తేడా ఏమిటో ప్రజలు తెలుసుకుంటే ఈ పరిస్థితి ఉండనే ఉండదు. కొవిడ్ మూలాలు ఇప్పటికీ తెలియవు. అది నిజంగా కొత్త వైరస్. కాగా హెచ్ఎంపీవీ తెలిసిన మూలాల నుంచి వచ్చిందే. పైగా అది ఆర్ఎన్ఏతో తయారైనది కాగా ప్రస్తుత వైరస్ డీఎన్ఏతో తయారైంది. అంతేకాదు, 2001 నుంచి ఈ వైరస్ వైద్య ప్రపంచానికి తెలిసిందేనని గూగుల్ సెర్చ్ చేసినా తెలిసిపోతుంది. కొత్త వైరస్ పూర్తిగా ఒకటి కంటే ఎక్కువ దేశాల్లో వ్యాపిస్తేనే దాన్ని పాండెమిక్ లేదా మహమ్మారి అంటారు. చైనాలో పెద్ద ఎత్తున శ్వాసకోశ వ్యాధులు పెరిగినట్టు తనకు ఎలాంటి సమాచారం అందలేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించడం గమనార్హం. గత ఏడాది కన్నా ఈ ఏడాది కేసులు తక్కువగా ఉన్నట్టు చైనా వ్యాధుల నియంత్రణ, నివారణ విభాగం పేర్కొనడం ఆలోచించాల్సిన విషయం. మరోవైపు సరికొత్తదీ అని ప్రచారం చేస్తున్న వైరస్ గురించి అంతర్జాతీయ మీడియా పెద్దగా పట్టించుకోవడం లేదనేది గుర్తించాలి. హెచ్ఎంపీవీ గురించి భయపడిపోయి బెంగటిల్లడం కన్నా తగిన జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరని వైద్య ప్రపంచం అంటున్నది. చికిత్స కంటే నివారణే ప్రధానమనేది తెలిసిందే. ఏ వైరస్ అయినా వ్యాపించే మార్గం ఒకటే. కరోనా పుణ్యమా అని జాగ్రత్తలూ తెలిసినవే. అవి సామాన్యమాన రీతిలో పాటించినా హెచ్ఎంపీవీ కాదు కదా, ఆ మాటకు వస్తే ఏ వైరస్ కూడా దరిచేరదు. ఈ లోగా సోషల్ మీడియా బెదరగొట్టకుండా ఉంటే చాలు.

# కొత్త నిర్ణయాలు .. కొనసాగిద్దాం ఇలా



నూతన సంవత్సరంలో అడుగు పెట్టేశారు.. హ్యాపీ హ్యాపీ న్యూ ఇయర్ అంటూ సందడి చేసే ఉంటారు.. బంధువులకు, స్నేహితులకు అందరికీ న్యూ ఇయర్ విషెస్ చెప్పే ఉంటారు..పనిలో పనిగా అది చేద్దాం, ఇది చేద్దాంఅని బోలెడు నిర్ణయాలు తీసుకొనే ఉంటారు. ఎప్పుడైనా ఆలోచించారా?..ఏటా జనవరిలో తీసుకునే నిర్ణయాలు ఎంతవరకు కొనసాగిస్తున్నామో అని. పోయిన ఏడాది తీసుకున్న నిర్ణయాలు ఎంతవరకు అమలు చేశారో.. ఓసారి గుర్తుతెచ్చుకోండి. చాలావరకు మధ్యలోనే వదిలేసి ఉంటారు కదా. మీరే కాదు.. ప్రపంచంలో 92 శాతం మంది ఇదే బాపతు. 2024 జనవరిలో 18 నుంచి 29 ఏళ్ల మధ్య వారు 49 శాతం, 30 నుంచి 49 ఏళ్ల మధ్య వారు 31 శాతం, 50 ఏళ్లు పైబడిన వారు 21 శాతం కొత్త నిర్ణయాలు తీసుకున్నారట. అందులో 43 శాతం మంది ఫిబ్రవరి నెలలో, 46 శాతం మంది ఆరు నెలల్లో తీసుకున్న నిర్ణయాలను గాలికి వదిలేశారట. కేవలం 8 శాతం మంది మాత్రమే ఏడాది చివరి వరకు వారు తీసుకున్న నిర్ణయాలను కొనసాగించారట. సో.. న్యూ ఇయర్‌లోకి అడుగు పెట్టగానే నిర్ణయాలు తీసుకోవడం, వాటిని మధ్యలోనే వదిలేయటం ఓ రివాజు అన్నమాట.

# కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీతో చర్చలు జరపాలి

**కడవెండి ముద్దు బిడ్డ కామ్రేడ్ రేణుక ఎన్కౌంటర్ లో మరణించడం బాధాకరం**

**ఇప్ప పృథ్వీ రెడ్డి**



**హైదరాబాద్, తెలంగాణ సీనియర్ న్యూస్ :** సోమవారం ఉదయం బస్తర్లో జరిగిన ఎన్కౌంటర్లో కడవెండి గ్రామానికి చెందిన మహిళా నాయకురాలు కామ్రేడ్ రేణుక అలియాస్ బాను మృతి చెందడం బాధాకరం.కామ్రేడ్ రేణుక 35 సంవత్సరాల క్రితం సమసమాజ స్థాపన కోసం పీపుల్స్ వార్ పార్టీలో చేరి క్రమంగా దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్ గా ఎదిగింది.మధ్యభారతదేశంలో విస్తారంగా ఉన్న అత్యంత విలువయిన ఖనిజ సంపదను కార్పొరేటు కంపెనీలకు అప్పజెప్పే కుట్రలో భాగంగానే బీజేపీ సర్కారు “ఆపరేషన్ కగార్” ను కొనసాగిస్తూ లక్షలాది పారామిలిటరీ బలగాలను దండకారణ్యంలో దింపి విచ్చలవిడిగా భూటకపు ఎన్కౌంటర్లు చేస్తూ ఈ మారణకాండకులి పాల్పడుతుంది అమాయకపు ఆదివాసీలను కూడా మావోయిస్టుల పేరుతో ఎన్కౌంటర్లకు పాల్పడుతూ దండకారణ్యం నుండి ఆదివాసీలను పూర్తిగా ఖాళీ చేయించడమో లేక చంపివేయడమో చేసి ఆ ప్రాంతాన్ని కార్పొరేటు కంపెనీలకు అప్పజెప్పే కుట్రలో భాగంగానే మోదీ సర్కారు ప్రణాళికాబద్ధంగా ఇదంతా చేస్తుంది.2024 లో 300 మందిని ఎన్కౌంటర్ల పేరు మీద చంపిన బీజేపీ సర్కారు 2025లో ఇప్పటికే దాదాపు 200 మందిని చంపివేయడం అమానవీయం.భారతదేశం తన పిల్లలను తానె చంపుకుంటున్న ఈ సందర్భంలో మేధావులు, బుద్ధిజీవులు, ప్రజాస్వామిక ప్రేమికులు గళమెత్తాలని విజ్ఞప్తి చేస్తున్నాను. మావోయిస్టు పార్టీని చర్చలకు ఆహ్వానించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి.కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి, పారామిలిటరీ బలగాలను దండకారణ్యంలో నుండి వెంటనే ఉపసంహరించి చర్చలకు అనుకూల వాతావరణాన్ని కల్పించాలి.

# శనివారం అర్ధరాత్రి ఊరుకొండ పేట దేవాలయ దర్శనానికి వచ్చినటువంటి యువతిపై అఘాయిత్యం దురదృష్టకరం



**తెలంగాణ సేన :** ఇలాంటి విషయాన్ని బిజెపి పార్టీ పూర్తిగా ఖండిస్తుంది.భారతీయ జనతా పార్టీ విచారణ వ్యక్తం చేస్తుంది.ఈ అమానవీయ సంఘటనకు బాధ్యులను గుర్తించి నిష్పక్షపాతంగా ఎంతటి వారినైనాలివిచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తుంది.ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ శాఖ బందోబస్తును ఏర్పాటు చేసి నిగా ను కఠిన తరం చేయాల్సిందిగా భారతీయ లిజనతా పార్టీ కోరుచున్నది.ఆలయ పవిత్రతను కాపాడాలని ఆలయ కమిటీ మౌలిక వసతులను కల్పించాలని వచ్చే భక్తులకు తగిన రక్షణ మరియు సదుపాయాలను కల్పించాలని అడుగడుగునా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని బాధితురాలికితగిన న్యాయం చేయాలని ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు జిల్లా కౌన్సిల్ మెంబర్ లక్ష్మారెడ్డి గారు మండల అధ్యక్షులు కే రాజేందర్ గౌడ్ జర్నల్ సెక్రెటరీలు పరశురాం బ్రహ్మచారి ఉపాధ్యక్షులు శివ మరియు కొమ్ము శ్రీను లక్ష్మణ్ గౌడ్ మల్లేష్ కిట్టు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్ లో పర్యటించిన ఉప్పల శ్రీనివాస్ గుప్తా

**దాహార్తి తీర్చడానికి చలివేంద్రం**

**ఉపయోగపడుతుంది ఉప్పల శ్రీనివాస్ గుప్తా**



**తెలంగాణ సేన :** ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఉపయోగపడతాయని టిపిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో అమర నాగేందర్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ ఎన్ సీ రాజమౌళి, మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, నంగునూరి సత్యనారాయణ,ఐ వి ఎఫ్ రాష్ట్ర నాయకులు పబ్బా చంద్రశేఖర్, కటకం శ్రీనివాస్, కొడిప్యాక నారాయణ,జిల్లా అధ్యక్షుడు నేతి శ్రీనివాస్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ యువజన అధ్యక్షుడు ఎన్ సీ సంతోష్, గోలి సంతోష్, ఐ వి ఎఫ్ సిద్దిపేట జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న, పట్టణ అధ్యక్షుడు కైలాస ప్రభాకర్ తో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించిన ఉప్పల శ్రీనివాస్ గుప్తా, అనంతరం శ్రీ సీతారామ ఉమామహేశ్వర ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, నిర్మాణంలో ఉన్న శ్రీ కమలం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణ పనులను సమీక్షించారు ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ అందరికీ నూతన సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ, శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో అందరూ కోరుకున్నది నెరవేరాలని ఆకాంక్షించారు, ప్రతి ఒక్కరూ సేవా నిరతి కలిగి ఉండాలని ఎండాకాలం ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు ఆర్యవైశ్యులకు అండగా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో అత్తెల్లి కిషన్, జగ్గయ్యగారి శ్రీనివాస్, ఆదిమూలం నారాయణ,ప్రసాద్, సామ శ్రీధర్,దొంతుల సత్యనారాయణ, గుడాల రాధాకృష్ణ,సంపత్, కొమురవెల్లి ప్రవీణ్, బ్రాహ్మణపల్లి బిక్షపతి, రుక్మయ్య,నోముల మహేందర్, కైలాస ప్రశాంత్,బాలేష్, సంతోష్ , సతీష్ , సిద్దేశ్వర్,అమర నాగేందర్ కుటుంబ సభ్యులు,ఫ్రెండ్స్ ఫర్ యు అసోసియేషన్ నాయకులు ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ సి యూ భూముల ఆక్రమణ నిలిపివేయాలి : డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ



**కాకతీయ యూనివర్సిటీ, తెలంగాణ సేన :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్ సీ యు) కి సంబంధించిన 400 ఎకరాల భూమిని కార్పొరేట్ కంపెనీలకు అప్పచెప్పే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేస్తుంది. నేడు డిఎస్ఎ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ నియంతృత్వ పోకడలను నిరసిస్తూ కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా డిఎస్ఎ రాష్ట్ర కన్వీనర్ శ్రావణ్ మాట్లాడుతూ తెలంగాణలోని కాంగ్రెస్ పాలకులు ఏడాదిన్నర కాలంలో విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని ప్రతిష్టాత్మక హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను బలవంతంగా గుంజుకోవడం సిగ్గుమాలిన చర్య అని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం భూముల అమ్మకం మానుకోవాలన్నారు. వరుస సెలవుల సమయంలో జీవవైవిధ్యం కలిగిన కంచె భూములను గచ్చిబౌలి అడవులను వందలాది జెసిబిలు, బుల్డోజర్లతో ధ్వంసం చేయడం అత్యంత అమానుషమైనదని, మరోవైపు భూముల అమ్మకాన్ని వెనక్కి తీసుకోవాలని శాంతియుత నిరసన తెలిపుతున్న విద్యార్థులపై పోలీసు బలగాల ద్వారా దాడి చేయించడం, వారిని భయబ్రాంతులకు గురిచేయడం హేయమైన చర్యగా డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ భావిస్తోందని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు లేవనెత్తుతున్న అంశాలపై యూనివర్సిటీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వానికి కొమ్ము కాయడమే అని, పర్యావరణాన్ని, జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్న ప్రభుత్వ చర్యలను మానుకొని విద్యార్థులతో చర్చించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే విద్యార్థులు ఆగ్రహానికి గురవుతారని, విద్యార్థులపై లాఠీచార్జి అక్రమ అరెస్టులను నిరసిస్తూ విద్యార్థి లోకం, రాష్ట్ర ప్రజలు, మేధావులు పోరాడాలని పిలుపునిస్తున్నామన్నారు. అలాగే ఈ సందర్భంగా రాష్ట్ర కో కన్వీనర్ ఎం. గణేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏదైతే తప్పులు జరిగినాయో కార్పొరేట్ శక్తులకి ధారథం చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థల భూములను కార్పొరేట్ కంపెనీలకు దారా దత్తం చేయడం జరిగింది. కేసీఆర్ నియంతృత్వానికి ఏ విధంగా అయితే తెలంగాణ ప్రాంత ప్రజలు పోరాటం చేసి ఫామ్ హౌస్ కి పరిమితం చేసారో, ప్రస్తుతం రేవంత్ రెడ్డి నీ కూడా పెద్దమ్మ తల్లి జూబ్లీహిల్స్ ఇంటికే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఎ రాష్ట్ర నాయకులు శివ, కృష్ణ, సంజయ్, మహేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# నిందితులు ఎవరైనా వదిలేది లేదు

**నిందితులు బిఆర్ఎస్ పార్టీకి చెందిన వారైనా**

**రాజకీయం చేయదలచుకోలేదు**

**జిల్లా ఎస్పీతోను ఈ సంఘటనపై మాట్లాడాను**

**బాధిత యువతికి న్యాయం చేస్తాం అండగా ఉంటాం**

**ఊర్కొండ సామూహిక అత్యాచార ఘటనపై అనిరుధ్ రెడ్డి స్పష్టీకరణ**



**తెలంగాణ సేన జడ్చర్ల, మార్చి 31 :** ఊర్కొండ మండలంలోని పబ్బతి ఆంజనేయ స్వామి దేవాలయ సమీపంలో జరిగిన సామూహిక అత్యాచార సంఘటనలో నిందితులు ఎవరైనా వదిలేది లేదని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారు ఏ పార్టీకి చెందిన వారైనప్పటికీ వారిని వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని జిల్లా ఎస్పీని కోరానని వెల్లడించారు.ఊర్కొండలోని ఆంజనేయ స్వామి దేవాలయ సమీపంలో ఆరుగురు యువకులు ఒక వివాహిత యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన సంఘటన పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే సోమవారం జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ తో ఫోన్లో మాట్లాడిన అనిరుద్ రెడ్డి పవిత్ర ప్రదేశంలో ఈ దురాగతానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. అత్యాచారానికి పాల్పడిన వారు బిఆర్ఎస్ పార్టీకి చెందిన వారని తన దృష్టికి వచ్చిందని అయితే ఈ సంఘటనకు పాల్పడింది ఎవరైనాప్పటికీ తాను రాజకీయాలు చేయదలుచుకోలేదని బాధిత యువతికి న్యాయం చేయాలన్నదే తన ఉద్దేశమని చెప్పారు. ఈ సంఘటనలో బాధిత యువతికి అండగా ఉంటానని అనిరుధ్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సంఘటన నేపథ్యంలోని ఊర్కొండ పోలీసులతో కూడా మాట్లాడి ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చి రాత్రి పూట బస చేసే భక్తులకు రక్షణ కల్పించాలని కోరారు. గ్రామంలోనీ యువతులు కూడా జరిగిన సంఘటన పట్ల భయాందోళనలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేయాలని కూడా అనిరుధ్ రెడ్డి ఆదేశించారు.

# ఎన్కౌంటర్ లో మావోయిస్టు నాయకురాలు మృతి



**దంతేవాడ, తెలంగాణ సేన :** ఎడిటర్ ప్రభాత్ పత్రిక గుమ్మడివేలి రేణుక అలియాస్ భాను అలియాస్ చైతే అలియాస్ సరస్వతి అలియాస్ దమయంతిని ఎన్ కౌంటర్ లో మృతి చెందింది.అమెకు రూ. 45 లక్షలు (ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ. 25 లక్షలు, తెలంగాణ ప్రభుత్వం రూ. 20 లక్షలు).దంతేవాడ మరియు బీజాపూర్ సరిహద్దు ప్రాంతాలలోని నెల్గోడ, ఇకెలి, బెల్నార్ గ్రామాల మధ్య ఉన్న అటవీ కొండలలో ఈ ఎన్కౌంటర్ జరిగింది.01 రైఫిల్‌తో పాటు పేలుడు పదార్థాలు, ల్యాప్‌టాప్, నక్సల్ సాహిత్యం మరియు ఇతర రోజువారీ వినియోగ వస్తువులు స్వాధీనం చేసుకున్న జవాన్లు.గుమ్మడివెల్లి రేణుక అలియాస్ భాను అలియాస్ చైతే అలియాస్ సరస్వతి అలియాస్ దమయంతి.

**హోదా:- సెంట్రల్ రీజినల్ బ్యూరో ప్రెస్ టీం ఇన్‌చార్జ్, ఎడిటర్ ప్రభాత్ పత్రిక,**
**విద్యార్హత:- ఎల్ఎల్‌బి**
**కడవెండి గ్రామం,,,**
**దేవరుప్పుల మండలం,,,ప్రస్తుతం జనగామ జిల్లా, తెలంగాణ.**

మహిళా మావోయిస్టు 1996లో నక్సల్ సంస్థలో చేరి ఆంధ్రప్రదేశ్‌లోని %గ్గాజవీ% కృష్ణ అన్నతో కలిసి పనిచేసింది.2003లో %ఐఎజవీ% పదవికి పదోన్నతి పొందారు. 2006లో సౌత్ బస్తర్‌లో %జజవీ% దుల్లా దాదా అలియాస్ ఆనంద్‌తో కలిసి పనిచేశారు. 2013లో మాడ్ ప్రాంతానికి వచ్చి %గ్గాజవీ% రామన్నతో కలిసి పనిచేశారు. 2020లో కరోనా కారణంగా రామన్న మరణించిన తర్వాత, %ఐఖ్గాజవీ% సెంట్రల్ రీజినల్ బ్యూరో ప్రెస్ టీం ఇన్‌ఛార్జ్‌గా నియమితులయ్యారు.నక్సల్ సంస్థ తరపున పత్రికా ప్రకటనలను జారీ చేసేది మరియు ప్రభాత్, మహిళా మార్గం, అవామి జంగ్, పీపుల్స్ మార్చ్, పోడియారో పోల్లో, ఝుంకార్, సంఘర్ష్ మహిళా, పితురి, మిడంగూర్, భూమ్కల్ సందేశ్ వంటి వివిధ పత్రికలను ముద్రించి ప్రచురించేది.సోదరుడు ప్రసాద్ అలియాస్ సుఖ్‌దేవ్ అలియాస్ గుడ్సా ఉసేండి 2014 సంవత్సరంలో తెలంగాణలో లొంగిపోయాడు.2005లో సెంట్రల్ కమిటీ సభ్యుడు శాకమూరి అప్పారావు అలియాస్ రవితో వివాహం జరిగింది. అతను 2010 నల్లమల ఎన్ కౌంటర్ (ఆంధ్రప్రదేశ్)లో మరణించాడు.

# ఎండి నజీర్ శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ ఎమ్మెల్యేలు



**భువనగిరి ప్రతినిధి ,తెలంగాణ సేన న్యూస్, మార్చ్ 31 :** రంజాన్ పర్వదినం పురస్కరించుకొని ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండి నజీర్ కు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిలు నజీర్ భువనగిరి లోని ఆయన నివాసం కు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రేమ సదన్ అనాధ ఆశ్రమంలో వీఆర్ఏ మహమ్మద్ ఖాజాబీ

**జ్ఞాపకార్థం అన్నదానం**



**భువనగిరి ప్రతినిధి తెలంగాణ సేన న్యూస్ మార్చ్ 31 :** వీఆర్ఏ మహమ్మద్ ఖాజాబీ జ్ఞాపకార్థం, ప్రేమ సదన్ అనాధ ఆశ్రమంలో ,రంజాన్ పర్వదినం సందర్భంగా ,వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.సోమవారం గుండాల మండలం సీతారామపురం గ్రామంలో, ఖాజాబీ కుటుంబ సభ్యులు అనాధ ఆశ్రమం వృద్ధులతో పండగ జరుపుకున్నారు.ఖాజాబీ కుమా రులు యాకూబ్ పాషా,నజీర్ మియా ల అధ్వర్యంలో ఉదయం పాయసం అందించి,మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఖాజాబీ కుటుంబ సభ్యులు కోడలు ఆసియా, కూతురు హసీనా,అల్లుడు నజీర్ హైమద్,మనుమరాళ్లు సల్మా యాసిన్,అస్రాతజ్మీన్ పాల్గొన్నారు.

# అమ్మ జ్ఞాపకార్థం చలివేంద్రం



**కొత్తగూడ న్యూస్ :** మండలంలోని ఎదుల్ల పల్లి కి చెందిన కడుదూరి రమేష్ గ్రామీణ ఆర్ఎంపి వైద్యులు వారి మాతృమూర్తి కడుదూరి పూలమ్మ వారి జ్ఞాపకార్థం ప్రతి ఏటా ఆనవైతిగా ప్రజల వేసవి దాహం తీర్చడం కోసం చలివేంద్రం ప్రారంభిస్తున్నారు వారి అమ్మ మీద ఉన్న ప్రేమతో ప్రజల ఆశీస్సులు మరియు అమ్మ ఆశీస్సులు పొందాలని నిస్వార్థంగా సేవ చేస్తున్న తరుణంలో పలువురు అభినందించారు.

# ఎస్సీ ఎస్టీ నూతన అధ్యక్షుడు గరికపోగుల చంద్రశేఖర్

**ఎస్సీ ఎస్టీ బలహీన వర్గాల కోసం నిరంతరం కృషి చేస్తాను చంద్రశేఖర్**



**సికింద్రాబాద్ మార్చ్ 31:** సికింద్రాబాద్ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం, సీతాఫల్ మండి కార్యవర్గ సమావేశం బీదల బస్తీ గ్రౌండ్ లో జరిగింది. ఈ కమిటీ సమావేశం లో ఎస్సీ,ఎస్టీ బలహీన వర్గాల ను చైతన్యవంతం చేస్తూ వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేసే విధంగా మన కార్యచరణ ఉండాలని కమిటీ నిర్ణయించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో నూతన కమిటీని నూతన కమిటీ ప్రకటించారు . ఎస్సీ, ఎస్టీ నూతన అధ్యక్షుడి గా సీనియర్ నాయకుడు గరికపోగుల చంద్రశేఖర్ ను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నుకోబడ్డ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ రాబోయే డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ని ఘనంగా నిర్వహించడానికి కమిటీ సభ్యులతో కలిసి కార్యాచరణ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.నూతన అధ్యక్షుని బాధ్యతలు నా పై నమ్మకంతో అప్పజెప్పినందుకు ప్రతి ఒక్కరికి పేరు పేరునా అందరికీ కృతజ్ఞతలు తెలిపిన చంద్రశేఖర్.నూతన కమిటీలో ఉపాధ్యక్షులు గా గడ్డం ప్రసాద్, ఏ.ఎస్.చలపతి గిరి, అంబాల రాజేశ్వరరావు,జీ.వి.కృష్ణ,లలిత,గోవర్ధన్ లను నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా ఏ.ఎస్.భాస్కర్ గిరి,సురేందర్ (చిన్నా) కార్యదర్శులుగా ఏ. ఎస్.సుధాకర్, ధనుష్ (బాబు), దిలీప్ కుమార్, పి.శివ ప్రసాద్, లక్ష్మి,కోశాధికారిగా పోతారం శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా జి.కిషోర్, ఏ.ఆర్. యశ్వంత్,ఎం మనోజ్, జి.మహేష్,కార్యవర్గ సభ్యులుగాయశ్వంత్, వెంకటేష్, సాయినాథ్, రవికాంత్, సందీప్, కిరణ్ కుమార్ లను నియమించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

# అన్వేషి.. అక్షర తపస్వి..



కలం బరువును మాత్రమే మోయగల శరీరం, సాహిత్య లోకాలన్నింటినీ తడిమి చూడగల క్రాంత దర్శిత్వం ఆయన సొంతం. ఆయన కలంలోంచి కళ్లు తెరిపించే కవిత్వం జాలువారింది. అబ్బుర పరచే పరిశోధనా గ్రంథాలు అవతరించాయి. ఒకటా రెండా శతాధికం! ఆ మహారచయితే డా. కపిలవాయి లింగమూర్తి (1928%ొ%2018). సాహిత్యంలోని క్లిష్టమైన ప్రక్రియలు అనగా చిత్రపది, బంధాలు, శబ్దపది, అలంకారాలు, యతులతో చమత్కారాలు వంటివి వీరిరచనలలో చాలా కనిపిస్తాయి. భాషాసముద్రపు లోతుల్లోకి దిగి తెలుగుపలుకుబడిపై ప్రత్యేకాధికారం పొందారు. ఉమ్మడిపాలమూరు జిల్లాలో విస్తృతంగా పర్యటించి మరుగునపడిన శాసనాలు, చరిత్ర, జానపదుల నోళ్లలో నానే అపూర్వమైన, విలువైన విషయాలను గ్రంథస్థం చేశారు.'ఒక్క సిరా చుక్కలక్ష మెదళ్ళ కదలిక' అన్న కాళోజీ వాక్యంతో అన్వయిస్తే కపిలవాయి సృజించిన వేల అక్షరాలు ఎంతమంది మెదళ్లకు పదును పెట్టినవో. లింగమూర్తిగారు 1928 మార్చి 31న (ప్రభవ మాఘ శుద్ధనవమి నాడు) నాగర్‌కర్నూలు జిల్లా బలుమూరు మండలం జినుకుంట గ్రామంలో ఒక పండిత వంశంలో మాణిక్యాంబ, వెంకటాచలం దంపతుల గర్భశుక్తి ముక్తాఫలంగా జన్మించినారు. అమరాబాదులో మేనమామగారైన చేపూరు పెద్దలక్ష్మయ్యగారి దగ్గర పెరిగి విద్యాబుద్ధులు నేర్చి సంస్కృతాంధ్ర నిఘంటువులు, పురాణేతిహాసాలు, కావ్యనాటకాలు, జ్యోతిష్య, శ్రౌతాది శాస్త్రాలు నేర్చారు. వారు మొదలు కొంతకాలం స్వర్ణకార వృత్తిపని చేసి తర్వాత ఉద్యోగ జీవితంలోకి మారి అపూర్వమైన సాహిత్య సృజన చేశారు.నిత్య సాహితీ కృషీవలుడైన కపిలవాయి లింగమూర్తి 157దాకా గ్రంథాలు రాశారు. వీనిలో వివిధ ప్రక్రియలలో వెలువరించినవి 94. పరిష్కృత, సంపాదక, సంకలనాల రచనలు 63. ప్రక్రియలలో శతకాలు, కావ్యాలు, ఉదాహరణలు, సంకీర్తనలు, హరికథలు, వచనగేయ పద్యకృతులు 41. వచనరచనలలో ఆధ్యాత్మిక రచనలు, కథలు, నవలలు, నాటికలు, స్థలచరిత్రలు, జీవితచరిత్రలు, నిఘంటువులు, అనువాద రచనలు మొత్తం 53. లింగమూర్తిగారు వివిధ విషయాలపై వందలాదిగా వ్యాసాలు రాశారు.అవి అనేక ప్రముఖ పత్రికలలో ప్రచురింపబడ్డాయి. వానిలో సాహిత్య, ఆధ్యాత్మిక, చారిత్రక, పుస్తకపరిచయాలు, కవులపరిచయాలు, విశ్వకర్మ సాహిత్యవ్యాసాలు ఉన్నాయి. అవి ముద్రితాలు, అముద్రితాలు కలిపి 430 దాకా ఉంటాయి. వీరు చాలామంది రచయితల పుస్తకాలకు ముందుమాటలు, పీఠికలు, అభిప్రాయాలు రాసిపెట్టారు. చాలా పుస్తకాలు పరిష్కరించి వాటికి వివరమైన పీఠికలు రాశారు. అవి అన్నీ కలిపి 320 దాకా ఉంటాయి. ప్రచురించిన గ్రంథాలలో ఆర్యశతకము (చిత్రపది పదాల గారడి), దుర్గాభర్గ శతకము (అలంకార యతి లక్షణాలు), ఉమామహేశ్వరం హరికథ, సుబ్రహ్మణ్యోదాహరణము (పాలెంసుబ్బయ్య జీవితచరిత్ర), ప్రబోధ పటాహము (సామాజిక గేయాలు), శ్రీమత్ ప్రతాప గిరిఖండము (అమరబాదు స్థలచరిత్ర) కుటుంబ గీత (కుటుంబ నియంత్రణ ఆవశ్యకతను తెలిపే కావ్యం), భాగవత కథాతత్వము (పది భాగవతకథలకు వ్యవహారికమైన వివరణ), గీతాచతుష్టథం (భగవద్గీత, ఉత్తరగీత, ఉద్ధవగీత, భ్రమరగీతల సారాంశము), జీవుడు %-% దేవుడు (పురాణాలలోని సంఘటన లను నేటి సమాజానికి అన్వయిస్తూ రాసిన విశ్లేషాత్మక రచన), పాలమూరు జిల్లా దేవాలయాలు (జిల్లాలోని 300 ప్రాచీన, ఆధునికదేవాలయాల చరిత్ర), గురు గోవిందమాంబ చరిత్ర, ఉమ్మడి పాలమూరు కవిపండిత వంశాలు, యోగులు, ఉప్పునూతల కథ, ఆంధ్ర పూర్ణాచార్యులు (చారిత్రక నవల), పద్యకథా పరిమళం, కపిలవాయి కథానికలు, కావ్యగణపతి అష్టోత్తరము (కావ్యాలలోని 108 గణపతి స్తుతులకు వ్యాఖ్యానం), స్వర్ణశకలాలు (90 కావ్యాల్లోని స్వర్ణాభరణాలను గురించిన వివరణ), రుద్రాధ్యాయము (సామాజిక చారిత్రక వ్యాఖ్యానం) మాంగల్యశాస్త్రము (ప్రాచీన ఆభరణాల విశేషాలు, వివరాలు), హనుమచ్ఛహస్రము (హనుమంతుడి వేయినామాలకు వ్యాఖ్యానము), మా భగోట (సవివర కుటుంబ చరిత్ర), రాజరథం (నాటకం), పీఠికలు (330 పుస్తకాలకు వ్రాసినవి), పామర సస్కృతము (6000 పాలమూరు మాండలికాల సేకరణ), విశ్వ బ్రాహ్మణుల సంస్కృతీ అనుకరణము (కన్నడ నుండి అనువాద రచన) కొన్ని మాత్రమే.పరిష్కృత రచనలలో సాలగ్రామశాస్త్రము, (సాలగ్రామం పుట్టుక వాని భేదాలు, మహత్యము, పూజావిధానము వివరించిన రచన), యోగసక్తా పరిణయము, యయాతి చరిత్ర (అచ్చతెలుగుకావ్యం), ఆరు అముద్రిత శతకాలు, మనోబుద్ధిర్వివాదము, సంక్షిప్త ఆబ్దిక విధానము, శ్రీ మదాంధ్ర

**పూర్ణాచార్య ప్రభావము ముఖ్యమైనవి.**

కపిలవాయి ఏడుదశాబ్దాల సాహితీకృషికి గుర్తింపుగా పొట్టిశ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం 13వ స్నాతకోత్సవంలో 30-08-2014న గౌరవ డీ.లిట్ సత్కృతిని అందించింది. ఆయన రాసిన శతాధిక గ్రంథాలలో కొన్నింటిని మాత్రం పరిచయం చేస్తాను. ఒక్కొక్క గ్రంథంపైన ఒక్కో పీహెచ్‌డీ చేయొచ్చు. తెలంగాణ పదకోశాల్లో 'పామర సంస్కృతం' విశిష్టమైంది. దశాబ్దాలపాటు పల్లెప్రజలతో మమేకమై ఈ పదాలను, జాతీయాలను, సామెతలను సేకరించారు. ఈ పదకోశ నిర్మాణానికి డా.కపిలవాయి లింగమూర్తిగారిని గడియారం రామకృష్ణశర్మ, వావిలాల గోపాలకష్ణయ్య ప్రోత్సహించారు. ఇక్కడ పామరులు అనగా జానపదులు. తెలంగాణ పల్లె ప్రజలు శిష్ట వ్యావహారిక పదాలని తమకు అనుగుణంగా

**మార్చుకొని మాట్లాడతారు.**

'పామర సంస్కృతం అనగా పామరుడు తాను సంస్కరించుకున్న భాష అనే అర్థంలో ఈ పేరుంచా ను' అని లింగమూర్తి గారు పేర్కొన్నారు. పామర సంస్కృతంలో పదాలకు అర్థాలతో పాటు పద్యపాదాలు, పాటల పల్లవులు, నానార్థాలు, పర్యాయపదాలు, జాతీయాలు, సామెతలు, న్యాయాలు, పదవివరణ, రూపసాధన, పదవ్యుత్పత్తి, అన్యదేశ్యాలు అనుబంధంలో ఇచ్చినవాటిని స్థాలీపులాకన్యాయంగా పరిశీలించడం జరుగుతుంది.ఆయన రాసిన మరో అపూర్వ గ్రంథం మాంగళ్యశాస్త్రం. ఇది తాళపత్రాలలో వారి తాతగారి గ్రంథాలయంలో దొరికింది. మన ఆభరణాలు, వాటి చరిత్ర తెలుగువారి సొమ్ముల స్వరూపాలు, వివాహాభరణాల విశేషాలు వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. ఇంకా ఇందులో మాంగళ్యాల వివిధ రూపాల గురించి,

**స్త్రీల కాలిమెట్టెలు, చేతిగాజుల గురించి కూడా సవివరంగా తెలిపారు.**

ఇక రెండవది సాలగ్రామం. ఇది వారి కుటుంబచరిత్ర. మా భగోటాకు సంక్షిప్తీకరణ. ఈ ఆత్మకథలో అటు స్వర్ణశిల్పంతోపాటు మరిన్ని విద్యలలో రాణించిన ఒక స్త్రీమూర్తి కనబడుతుంది. ఆమే మేడిపూరు గోవిందమ్మ. చిన్నతనంలో భర్త చనిపోవడంతో తండ్రి, అన్నల వద్ద స్వర్ణశిల్పంతో పాటు అన్నివిద్యలు నేర్చుకున్న ప్రతిభావంతురాలు. ఆమె లింగమూర్తిగారి తాతగారైన సింగవట్నానికి స్వర్ణశిల్పంలో శిక్షణ ఇచ్చింది. తోలుబొమ్మలాట ఆడేవారిలో ఉన్న చిత్రకారులతో పౌరాణిక చిత్రాలు గీయించి సింగవట్నానికి వాటిద్వారా చెక్కడం పనికి కావలసిన చిత్రలేఖనం నేర్పించింది. ఆ కాలంలో ఇటువంటి స్త్రీలు అరుదు.సాలగ్రామం చదివినప్పుడు ఆనాడు విశ్వకర్మలు ఉగాది, దసరా పండుగలను ఎలా జరుపుకునేవారో తెలుస్తుంది. ఆ కాలంలో లింగమూర్తిగారింట్లో ఉగాది, దసరా పండుగలు నవరాత్రులుగా సాగేవట. ఉగాదికి తమ పనిముట్లను పూజించేవారు. ఉగాదినాడు పనిముట్లనన్నింటిని కడిగి, తుడిచి, చమురు (నూనె) పూసి వాటికి గంధంతో తిర్యక్పుండ్రాలు, చంద్రరేఖలు తీర్చి కుంకుమతో అలంకరించేవారు. ఉగాది దినాలలో విశ్వకర్మపురాణం పగటిపూట, భజన రాత్రిపూట ఉండేదట. 1937 ప్రాంతంలోనే బడులలో 'బడితోటల' పెంచే సంస్కృతి ఉన్నదని ఈ ఆత్మకథ తెలుపుతుంది.దీని వలన మనకు ఎన్నో విషయాలు తెలుస్తున్నాయి. 'నా మొలకమామిడి నివాసం' శీర్షికలో లింగమూర్తి గారి చదువరితనం వెల్లడవుతుంది. రాత్రి 8 గంటలకు మొదలుపెట్టి తెల్లవారి నాలుగు గంటలవరకు ఎక్కడా విడువకుండా వేయిపడగలు నవలను చదవడం మనను సంభ్రమాశ్చర్యాలకు లోనుచేస్తుంది. 'పాలెంలో పదేండ్లు' అధ్యాయంలో లింగమూర్తిగారి మిత్రబృందం సాహిత్యకృషి కనబడుతుంది. తెలకపల్లె విశ్వనాథశర్మ, సీతారామశాస్త్రి, రామకృష్ణశాస్త్రి, శ్రీరంగాచార్యులు, మామిడన్న సత్యనారాయణ మొదలైన కవిపండితుల సాహచర్యంలో ఆయనకు కలిగిన శబ్దజ్ఞానం, పరిష్కరణ సాధకబాధకాల పరిజ్ఞానం భవిష్యత్తులో ఎంతగానో తోడ్పడినట్లు తెలిపారు. బాల్యంలోనే తండ్రిని కోల్పోయిన ఒక మారుమూల పల్లెటూరు పిల్లవాడు తన క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదల, కృషి, నిజాయితీలతో ఏ విధంగా రాష్ట్రం మెచ్చుకునే కవిపండితుడయ్యాడో ఈ ఆత్మకథ మనకు తెలుపుతుంది. చిత్రకారునిగా, జ్యోతిషవేత్తగా, యోగసాధకునిగా, పుస్తకాల పురుగుగా, శిల్పిగా, నాటకాలకు వస్తువులు తయారు చేసిన సృజనశీలిగా, కవిగా, పండితునిగా, పరిశోధకునిగా, చరిత్రకారుడిగా, పరిష్కర్తగా, సంపాదకునిగా విభిన్న పార్శ్వాలు గల కపిలవాయి లింగమూర్తిగారి జీవితాన్ని ఆవిష్కరించే గ్రంథం ఇది.ఆయన అధ్యాపకత్వానికి ముందు బంగారం పనిచేసినవారే. అందుకే ఆయన సాహిత్య స్వర్ణసౌరభ కేసరి అయ్యారు. ఆయన రచనలూ బంగారమే! ఆయన నడక, నడత%ొ%బంగారమే! ఎందరో ఔత్సాహికులకు శిష్యులకు, మిత్రులకు కవితా రంగంలో ఓనమాలు దిద్దించి దశ, దిశా నిర్దేశనం జరిపారు. ఆయన సాహిత్యకృషికి గుర్తింపుగా హైద్రాబాద్‌లో జరిగిన 32వ హైద్రాబాద్ బుక్‌ఫెయిర్‌కు 'కపిలవాయి లింగమూర్తి ప్రాంగణం' అని నామకరణం చేసి గౌరవించారు. ఆ పుస్తకప్రదర్శనలోనే వారి ఆత్మకథ 'సాలగ్రామం'ను ఆనాటి భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. ఆయన కృషిచేసిన స్థానిక చరిత్రలను, దేవాలయాల చరిత్రను ఇంకా వెలికితీసి కొనసాగించడమే ఆ మహానుభావునికి నిజమైన నివాళి.

# వారికి తెలిసి కొంత తెల్వక అంత



అసెంబ్లీలో సాగునీటి శాఖ పద్దులపై చర్చ సందర్భంగా తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ చెప్పిన అంశం మీద మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మధ్య వాదోపవాదాలు చెలరేగిన విషయం తెలిసిందే. ఉత్తమ్ కుమార్‌రెడ్డి 165 టీఎంసీల నీరు ఉందని సీడబ్ల్యూసీ చెప్పిందని, భవిష్యత్తులో 165 టీఎంసీలు లభ్యం కావని సీడబ్ల్యూసీ చెప్పిందని హరీశ్‌రావు వాదించారు. ఆ లేఖలోని వాక్యాలను చదివి వినిపించడానికి హరీశ్‌రావు ప్రయత్నం చేసినా అధికారపక్షం ఆయనకు అవకాశం ఇవ్వకుండా అడ్డుపడింది. అయితే గతంలో ఈ అంశంపై హరీశ్‌రావు సీడబ్ల్యూసీ ప్రాణహిత చేవెళ్ల చీఫ్ ఇంజినీర్‌కు 2015 మార్చి 4న రాసిన లేఖలో తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యతపై వారు వెలిబుచ్చిన కామెంట్స్ చదివి వినిపించారు. మార్చ్ 29న శ్రీధర్‌రావు దేశ్‌పాండే రాసిన 'తుమ్మిడిహట్టి- నీటిలభ్యత.. నిజానిజాలు' శీర్షికతో రాసిన వ్యాసంలో ఈ వాక్యాలను యథాతథంగా ఉల్లేఖించారు. అందువల్ల ఆ అంశం జోలికి పోదలుచుకోలేదు.అయితే ఆ వాదోపవాదాల్లో సందెట్లో సడేమియా లాగా సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ ఈ చర్చలో దూరి అధికారపక్షం వైపు నిలబడి 'తుమ్మిడిహట్టి వద్ద నీరు లేదని సీడబ్ల్యూసీ చెప్పినట్టు నిరూపిస్తే ముక్కు నేలకు రాసుకుంటానని, గుండు కొట్టించుకుంటానని' శపథాలు చేయడం మాత్రం అందరినీ విస్మయానికి గురిచేసింది. తుమ్మిడిహట్టి బ్యారేజీ కట్టకుండా ప్రాజెక్టును తమ ప్రాంతం నుంచి మేడిగడ్డకు లాక్కుపోయారని ఆయన ఆవేదనలో నుంచే ఈ ఆవేశం పొడుచుకువచ్చిందనుకోవచ్చు. వాస్తవాలు తెలిసినట్టయితే ఆయన అంత ఆవేశానికి లోనయ్యేవాడు కాదని, ప్రభుత్వ పక్షం వహించేవాడు కాదని నా అభిప్రాయం. అయితే పాల్వాయి హరీశ్ గుర్తించవలసిన అంశాలు ఇవీ తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజి నిర్మించకుండా నిర్లక్ష్యం చేసిందెవరు? 2004-14 వరకు పదేండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ కాదా? 152 మీటర్ల ఎఫ్‌ఆర్‌ఎల్ వద్ద బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించకుండానే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పనులను 28 ప్యాకేజీలుగా విభజించి అన్ని ప్యాకేజీ పనులకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వం. అందులో తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణం పనులకూ ప్యాకేజీ 3 కింద టెండర్లు పిలువడం జరిగింది. హిందుస్థాన్ కన్‌స్ట్రక్షన్ కంపనీ (హెచ్‌సీసీ) ఈ టెండర్లను దక్కించుకున్నది. పనులు మాత్రం మొదలుకాలేదు. మహారాష్ట్రతో ఒప్పందం లేకుండా తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మించలేమని ప్రభుత్వానికి తెలియని విషయం కాదు. సంప్రదింపులు జరిపి 152 మీటర్ల ఎత్తు వరకు బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించడంలో ఉమ్మడి ఏపీ రాష్ట్రం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. జలయజ్ఞంలో ప్రారంభించిన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచే పనిలో, తెలుగు గంగ, శ్రీశైలం కుడికాలువ, హంద్రీనీవా, వెలిగొండ, తదితర రాయలసీమ ప్రాజెక్టులను, పులిచింతల ప్రాజెక్టును పూర్తిచేయడంలో మొత్తం ప్రభుత్వ యంత్రాంగం మునిగిపోయి ఉంది.వారికి తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మించాలంటే మహారాష్ట్రతో ఒప్పందం చేసుకోవాలని సోయి ఉండిందా? అధికారుల స్థాయిలో కొన్ని ప్రయత్నాలు జరిగి ఉంటాయి. కానీ, ఆ సమస్య రాజకీయ సంప్రదింపులతో తప్ప అధికారుల స్థాయిలో చర్చల ద్వారా పరిష్కారమయ్యేది కాదు. అయినా కూడా ఈ దిశగా ప్రభుత్వ పెద్దలు దృష్టిపెట్టనే లేదు. దశాబ్దం గడిచినా బ్యారేజీ పనులు మొదలుకాలేదు.2014లో తెలంగాణ ఏర్పాటు తర్వాతనే కేసీఆర్ ప్రభుత్వం సంప్రదింపులు మొదలుపెట్టింది. 152 మీటర్ల ఎత్తువరకు బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించడానికి నాటి సాగునీటి మంత్రి హరీశ్‌రావు, సీఎం కేసీఆర్ ఎంత ప్రయత్నించినా కొన్ని నెలలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ తమ మొండివైఖరిని వీడలేదు. 4 మీటర్ల ఎత్తు తగ్గించాలని వారు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. 2004-14 దశాబ్దం ఎంత అనుకూలమైన కాలం! కేంద్రంలో కాంగ్రెస్, మహారాష్ట్రలో కాంగ్రెస్, ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నకాలం.సోనియా గాంధీ తలచుకుంటే మహారాష్ట్రను ఈ విషయంలో ఒప్పించగలిగేదే. కానీ, ఆమె సహాయం తీసుకోవాలన్న సోయి ఉమ్మడి ప్రభుత్వానికి ఉంటే కదా! వారికి ప్రాణహిత చేవెళ్ల ఒక ఎన్నికల ప్రాజెక్టు. తెలంగాణ ఉద్యమాన్ని నీరుగార్చడానికి ఉద్దేశించిన ప్రాజెక్టే తప్ప నీరు పారిచ్చే లక్ష్యంతో తలపోసిన ప్రాజెక్టు కాదు. అందుకే, ఆ అనుకూల వాతావరణాన్ని కూడా వినియోగించుకోలేక వృథా చేశారు. కేసీఆర్ ప్రభుత్వం మహారాష్ట్రతో చర్చలతో కాలయాపన చేయదలచుకోలేదు. గోదావరి జలాలను తెలంగాణ పంట పొలాలకు పారిచ్చి తెలంగాణలో సాగునీటి సంక్షోభాన్ని నివారించి రైతాంగానికి సాగునీటి భరోసాను ఇవ్వాలనుకున్నది. కాబట్టే, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును రీ ఇంజినీరింగ్ చేసి నాలుగేండ్లలోనే బృహత్తర కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి కొత్త ఆయకట్టు, స్థిరీకరణ ఆయకట్టు కలిపితే సుమారు 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించింది.కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దశాబ్ద కాలంలో మహారాష్ట్రను ఒప్పించి తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ పనులు ప్రారంభించి 50 శాతమో, 60 శాతమో పూర్తిచేసి ఉంటే కేసీఆర్ ప్రభుత్వానికి రీ ఇంజినీరింగ్ చేసే అగత్యం ఏర్పడి ఉండేది కాదు. కేసీఆర్ ప్రభుత్వానికి రీ ఇంజినీరింగ్ చేసే అగత్యం కల్పించింది ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అన్న సంగతి పాల్వాయి హరీష్ గుర్తించి ఉంటే ఆయన ఆ రకంగా కేసీఆర్ ప్రభుత్వంపై విరుచుకు పడి ఉండేవాడు కాదేమో!2013లో అప్పటి కాంగ్రెస్ సీఎం పృథ్వీరాజ్ చవాన్ తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేసినా, నిమ్మకు నీరెత్తినట్టు కూర్చొని కాలక్షేపం చేసినా నాటి ప్రభుత్వ పెద్దలు ఇవ్వాళ కేసీఆర్ ప్రభుత్వం రీ ఇంజినీరింగ్ పేరు మీద గ్రావిటీ ప్రాజెక్టును వదిలేసి భారీ ఎత్తిపోతలను చేపట్టిందని విమర్శలు చేయడం సమంజసమా?పాల్వాయి గత ప్రభుత్వంపై విరుచుకుపడటం కంటే ఇప్పటి ప్రభుత్వాన్ని అడుగవలసిన ప్రశ్నలు.. ఉమ్మడి ఏపీలో ఎనిమిదేండ్లు తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణం ఒక్క అంగుళం కూడా ముందుకు సాగలేదెందుకు? కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే, మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వమే, ఇక్కడా కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్న అనుకూల కాలంలోనూ 152 మీటర్ల ఎఫ్‌ఆర్‌ఎల్ వద్ద తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాధినేతలు ఎందుకు ఒప్పించలేకపోయారు? 152 మీటర్ల ఎఫ్‌ఆర్‌ఎల్‌తో కాలువల డిజైన్లు పూర్తిచేసి టెండర్లు పిలిచి గుత్తేదారులకు పనులు అప్పగించిన ప్రభుత్వ పెద్దలు తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎఫ్‌ఆర్‌ఎల్‌పై మహారాష్ట్రను ఒప్పించాల్సిన అవసరాన్ని ఎందుకు నిర్లక్ష్యం చేశారు?2013లో అప్పటి కాంగ్రెస్ సీఎం పృథ్వీరాజ్ చవాన్ తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేసిన, నిమ్మకు నీరెత్తినట్టు కూర్చొని కాలక్షేపం చేసినా నాటి ప్రభుత్వ పెద్దలు ఇవ్వాళ కేసీఆర్ ప్రభుత్వం రీ ఇంజినీరింగ్ పేరు మీద గ్రావిటీ ప్రాజెక్టును వదిలేసి భారీ ఎత్తిపోతలను చేపట్టిందని విమర్శలు చేయడం సమంజసమా? తుమ్మిడిహట్టి బ్యారేజీని నిర్మించి తీరుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వ పెద్దలు గడిచిన 15 నెలల్లో చేసిందేమిటి? హరీష్ సంధించాల్సిన ప్రశ్నలు ఇవి కదా! పాల్వాయి హరీష్ కొంత తెలిసి, ఎక్కువ తెలియక గత ప్రభుత్వం మీద విరుచుకుపడటం అందరినీ విస్మయానికి గురిచేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కలిసి చెట్టాపట్టాలు వేసుకొని పని చేస్తున్నాయని చెప్పడానికి పాల్వాయి హరీష్ 'సందట్లో సడేమియా' ఉదంతం ఒక సాక్ష్యంగా నిలిచింది.2014-23 వరకు పదేండ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం 148 మీటర్ల ఎత్తు నిర్మించడానికి మహారాష్ట్రతో ఒప్పందం చేసుకున్నప్పటికీ తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎందుకు నిర్మించలేకపోయిందన్న ప్రశ్న ఉంది. 148 మీటర్ల ఎత్తు వద్ద కూడా తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మించడానికి సాంకేతిక సమస్యలతో పాటు, పెరిగే ఖర్చు, చాప్రాల్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం అడ్డంకులుగా ఉన్నాయి.15 నెలలు గడిచినా తుమ్మిడిహట్టి బ్యారేజీ కట్టితీరుతామని బీరాలు పలుకుతున్న రేవంత్ ప్రభుత్వం అడుగు ముందుకు వేయలేకపోవడానికి కారణాలివే. ఏ ఎత్తుకు బ్యారేజీ కడతామన్న అంశంపై కూడా వారికి స్పష్టత ఉన్నట్టు లేదు. 152 మీటర్ల ఎత్తుకు కట్టాలంటే మహారాష్ట్రతో ఒప్పందం తప్పనిసరి. ఇప్పుడు అక్కడ అధికారంలో ఉన్నది దేవేంద్ర ఫడ్నవీస్ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం. గతంలోనే ఒప్పుకోని ఫడ్నవీస్ ఇప్పుడు ఒప్పుకుంటాడా? 148 మీటర్ల వద్ద తుమ్మిడిహట్టి బ్యారేజీలో ఉండే స్టోరేజీ 1.5 టీఎంసీలు మాత్రమే. ఉమ్మడి రాష్ట్రంలోనే తవ్విన కాలువలోకి నీరు గ్రావిటీతో తరలించడం కుదరదు.మరొక చిన్న లిఫ్ట్ పెట్టి నీటిని ఎత్తిపోయవలసి ఉంటుంది. బ్యారేజీ నిర్మాణ స్థలం వార్ధా, వైన్ గంగ సంగమం కాబట్టి రెండు నదులకు అడ్డంగా సుమారు 6 కిలో మీటర్ల పొడవైన బ్యారేజీ సుమారు 110 గేట్లతో నిర్మించాలి. ఇప్పటి ధరలతో లెక్క వేస్తే భూ సేకరణ సహా బ్యారేజీ ఖర్చు సుమారు 3 వేల కోట్లు. బ్యారేజీని నదీ ప్రవాహానికి 40 డిగ్రీల కోణంలో నిర్మించాలి. ఇటువంటి బ్యారేజీలు మన దేశంలో కానీ, ప్రపంచంలో మరెక్కడా లేవు. ఇవన్నీ మథింపు వేసుకొనే కేసీఆర్ ప్రభుత్వం వార్ధా నదిపై బ్యారేజీని ప్రతిపాదించింది. పైన పేర్కొన్న అన్ని సమస్యలు వార్ధా బ్యారేజీలో సమసిపోతాయి. కేసీఆర్ ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వార్ధా ప్రాజెక్టు పేరుతో రూ.4,550 కోట్లతో డీపీఆర్ తయారుచేయించి కేంద్ర జల సంఘానికి పంపించింది.అనుమతుల ప్రక్రియ కొనసాగుతుండగానే అధికార మార్పిడి తర్వాత సీడబ్ల్యూసీ డీపీఆర్‌ను వాపస్ చేసింది. మార్చి 26న కూడా అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మించి తీరుతామని ప్రకటించారు. అంతకు కొన్ని రోజుల ముందు మార్చి 17న కౌన్సిల్‌లో కోదండరాం అడిగిన ప్రశ్నకు ఇతర ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తున్నామని రాత పూర్వకంగా జవాబిచ్చారు. మరి వారేం చేస్తారో కాలమే నిర్ణయిస్తుంది.

# విలువైన ఆభరణం

గోల్కొండ, చార్మినార్, ముత్యాలు, బిర్యానీ.. ఇలా కొన్నింటిని పేర్కొనగానే మనకు హైదరాబాదు గుర్తుకు వస్తుంది లేదా హైదరాబాద్ అనగానే ఇలాంటివి గుర్తుకురావడం కద్దు. అయితే కాలం గడిచే కొద్దీ పరిణామాలు ముంచుకు వచ్చే దారిలో మరెన్నో అద్భుతాలు జరుగుతాయి. ఇప్పుడు హైదరాబాద్ అనేది ఓ ప్రముఖ విశ్వనగరం. మన హైదరాబాద్‌కు చెందిన సైన్స్ పాత్రికేయుడు, ఆంగ్ల రచయిత దినేశ్ సీ శర్మ 'బియాండ్ బిర్యాని-ది మేకింగ్ ఆఫ్ ఎ గ్లోబలైజ్డ్ హైదరాబాద్' అనే పేరుతో సుమారు 350 పేజీల ఆంగ్ల గ్రంథాన్ని వెలువరించారు. ఈ పుస్తకం పేరు చూడగానే ఇదేదో బిర్యాని వంటకానికి సంబంధించిన గ్రంథమని అనిపించొచ్చు. కానీ కవర్ పేజీ చూస్తే అడుగున చార్మినార్, పైన హైటెక్ సిటీ కనబడి మధ్యలో ఎలక్ట్రానిక్ సర్క్యూట్‌ను తలపించే ప్రతీకలు పాఠకుడికి విజ్ఞాన భరితమైన అభిప్రాయాన్ని కల్పిస్తుంది.వెస్ట్‌ల్యాండ్ ప్రచురించిన ఈ గ్రంథం స్థూలంగా 1908 నుంచి 2022 వరకు హైదరాబాద్ నగర పరిణామాన్ని 15 అధ్యాయాల్లో వివరిస్తుంది. తొలి ఐదు అధ్యాయాలు హైదరాబాద్ నైజాం సంస్థానంలో ఆధునికత, సైన్స్ ఎలా విప్పారాయో చెప్తూ క్లోరోఫామ్, మలేరియా సంబంధించిన నేపథ్యాలను మొదలుకొని దేశంలో ప్రాంతీయ భాషలో మొదలైన తొలి విశ్వవిద్యాలయం ఉస్మానియా గురించి వివరిస్తారు. తర్వాతి నాలుగు అధ్యాయాలు 1948-1999 మధ్యకాలంలో ఎలా కొత్త విజ్ఞానం నూతన దిక్తటాలను తెరిపించగలిగిందో చెబుతూ పరిశ్రమలు మొదలుకొని ఎలక్ట్రానిక్స్, న్యూక్లియర్ ఫ్యూయల్, మిస్సైల్స్ వంటి వాటి దాకా చరిత్ర పుటలను స్పృశిస్తాయి. చివరి ఆరు అధ్యయాలు ప్రపంచీకరణతో మొదలై తర్వాత నెలకొన్న ఔషధాలు, ఇంజనీరింగ్ పరిశ్రమలు, వ్యాక్సిన్లు, జినోమ్ వ్యాలీ.. మొదలైన పరిణామాలను విపులీకరిస్తాయి. హైదరాబాద్ ఎలా ప్రపంచ నగరంగా సమాయత్తమైందో.. ఆ నేపథ్యాన్ని, వైజ్ఞానిక పరిణామాలను పరిగణనలోనికి తీసుకొని రచయిత ఓ మహానగర వికాస, వైభవాలను ఆవిష్కరిస్తారు.అయితే ఈ మార్పులను పాఠకులకు సులువుగా వివరించడానికి అనుకూలమైన రీతిలో ఉపోద్ఘాతంగా నాలుగు శతాబ్దాల హైదరాబాద్ గతిని రచయిత ముందు పేజీల్లో చెబుతారు. 16, 17 శతాబ్దాలలోనే మధ్య ఆసియా, యూరప్ దేశాల నుంచి పర్యాటకులను, వర్తకులను ఆకర్షించే రీతిలో ఈ నగరం ఎదిగిందని చెబుతూ గోల్కొండ నుంచి తీరప్రాంతంలో ఉండే మచిలీపట్నానికి రోడ్డు నిర్మించారని వివరిస్తారు. కుతుబ్‌షాహీల కాలపు ప్రణాళిక, ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్, శాస్త్ర దృక్పథం మొదలైన వాటిని చార్మినార్ నిర్మాణం తెలియచెప్తుందని అంటారు.డైమండ్ కటింగ్‌కి సూరత్, దుస్తులకు కోయంబత్తూర్, ఎలక్ట్రానిక్స్‌కు చెన్నై, సాఫ్ట్‌వేర్ సేవలకు బెంగళూరు లాగానే హైదరాబాదు ఔషధాలకు, వ్యాక్సిన్ లకు, టెక్నాలజీ సర్వీసులకు పర్యాయపదంగా మారిందని చెబుతారు. ఇలా ఎదగడం అనేది ఆయా ప్రాంతాల స్వాభావికమేమో అని సూచిస్తూ బెంగళూరు, హైదరాబాదు, పుణే, భువనేశ్వర్, గాంధీనగర్, తిరువనంతపురంలలో దాదాపు ఒకేసారి సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్కులు వచ్చినా కేవలం బెంగళూరు, హైదరాబాదు నగరాలు మాత్రమే ఈ రంగంలో అభివృద్ధి చెంది కీలకంగా మారడం ఏమిటో ఆలోచించమంటారు.1980 నుండి పెద్దసంఖ్యలో రిసెర్చ్ ల్యాబ్స్, పబ్లిక్ సెక్టార్ కంపెనీలు, చిన్నాపెద్దా ప్రైవేట్ సెక్టార్ సంస్థలు, మరెన్నో ఔత్సాహిక పారిశ్రామిక సంస్థలు, సంబంధిత ఇంజనీరింగ్ కళాశాలు రావడం అనేవి నేపథ్యంగా పనిచేయడం వల్లనే నేడు సైబరాబాద్, జెనోమ్ వ్యాలీ అనేవి హైదరాబాదుకు ప్రపంచ స్థాయి గుర్తింపును తెచ్చిపెట్టాయి.1948 సెప్టెంబర్ చివరి వారంలో బొంబాయి నుంచి మార్వాడి వ్యాపారస్తుల కుటుంబం ఒకటి హైదరాబాద్‌కు తరలివచ్చింది. ఆ కుటుంబం నుంచి వచ్చిన ఈ రచయిత దినేశ్ సీ శర్మ హైదరాబాద్ సంబంధించిన ఎంతో మంది వ్యక్తులను కలవడమే కాకుండా ఆయా సంస్థల చరిత్రను శోధించి ఈ గ్రంథాన్ని రాశారు. ఏదో ఒక వ్యక్తి చేసిన ప్రయత్నాల వల్ల మాత్రమే కాకుండా, దశాబ్దాల తరబడి జరిగిన సమష్టి కృషి ఫలితంగానే నేడు భాగ్యనగరం విశ్వనగరంగా జేజేలు పొందుతోందని చారిత్రాత్మకమైన వైజ్ఞానిక ఆధారాలను ఈ రచయిత మన ముందుంచుతారు. హైదరాబాద్ నగర చరిత్రకు ఈ 'బియాండ్ బిర్యానీ' పుస్తకం ఒక విలువైన ఆభరణం.

## వైకుంఠ ఏకాదశి రోజున
# ఉత్తర ద్వార దర్శనం పవిత్రం



వైకుంఠనాథుడైన శ్రీ మహావిష్ణువును వైకుంఠ ఏకాదశి పర్వదినాన దర్శించుకునేందుకు ముక్కోటి దేవతలు తరలివస్తారు. ఆ రోజున స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. ముర అనే రాక్షసుడి బాధలు భరించలేక దేవతలు విష్ణువును ప్రార్థిస్తారు. దీంతో స్వామివారు అతడితో పోరుకు సిద్ధమయ్యాడు. దీన్ని తెలుసుకున్న ముర సముద్రంలోకి వెళ్లిపోతాడు. విష్ణుమూర్తి ఒక గుహలోకి వెళ్లి నిద్రిస్తున్న సమయంలో ముర ఆ గుహలోకి వస్తాడు. ఆ సమయంలో స్వామి దేహం నుంచి ఒక శక్తి వచ్చి మురను చంపివేసింది. శక్తి చర్యకు సంతుష్టుడైన స్వామి ఆమెకు ఏకాదశి అని పేరు పెడతారు. ఆమెను ఏదైనా వరం కోరుకోమనగా మురను చంపిన రోజున ఉపవాసం ఉన్నవారి పాపాలను పోగొట్టాలని ఏకాదశి ప్రార్థించింది. స్వామి తథాస్తు అనడంతో పాటు వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని వరమిచ్చాడు.

**మధుకైటభులు..**

మధుకైటభులు అనే ఇద్దరు రాక్షసులు స్వచ్ఛంద మరణం వరాన్ని పొంది లోకకంటకులుగా మారారు. బ్రహ్మ వినతి మేరకు మహావిష్ణువు వారితో యుద్ధానికి దిగాడు. అయితే వారు వరం చేత ఓడిపోవడం లేదు. దీన్ని గ్రహించిన స్వామి వారికి వరమిస్తామనగా వారు గర్వాతిశయంతో మేమే వరమిస్తాం కోరుకోమన్నారు. అయితే మీరు నాతో మరణం పొందాలి అని స్వామి అడిగాడు. అనంతరం వారిని సంహరించిన స్వామి వారిని వైకుంఠం ఉత్తరద్వారం నుంచి పరమపదంలోకి తీసుకెళ్లాడు. మధుకైటభులు చేయని దుర్మార్గం లేదు. అయినా వారు తాము ఇచ్చిన మాట ప్రకారం ఆ వైకుంఠనాథుడి చేతిలో కన్నుమూశారు. అందుకనే స్వామి వారి పాపాలను కడిగివేశాడు. వైకుంఠంలో స్థానమిచ్చాడు,

**అసలు ఉత్తరద్వార దర్శనం అంటే..**

శ్రీమహావిష్ణువు శాశ్వత నివాసమైన వైకుంఠానికి చేరుకోవాలని యుగయుగాల నుంచి కోట్లాదిమంది భక్తులు ఆశిస్తుంటారు. అయితే అక్కడికి వెళ్లి దర్శనం చేసుకోవాలా లేదా స్తోత్రం చేయాలా లేదా సేవలు అందించాలా అన్న సందేహాలు వస్తుంటాయి. ఉత్తర ద్వారం తప్ప మిగిలిన ద్వారాల నుంచి వైకుంఠానికి వెళితే కొంత కాలం మాత్రమే ఉండవచ్చు. కానీ ఉత్తర ద్వారం నుంచి వెళితే స్వామివారి కైంకర్యాల కోసం అక్కడే ఉండవచ్చు. ఏ భక్తుడికైనా అంతకంటే కావాల్సింది ఏముంది. అందుకనే కైంకర్యాలు అంటే సేవల నిమిత్తం ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటే వైకుంఠంలో ఉండి ఆ పద్మనాభుడి సేవల్లో నిత్యం పాల్గొనవచ్చు.

# చిద్విలాస మూర్తి.. ఎందుకు నవ్వినావు స్వామీ..



శ్రీకృష్ణ భగవానుడు చిద్విలాసమూర్తి. ప్రసన్న వదనంతో కనిపిస్తాడు. మహాభారత యుద్ధంలో కౌరవులను ముప్పుతిప్పలు పెట్టించిన భీమసేన తనయుడు ఘటోత్కచుడిపై కర్ణుడు దివ్యాస్త్రాన్ని ప్రయోగిస్తాడు. ఆ శక్తిని తట్టుకోలేని ఘటోత్కచుడు వీరమరణం పొందాడు. పాండవ శ్రేణులు ఒక్కసారిగా దుఃఖంలో మునిగిపోతాయి. కృష్ణుడు మాత్రం తన పక్కనే ఉన్న అర్జునుడిని కౌగిలించుకొని ఆనందం వ్యక్తంచేశాడు. జగన్నాటక సూత్రధారి ఇలా ప్రవర్తించిన తీరు అక్కడి వారందరినీ ఆశ్చర్యచకితులను చేస్తుండగా అర్జునుడు కృష్ణుడిని ఎందుకిలా ప్రవర్తిస్తున్నావని అడిగాడు. తామంతా దుఃఖిస్తుంటే అది కృష్ణుడికి సంతోషదాయకం ఎలా అయిందని ప్రశ్నించాడు

**ఆ ఆయుధం ఉన్నంత కాలం కర్ణుడిని ఎదిరించలేవు..**

అర్జునా ఆ ఆయుధం కర్ణుడి వద్ద ఉన్నంత కాలం నీ జీవితం ప్రమాదంలో ఉన్నట్టే ఆ శక్తి ఆయుధం ఒక్కసారి మాత్రమే ఉపయోగించాలి. ఘటోత్కచునిపై ప్రయోగంతో అది అతన్ని చంపివేసింది కానీ నిన్ను మాత్రం రానున్న ప్రమాదం నుంచి కాపాడిందని చెప్పవచ్చు. కౌరవసేనలో రాక్షసయోధుడైన అలంబసున్ని ఘటోత్కచుడు చంపేశాడు. దీంతో మనకు పెద్ద ముప్పు తొలిగింది. అయితే దివ్య ప్రసాదమైన ఆయుధం కర్ణుని వద్ద ఉన్నంతకాలం మనం అంగ రాజును ఓడించడం అసాధ్యం. కర్ణుడి దగ్గర ఉన్న కవచకుండలాలను ఇంద్రుడు తెలివిగా తీసుకున్నా యుద్ధంలో ఒక మహా వీరుడిని సంహరించ గల శక్తిమాత్రం కర్ణుడి దగ్గరే మిగిలి ఉంది. ఆ శక్తి అతడి దగ్గర ఉన్నంత కాలం అతడికి తిరుగు లేదు. కానీ ఇప్పుడాశక్తి ఘటోత్కచుడి మీద ప్రయోగించాడు. ఇక కర్ణుడు సులభంగా యుద్ధంలో మరణించేందుకు అవకాశం ఏర్పడిందని గీతాచార్యుడు తన నవ్వు వెనక రహస్యాన్ని వెల్లడించాడు.

# శివుడికి మూడో నేత్రం ఎలా వచ్చింది ?



తక్కిన దేవతామూర్తుల నుంచి వేరుచేసి చూపేది పరమశివుడి మూడోకన్ను. అందుకే ముక్కంటి త్రినేత్రుడు ఫాలలోచనుడు అని పిలుచుకుంటాం. ఇంతకూ శివుడికి అసహజమైన ఆ మూడోకన్ను ఎందుకు? దాని వెనక దాగివున్న రహస్యం, ప్రత్యేకత ఏమిటి? మూడోకన్ను తెరిస్తే ఏమవుతుంది లాంటి సందేహాలు తలెత్తడం సహజం. మూడోనేత్రం అంటే ఏమిటో అర్థమైతే సందేహాలకు తావే ఉండదు. వీటన్నిటి కంటే ముందు అసలు పరమశివునికి ఆ మూడో నేత్రం ఎలా వచ్చిందో చూద్దాం!ఒకసారి పరమశివుడు తన సహజ ధ్యానముద్రలో ఉండగా.. అక్కడికి వచ్చిన పార్వతీదేవి సరదాగా వెనుక నుంచి ఆయన రెండు కళ్లు మూసింది. పరమేశ్వరుని నేత్రాలు సూర్యచంద్రులు. పార్వతి కనులు మూయడంతో లోకమంతటా చీకటి ఆవరించింది. అప్పుడు శివుడు తన శక్తుల్ని కేంద్రీకరించి మూడోనేత్రంగా తెరిచి లోకాన్ని వెలుగుతో నింపాడు. అయితే ఆ కంటి వేడికి పార్వతి చేతులకు పట్టిన స్వేదం నుంచి అంధకాసురుడు జన్మించాడు. అది వేరే కథ. ఈశ్వరుడి త్రినేత్రానికి సంబంధించి మరో కథ ఉంది.. ఆదిపరాశక్తి తన సంకల్పంతో త్రిమూర్తుల్ని సృష్టించి, సృష్టి స్థితిలయలకు తోడ్పడమంది. అందుకు వారు నిరాకరించగా.. ఆగ్రహించి, తన మూడో నేత్రంతో భస్మం చేస్తానంది. అప్పుడు మహేశ్వరుడు ఆ మూడో కంటిని తనకు అనుగ్రహించమని ప్రార్థించి, పొందాడు. ఆ త్రినేత్రంతో పరాశక్తినే భస్మం చేశాడు. ఆ భస్మాన్ని మూడు భాగాలుగా విభజించి లక్ష్మీ సరస్వతి పార్వతులుగా సృష్టించాడు. మూడో నేత్రం ప్రత్యేకత ఏంటి అంటే.. అది అగ్నినేత్రం లేదా జ్ఞాననేత్రం. ఇందుకు నిదర్శనం మన్మథుని కథ. దేవతల ప్రేరణ మేరకు లోకకల్యాణార్థం పూలబాణంతో శివుని మనసులో ప్రణయ భావాల్ని రేకెత్తించి ఎదురుగా ఉన్న పార్వతీదేవిపై ప్రసరించేలా చేశాడు మన్మథుడు. తన అంతరంగంలో అలజడికి కారణాన్ని అన్వేషిస్తున్న శివుడు ఎదురుగా కనిపించిన మన్మథుని అగ్నినేత్రంతో బూడిద చేశాడు. ఇక్కడ గమనించాల్సింది పరమశివుని మూడో కన్ను మన కళ్లలాంటిది కాదు. భౌతిక నేత్రం ప్రపంచాన్ని ఉన్నది ఉన్నట్లు కాక మనకు కావలసినట్టు చూపిస్తుంది. ఇది అర్థం కావాలంటే మన్మథుడు అంటే ఏమిటో తెలియాలి? మన్మథుడు అంటే వ్యక్తి కాదు. మనసును మథించే వాడు మన్మథుడని భావం. అంటే మనసులోని కోరికలన్న మాట. మనసును అస్థిరపరిచే ఉద్వేగాలను భస్మీపటలం చేసే అగ్ని రూపమే మూడో కన్ను. లోకంలో కనిపించే ప్రతి వస్తువు, రుచి, పరిమళం, స్పర్శ.. ఇలా ప్రతిదీ మనకు కావాలనే భావన మనసును మథించినప్పుడు అవి అవసరమా, అనవసరమా అనేది బుద్ధి, విచక్షణ ద్వారా భస్మం చేసే జ్ఞాననేత్రమే మూడోకన్ను. మన్మథుడు మసికావడం అంటే మనలోని కోరిక నశించడం. జ్ఞాననేత్రం తెరుచుకోవడం అంటే ఇంద్రియాల ద్వారా మనసులో అలజడి రేపిన కోరికలు అవసరమో, లేదో తెలుసుకున్నప్పుడు మనసును మథిస్తున్న మన్మథుని రూపం భస్మమైపోతుంది. అంటే తొలగిపోతుంది. పరమాత్మ స్వరూపమైన మనందరికీ ఆ జ్ఞాననేత్రం ఉంటుంది. కానీ దాన్ని తెరవగలిగే నేర్పు సాధించాలి. భౌతిక నేత్రాలకు ఉన్న పరిమితుల్ని దాటి చూడగలగాలి. మనుషులకే కాదు.. దేవతలకు కూడా కష్టతరమైన ఈ జ్ఞానదృష్టి పరమశివుడికి సామాన్యం, సహజం. తనలోని సర్వస్వాన్ని జ్ఞాననేత్రంతో దహించాడు శివుడు. తాను దహించినవన్నీ భస్మరూపంలో శరీరం నుంచి బయటకు వచ్చాయి. అంతేకానీ భస్మం అంటే శరీరానికి బూడిద పూసుకోవడం కాదు. యోగపరంగా మన శరీరంలో 72 వేల నాడులు, 114 కూడళ్లుగా ఉంటాయి. అందులో ప్రధానమైన కూడళ్లు ఏడు. వాటినే చక్రాలు అంటారు. యోగసాధనతో ఆ శక్తుల్ని కూడదీసుకొని ఒక్కో చక్రాన్ని తాకినప్పుడు ఒక్కో రకంగా ఉత్తేజితమవుతుంది. ఆ శక్తి ఆజ్ఞాచక్రాన్ని తాకినప్పుడు.. జ్ఞానోదయాన్ని పొంది, దేన్నయినా ఉన్నది ఉన్నట్లుగా చూస్తారు. అలా చూడగలిగినప్పుడు ప్రశాంతత చేకూరుతుంది. నుదుటి మధ్యలో నిక్షిప్తమైన ఈ ఆజ్ఞా చక్రాన్నే మూడో కన్నుగా పిలుస్తారు. అలాంటి నిరంతర చైతన్యస్థితిని సహజస్థితిగా ఉంచగలిగిన ఆదియోగి పరమ శివుడు.

# పరమేశ్వరుడి పరమభక్తుడైన శిలాదుడి కుమారుడే నందీశ్వరుడు

పుట్టుకతోనే అతడు శివభక్తి సంపన్నుడు. సకల శాస్త్రాలూ అభ్యసిస్తూనే.. మరోపక్క మహేశ్వరుణ్ణి సదా ధ్యానిస్తూ ఉండేవాడు. ఒకసారి నందీశ్వరుడు శ్రీశైలం వచ్చి తపస్సులో నిమగ్నమయ్యాడు. ఆ తపోదీక్షకు మెచ్చిన త్రిలోచనుడు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. పదివేల ఏళ్లు తపస్సు చేసే శక్తిని ప్రసాదించమని నందీశ్వరుడు అర్థించాడు. ఈశ్వరుడు తథాస్తు! అన్నాడు. పదివేల సంవత్సరాలు తపస్సు చేశాక, నందికి నీలకంఠుడు గణాధిపత్యం ప్రసాదించాడు. తనకు అత్యంత సన్నిహితంగా ఉండే అదృష్టాన్ని కల్పించాడు. శ్రీశైలంలోనే కొలువుతీరేలా అనుగ్రహించాడు. శ్రీశైలఖండం కావ్యంలో ఈ వృత్తాంతం లిఖితమైంది.

**నందికి నమస్కారం**

మహాశివుడి ఎదుట ఉండే నంది ధర్మ స్వరూపం. నంది నాలుగు పాదాలు చతుర్వేదాలకు ప్రతీక. కలియుగంలో ధర్మం ఒంటిపాదంపై నడుస్తుందనటానికి నిదర్శనంగా.. నంది ముందర కుడిపాదం పైకి లేచి ఉండగా.. మిగిలిన మూడూ లోపలికి మడిచి కనిపిస్తాయి. సంధ్యాసమయాన్ని ఆధ్యాత్మిక పరిభాషలో ప్రదోష కాలంగా చెబుతారు. ఈ సమయంలో నందికి విశేష అర్చనలు, పూజలు చేయడం సంప్రదాయం. కాలకూట విషం తాగిన పరమేశ్వరుడు తాండవం చేస్తుంటే, ఆయన ఉగ్రత్వాన్ని నేరుగా చూడలేని దేవతలు భయపడిపోయారు. అప్పుడు నంది వెనుక నిలబడి కొమ్ముల మధ్యలోంచి నటరాజును దర్శించారని పురాణ కథనం. నేటికీ అదే ఆనవాయితీని కొనసాగిస్తూ.. భక్తులు నంది కొమ్ముల మధ్యలోంచే స్వామిని దర్శించడం సంప్రదాయంగా వస్తోంది. ఎంతో మాహాత్మ్యం కలిగిన నందీశ్వరుణ్ణి..



**తీక్ష శృంగాయ విద్మహే వేదపాదాయ**
**ధీమహి తన్నో నందిః ప్రచోదయాత్**
**అని ప్రార్థించి ప్రసన్నం చేసుకుంటారు.**

**శివదేవుడి సంహార రూపాలు**

మహాశివుడి అనుగ్రహ రూపాలే కాదు, సంహార రూపాలు కూడా ఆరాధ్యనీయాలే! మహేశ్వరుడు జలంధర వధమూర్తి, త్రిపుర సంహారమూర్తి, మన్మథ సంహారమూర్తి, గజ సంహారమూర్తి, కాల సంహారమూర్తి- అనే ఐదు సంహార రూపాలు దాల్చాడు. జలంధరుడు శివుడి మూడో కన్ను నుంచి పుట్టాడు. అమిత గర్వంతో దేవతలను సైతం హింసిస్తుంటే శివుడే చక్రాయుధంతో జలంధరుణ్ణి సంహరించాడు. అప్పుడు జలంధరుడి నుంచి ఒక జ్యోతి బయటకు వచ్చి స్వామి మూడో నేత్రంలో ఐక్యమైంది. ఆ స్వరూపమే జలంధరహరమూర్తి రూపం. తారకాసురుడి కుమారులైన తారకాక్షుడు, కమలాక్షుడు, విద్యున్మాలిలు గాలిలో ఎగిరే మూడు నగరాలను బ్రహ్మ నుంచి వరంగా పొందారు. ఆ వరంతో మూడు పురాలనూ ఇష్టారాజ్యంగా లోకాలన్నీ తిప్పుతూ ప్రజల్ని అసౌకర్యానికి గురిచేయసాగారు. దాంతో దేవతలు పరమేశ్వరుని ఆశ్రయించగా.. ఆ స్వామి అభయమిచ్చాడు. త్రిపురాసుర సంహారానికి భూమి రథం కాగా, సూర్యచంద్రులు రథచక్రాలయ్యారు. బ్రహ్మదేవుడు సారథ్యం వహించగా, నాలుగు వేదాలు నాలుగు గుర్రాలుగా మారాయి. మేరు పర్వతం ధనుస్సుగా రూపొందగా, ఆదిశేషుడు విల్లు తాడయ్యాడు. విష్ణువే బాణమయ్యాడు. ప్రళయ కాలాగ్ని కీలలు ఆకాశమంతా నిండుతుండగా పరమేశ్వరుడు బాణాన్ని వదిలి త్రిపురాల్లోని రాక్షసులను సంహరించాడు. తన తపస్సును భగ్నం చేసేందుకు ప్రయత్నించిన మన్మథ సంహరణ మనందరికీ తెలిసిందే! ఇక మహిషాసురుడి పుత్రుడైన గజాసురుడు బ్రహ్మ కోసం తపస్సు చేసి, కామాన్ని జయించినవాని చేతిలో తప్ప మరెవరి చేతిలో మరణం లేకుండా వరం కోరుకున్నాడు. తుదకు కామదహనుడైన కాశీనాథుడు గజాసురుణ్ణి తుదముట్టించాడు. యముడు ప్రాణాలు తీసుకునేందుకు రాగా.. శివలింగాల్ని ఆలింగనం చేసుకొని బాలభక్తుడైన మార్కండేయుడు ఆర్తిగా ప్రార్థించాడు. అప్పుడు నీలకంఠుడు కాల సంహారమూర్తి రూపమెత్తి యముణ్ణి సంహరించాడు. ఈ ఎనిమిది రూపాలే కాకుండా ఈశ్వరుడు అనేక స్థితుల్లో అనుగ్రహిస్తాడు. అందుకే శివతత్త్వాన్ని కొనియాడుతూ 'శివుడు సమాధి స్థితుడై మహాయోగంలో ఉన్నప్పుడు ఆత్మారాముడిగా విరాజిల్లుతుంటాడు. ఆ స్థితి నుంచి దిగివచ్చేటప్పుడు స్వల్పంగానూ 'నేను' అన్న భావం ఉన్నప్పుడు 'రామ రామ' అంటూనూ నృత్యం చేస్తాడు' అనేవారు శ్రీరామకృష్ణ పరమహంస.

# భూతనాథా.. భక్తపాలా!



సాలెపురుగు, సర్పం, ఏనుగు లాంటి మూగజీవాలకూ కైవల్యాన్ని ప్రసాదించిన మహాదేవుడు. మనలోని వ్యామోహాలను నశింపచేసే మహేశ్వరుడు. ఆర్తిగా ఆశ్రయించిన భక్తుల పాపాలను హరించి సంస్కరించే 'హరుడు' ఆ సదాశివుడు. లోకమంతా ఆయనలో ఉంది, ఆయనే లోకమంతా ఉన్నాడు. సర్వాధార చైతన్యాన్నే 'శివుడు' అంటోంది మన సనాతన ధర్మం. వేదోపనిషత్తులు, పురాణేతిహాసాలు శివతత్త్వాన్ని అనేక విధాలుగా విశదపరచాయి. శివజ్ఞానం, శివభక్తి, శివధ్యానం, శివార్చన, శివవ్రతంతో మనం శివయోగులుగా మారతామని మహర్షులు ప్రతిపాదించారు. ఆ శివయోగంలో తరించే దివ్యమైన రాత్రే 'మహాశివరాత్రి' పర్వదినం.

**అర్ధనారీశ్వరుడి అష్టతనువులు**

మహేశ్వరుడికి 'అష్టతనువు' అనే విశేష నామముంది. అంటే ఎనిమిది దేహాలు కలిగినవాడని అర్థం. జలం శివుడి శరీరాల్లో ఒకటి. నిత్యం నీటిలో ఆ స్వామిని దర్శించుకోగలిగితే అదీ శివపూజే అవుతుంది. జలాన్ని గౌరవిస్తూ, సద్వినియోగం చేసుకుంటూ, కలుషితం కాకుండా చూసుకుంటే భూతేశుడు హర్షిస్తాడట. రెండోది హోమాగ్ని. యజ్ఞగుండంలో రగిల్చే అగ్ని లింగమూర్తితో సమానం. ఇంట్లో వంట కోసం వెలిగించే అగ్నిని కూడా హోమాగ్నిగా భావించాలి. ఈశ్వరుని మూడో శరీరం యజ్ఞకర్త. అంటే భగవంతుడికి కైంకర్యాలు చేసే వ్యక్తి. అలా భక్తుల్ని కూడా నీలకంఠుడిగానే భావించమంటున్నాయి పురాణాలు. సూర్యచంద్రులు శివుడి నాలుగు, ఐదు శరీరాలు. మనకు వెలుగును, చైతన్యాన్ని, ఆహారాన్ని ప్రసాదించే ప్రభాకరుడు పరమశివుడే. మన మనసును చల్లబరిచే చంద్రుడు చంద్రశేఖరుడి ప్రతిరూపమే. ఇక ఆదిభిక్షువు ఆరో తనువు ఆకాశం. గగనం నుంచే ధ్వని పుడుతుంది. శబ్దం పరబ్రహ్మ స్వరూపం. సృష్టిలో తొలుత పుట్టింది ప్రణవరూపమైన ఓంకారనాదమే. అందుకే శబ్దం పుట్టుకకు కారణమైన ఆకాశాన్ని చూసినప్పుడల్లా మహేశ్వరుడే స్ఫురణకు రావాలి. ఆయన ఏడో శరీరం పుడమి. సమస్త జీవులకూ ఆధారభూతమైన ఆ భూమిని సద్వినియోగం చేసుకోవటమూ సదాశివుని పూజించటమే. గంగాధరుడి ఎనిమిదో శరీరం గాలి. వాయువును గౌరవిస్తే ఆ విశ్వనాథుని అర్చించినట్లే! అందుకే పూజలు, సంధ్యావందనాల్లో ముందుగా ప్రాణాయామం చేయిస్తారు. ఈ విధంగా ఎనిమిది రూపాల్లో ఉన్న ఈశ్వరుని దర్శించి ధన్యులమవుదాం! అపచారాలకు తావీయక ఆయన అనుగ్రహానికి పాత్రులమవుదాం.

**భక్తకవుల భావనల్లో..**

భక్తకవులెందరో ఆ సర్వేశ్వరుని ప్రార్థించారు. 'వాలిన భక్తి మొక్కెద నవారిత తాండవ కేళికిన్ దయాశాలికి శూలికిన్..' అంటూ శివస్తుతితో భాగవత రచన ప్రారంభించాడు పోతన. శ్రీరాముడి పరమభక్తుడైన త్యాగరాజస్వామి పరమేశ్వరుడిని ప్రస్తుతిస్తూ 'శంభో! మహాదేవ శంకర గిరిజా రమణ..', 'శివ శివ శివ యనరాదా.. భవ భవ బాధల నణచుకోరాదా..' తదితర కీర్తనలు రచించారు. ఇక ముత్తుస్వామి దీక్షితులు 'అక్షయలింగ విభో, స్వయంభో..', 'నీలకంఠం భజేహం సతతం, నీరజాసనాది నుతం..' అంటూ కైలాసవాసుణ్ణి కీర్తించారు.

**ఉపనిషత్తుల్లో ఉమాపతి ప్రస్తావన**

పరమేశ్వరుడే భూమండలమంతా వ్యాపించి ఉన్నాడు. అందుకే 'సర్వం శివమయం జగత్' అన్నది శివపురాణం. కఠ, మాండూక్య, శ్వేతాశ్వతర, బృహదారణ్యక, సూర్య, కైవల్య, స్కంద- తదితర ఉపనిషత్తులు శివమహిమను కీర్తించాయి. 'ఈ జగత్తు అంతా ఈశ్వరుడే ఆవరించి ఉన్నాడు' అని ఈశావాస్య ఉపనిషత్తు పేర్కొంది. శివలింగం ప్రకృతి పురుషులకు ప్రతీక అని తాత్త్వికులు వ్యాఖ్యానిస్తారు. 'శివాయ గురవే నమః', 'ఈశానః సర్వ విద్యానాం', 'ఈశ్వరః సర్వభూతానాం' అని వేదమంత్రాలు శివుని స్తుతించాయి. అంటే సర్వ విద్యలూ, సకల జీవులకూ ఆయన మూలకారకుడు. 'బ్రహ్మాధిపతిః బ్రహ్మణోధిపతిః' అన్నారు. అంటే సృష్టికర్త అయిన చతుర్ముఖ బ్రహ్మకు, వేదాల్లోని మంత్రాలకూ ఉమాపతే అధిపతి. అయితే నిర్మలమైన మనసుతో స్వామిని కీర్తించి, ఆరాధించినప్పుడే సత్ఫలితాలుంటాయి. అందుకే 'చిత్తశుద్ధి లేని శివపూజ లేల?' అని వేమన ఎద్దేవా చేశాడు.

**అర్ధరాత్రి ఉద్భవించిన అభిషేకప్రియుడు**

మాఘ బహుళపక్ష చతుర్దశి అర్ధరాత్రి లింగోద్భవ కాలం. పరమాత్మను నిశిరేయిలో పూజించే ప్రత్యేక పర్వదినమిది. ఈ మహాశివరాత్రి రోజే శివుడు అగ్నిలింగరూపంలో ఆవిర్భవించినట్లు పురాణాలు చెబుతున్నాయి. రాత్రి అనేది లౌకిక వ్యవహారాలు సద్దుమణిగే స్థితి. అందునా అర్ధరాత్రి. 'బహిర్ముఖ దృష్టిని వదలి, బుద్ధిని అంతర్ముఖం చేసి, అంతరంగంలో ఈశ్వర జ్యోతిపై కేంద్రీకృతం చేయడమే రాత్రి. పగలు బహిర్ముఖం, రాత్రి అంతర్ముఖం' అని వ్యాఖ్యానించారు పారమార్థిక సాధకులు. ఇంద్రియాల ద్వారా బాహ్య విషయాల చుట్టూ భ్రమించే మనసును, చైతన్యానికి మూలకేంద్రమైన ఆత్మజ్యోతిలో అంటే శివజ్యోతిలో లీనం చేసే అంతర్ముఖ ప్రయాణమే శివరాత్రి అని వారు భావిస్తారు. ప్రాతః సంధ్య, మధ్యాహ్న సంధ్య, సాయం సంధ్య- మనందరికీ తెలిసినవి. నాలుగోది అర్ధరాత్రి అయిన తురీయ సంధ్య. ఇది పూర్తిగా ఆధ్యాత్మిక సాధనలకు సంబంధించింది. అలజడులన్నీ అణగిన ఈ అచలస్థితి ధ్యానానికి మరింత అనుకూలం. మనసు పరమానందాన్ని అనుభవించే ఆ తాదాత్మ్యస్థితిలో లౌకిక లంపటాలన్నీ సద్దుమణుగుతాయి. దాన్నే ఆధ్యాత్మిక గురువులు 'పరమమైన లయ' అంటారు. ఈ పర్వదినాన పగలంతా ఉపవాసం ఉండి, రాత్రిపూట అభిషేకాలు, పూజలు, జాగరణ చేయాలని 'లింగపురాణం' చెబుతోంది. రోజంతా శివనామస్మరణతో గడపటం వల్ల మనసు పరిశుద్ధమవుతుందన్నది భక్తుల అనుభవం.

**తిరుమలలో మహాశివరాత్రి**

వేంకటాచల క్షేత్రానికి శివుడి మరో రూపమైన రుద్రుడు క్షేత్రపాలకుడు. తిరుమలేశునికి నివేదించే సమయంలో ఆ స్వామికి కూడా ప్రసాదం సమర్పిస్తారు. శివకేశవులకు భేదమే లేదనటానికి తిరుమలలో నిర్వహించే మహాశివరాత్రి వేడుకే నిదర్శనం. ఉదయం శ్రీవారి ఆలయం నుంచి అర్చకులు, వేదపండితులు, భక్తులు ఛత్రచామరాలతో పూజాద్రవ్యాలు, మంగళ వాద్యాలతో ఊరేగింపుగా సమీపంలోని పాండవతీర్థానికి వెళ్తారు. అక్కడ వేంచేసి ఉన్న క్షేత్రపాలకుడైన రుద్రునికి ఏకాదశ నమక, చమక రుద్రమంత్రాలతో అభిషేకం చేస్తారు. తిరుమల క్షేత్ర సంప్రదాయం ప్రకారం రుద్రునికి వెండి నామాలు (ఊర్ధ్వపుండ్రాలు), నేత్రాలను అలంకరిస్తారు. పుష్పాలంకరణ చేసి, శాస్త్రోక్తంగా ధూపదీపాలను నివేదిస్తారు. రుద్రునికి నివేదనగా వడపప్పు, పానకం, పండ్లతో పాటు తాంబూలాన్ని సమర్పిస్తారు.

# అర్థ రహితం దోష భరితం



సోషల్ మీడియాలో పూటకో కొత్త రూపు సంతరించుకుంటున్నా, ఓటీటీ సంచనాలు సృష్టిస్తున్నా.. స్మార్ట్ దునియాలో ఇప్పటికైతే యూట్యూబ్‌దే హవా! గిగాబైట్ల కొద్దీ ఎంటర్‌టైన్మెంట్ పంచుతున్న యూట్యూబ్ అడ్డాగా బాగుపడ్డవాళ్లు ఎందరో! కానీ, ఇదే యూట్యూబ్ వేదికగా విశృంఖల, విపరీత పైత్యాన్ని ప్రదర్శిస్తున్నారు కొందరు. ఘనాపాఠిని ఇంటర్వ్యూ చేసినా, మేటి నటిని పలకరించినా, గాన కోకిలతో ముచ్చటించినా.. వాళ్లు చెప్పే సంగతుల్లోని అసలు విషయాన్ని పక్కదారి పట్టించే మాయదారి థంబ్‌నెయిల్స్ పెడుతూ పబ్బం గడుపుకొంటున్నారు. అదేమిటంటే.. నెగెటివ్ థంబ్ నెయిల్స్ పెడితే హిట్లు ఎక్కువగా వస్తాయని వ్యాఖ్యానిస్తున్నారు. దశాబ్దాలపాటు తెలుగువారిని అలరించిన ఓ ప్రముఖ గాయనిని మరో విశిష్ఠ యాంకర్ ఇంటర్వ్యూ చేసింది. అందులో చాలా విషయాలు చర్చకు వచ్చాయి. ఆ ఇంటర్వ్యూను ముక్కలు ముక్కలుగా యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. ఒక్కోదానికీ ఒక్కో చెత్త థంబ్ నెయిల్ పెట్టారు. వీటిలో జాతిరత్నం 'అసహ్యమైన పాటలు పాడించేవాడు' అన్నది. తీరా వీడియోలోకి వెళ్తే అన్నీ మంచి విషయాలే! యాంకర్ అడిగే ప్రతి ప్రశ్నకూ.. ఆ గాయని హుందాగా, సహేతుకంగా సమాధానం చెప్పింది. 'పిల్లలకు పాడాను, అబ్బాయి గొంతులా పాడాను, కొన్నిసార్లు చాలా అసహ్యంగా పాడాల్సిన పాటలూ ఉంటాయి. ఇళయరాజాకు ఎన్ని రకరాల వెరైటీలు పాడాను నేను' అని చెప్పుకొచ్చింది. ఈ వీడియోకు 'అసహ్యమైన పాటలు పాడించేవాడు' అని థంబ్ నెయిల్ తగిలించి, ఇళయరాజా చిత్తరువును ఇన్‌సర్ట్ చేశారు. అక్కడ ఆమె అన్నదేంటి? వీళ్లు పెట్టిదేంటి? పాట ఉన్నంత కాలం చెరగని కీర్తి మూటగట్టుకున్న ఆ మహాగాయని ప్రతిష్ఠకు భంగం వాటిల్లుతుందన్న ఇంగితం కూడా లేకుండా నీచమైన థంబ్‌నెయిల్ పెట్టి పైశాచిక ఆనందం పొందడం ఎందుకో అర్థం కాదు! మరో థంబ్‌నెయిల్ 'ఇళయరాజాకి నేను పాడాను అంటే వచ్చి గొడవ చేసేవారు' అని ఉంది. ఆ యూట్యూబర్ భావన 'పాడను' అంటే.. కానీ, తప్పును కూడా పద్ధతిగా చేయలేని దుస్థితిలో ఉండటం గర్హనీయం. ప్రముఖ గాయని ఇంటర్వ్యూలోనే ఇన్ని అర్థరహితాలు, దోషభరితాలు ఉంటే%ొ% ఓ మోస్తరు కళాకారుల విషయంలో ఇంకెంతటి వైపరీత్యాలు ప్రదర్శిస్తున్నారో ఊహించుకోవచ్చు.

# కరెంట్ మీటర్



మనుషులను శుభ్రం చేసే వాషింగ్ మెషీన్ ఇటీవల వార్తల్లో నిలిచింది. దీనిని రూపొందించిన సంస్థ ఏది? ప్రపంచంలోనే అరుదుగా కనిపించే ఓ పక్షి.. మహబూబాబాద్ జిల్లాలోని భీమునిపాదం జలపాతం దగ్గర ఓ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ కెమెరాకు చిక్కింది. ఆ పక్షి పేరేంటి? శ్రీనగర్‌లోని దాల్ సరస్సులో విహరించే 'షికారా' చెక్క పడవలను తమ యాప్ ద్వారా బుక్ చేసుకునే సదుపాయాన్ని కల్పించిన సంస్థ ఏది? హైదరాబాద్ చరిత్రలో అంతర్భాగమైన ఓ భవనం.. జాతీయ స్థాయి మేధో సంపత్తి హక్కుల పరిరక్షణ విభాగంలో 'ట్రేడ్‌మార్క్' పొందనున్నది. దక్షిణ భారతదేశంలో తొలిసారిగా ఈ ఘనత సాధించనున్న ఆ భవనం ఏది? రాష్ట్రంలోని ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్లినిక్‌ల పేరేంటి? సూర్యుడి వెలుపలి వలయమైన 'కరోనా'పై లోతైన పరిశోధనలు చేయడానికి ఐరోపా అంతరిక్ష సంస్థ ఇటీవల ఓ వినూత్న ప్రయోగం చేపట్టింది. ఆ ప్రయోగాన్ని ఏమని పిలుస్తున్నారు? సైబర్ నేరగాళ్లు తెరుస్తున్న 'మ్యూల్ అకౌంట్స్'ను ఏరివేయడమే లక్ష్యంగా ఆర్బీఐ ఆవిష్కరించిన ఏఐ మోడల్ ఏది? భోపాల్ నగరాన్ని మృత్యుదిబ్బగా మార్చిన 'గ్యాస్ దుర్ఘటన'కు ఇటీవలే 40 ఏళ్లు పూర్తయాయి. ఏ కర్మాగారం నుంచి గ్యాస్ లీకై.. వేల మంది మరణాలకు కారణమైంది? టీ20ల్లో 40 బంతుల్లోపు రెండు శతకాలు సాధించిన తొలి ఆటగాడిగా తాజాగా రికార్డు సృష్టించిన యువ క్రికెటర్ ఎవరు? భారత అమ్ముల పొదిలోకి ఓ సరికొత్త అస్త్రం వచ్చి చేరింది. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఆ అధునాతన సెల్ఫ్ డిస్ట్రాయ్ డ్రోన్ ఏది?

### బరువు తగ్గాలని అనుకుంటున్నారా

# అయితే ఈ తప్పులు అస్సలు చేయొద్దు



నేటితరం మహిళల్ని వేధిస్తున్న అతిపెద్ద సమస్య.. అధిక బరువు. దీనివెంటే.. కీళ్లనొప్పులు, గుండె జబ్బులు, రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలూ పలకరిస్తాయి. కాబట్టి, ఎలాగైనా బరువు తగ్గాల్సిందేనని కంకణం కట్టుకుంటారు. ఇక యువతులైతే నాజూగ్గా కనిపించేందుకు ప్రయత్నిస్తుంటారు. అలా.. 'బరువు'ను కంట్రోల్ చేసేందుకు 'స్ట్రిక్ట్ డైట్' పాటిస్తుంటారు. ప్రతిరోజూ రకరకాల వ్యాయామాలు చేస్తుంటారు. అయినా.. కొందరుమాత్రం బొద్దుగానే కనిపిస్తుంటారు. ఒళ్లు హూనమయ్యేలా వర్కవుట్స్ చేస్తున్నా.. నోరు కట్టేసుకుని హెల్తీ డైట్ పాటిస్తున్నా.. బరువెందుకు తగ్గడం లేదని బాధ పడుతుంటారు. అయితే, వారికి తెలియకుండానే చేసే కొన్ని తప్పులు.. బరువు తగ్గకుండా చేస్తాయని వ్యాయామ నిపుణులు చెబుతున్నారు. వాటిని గుర్తించి, పునరావృతం కాకుండా చూసుకుంటే.. 'బరువు'ను నియంత్రణలో ఉంచుకోవచ్చని సూచిస్తున్నారు. బరువు తగ్గేందుకు భారీ వ్యాయామాలు చేయవద్దనీ, అలా చేయడం వల్ల కండరాలు మరింత బలాన్ని పొందుతాయని చెబుతున్నారు. ఎక్కువ ఒత్తిడికి గురైనా బరువు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. ఇక రాత్రిపూట ఆలస్యంగా భోజనం చేయడం, అందులోనూ కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం కూడా బరువు పెరగడానికి కారణం అవుతాయి. ఇక మహిళల్లో అంతర్లీనంగా ఉండే కొన్ని ఆరోగ్య సమస్యలు కూడా వారి బరువును ప్రభావితం చేస్తాయని నిపుణుల మాట. ముఖ్యంగా.. ఆడవాళ్లలో హార్మోన్ల అసమతుల్యత వల్ల జీవక్రియలు నెమ్మదించి, బరువు పెరిగే అవకాశం ఉంటుంది. ఇక పీసీఓడీ, పీసీఓఎస్ సమస్యలు కూడా బరువును పెంచేవే! మెనోపాజ్ సమయంలోనూ కొందరు బరువు పెరుగుతుంటారు. ఇలాంటి సమస్యలు ఎదుర్కొనేవారు.. బరువును నియంత్రణలో ఉంచుకోవడం కొంచెం కష్టమే! నిద్రలేమి కూడా బరువు పెరగడానికి ఓ కారణం! రాత్రిపూట ఆరుగంటల కన్నా తక్కువ నిద్రపోయే వారి శరీరంలో.. కొవ్వు ఎక్కువగా పెరిగిపోతుందట. నిద్రలేమి వల్ల శరీరంలో కార్టిసోల్, ఇన్సులిన్ హార్మోన్లు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయనీ, ఇవి శరీర బరువు పెరిగేలా చేస్తాయని వైద్యులు చెబుతున్నారు. ఈ సమస్యలను గుర్తించి, పరిష్కార మార్గాలను ఫాలో అయితే.. బరువు తగ్గేందుకు అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు.

# భాష మీద చర్చ అవసరం

ఎవరు జర్నలిస్టులో తేల్చాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జర్నలిస్టుల సంఘాలను కోరారు. జర్నలిస్టుల సంఘాలకు ఈ బాధ్యత అప్పగిస్తున్నప్పుడు ఎవరు జర్నలిస్టులో తేల్చే బాధ్యత ఏ రాజకీయ పార్టీ జర్నలిస్టు సంఘానికి అప్పగిస్తున్నారో ఆయన స్పష్టత ఇస్తే బాగుండేది. మిత్రపక్ష జర్నలిస్టు సంఘానికా?సొంత పార్టీ సంఘానికా? బీజేపీ, బీఆర్ఎస్ సంఘానికా? ఏ పార్టీ సంఘానికి ఈ బాధ్యత అప్పగిస్తున్నారు.గతంలో సీపీఐ, సీపీఎం పార్టీలకే జర్నలిస్టుల సంఘాలుండేవి. ఇప్పుడు కాంగ్రెస్‌తో సహా ప్రతి రాజకీయ పక్షానికి సంఘాలున్నాయి. అయితే ఎవరు జర్నలిస్టో మీడియా యాక్ట్ స్పష్టంగా చెప్పింది. రేవంత్ రెడ్డి బాధ్యతలు అప్పగించే సంఘం మీడియా చట్టం కన్నా శక్తివంతమైనదా? ఈ అంశం హైడ్రా కూల్చివేతల నుంచి మొదలైంది. పైసా పైసా కూడబెట్టుకొని స్థలం కొనుక్కొని ఇల్లు కట్టుకుంటే కూల్చివేసినప్పుడు బాధితుల స్పం దన తీవ్రంగానే ఉంటుంది. బాధితులంటే తడి గుడ్డతో గొంతులు కోసే ముదుర్లు కాదు. మం చి చేస్తే కాళ్లమీద పడతారు. తమ గూడు కూల్చివేస్తే బూతులు తిడతారు. ఆ బూతులు సాధారణంగా ప్రధాన మీడియా చూపించదు. యూట్యూబ్‌కు అవే పెద్ద మసాలా? ఆ బూతులు చూపుతూ వ్యూవర్‌షిప్ పెంచుకుంటాయి.యూట్యూబ్ ఛానల్స్ అన్ని రాజకీయ పక్షాలకున్నాయి. ఇది మిగిలిన అందరికన్నా రేవంత్ రెడ్డికి బాగా తెలుసు. పీసీసీ అధ్యక్షుని గా ఉన్నప్పుడు యూట్యూబ్‌ల బృందాన్ని నిర్వహించారు. పోలీసులు ఆ కార్యాలయం మీద దాడి కూడా చేశారు. యూట్యూబ్‌ల ద్వారా కాంగ్రెస్‌లో సీనియర్‌ల మీద బురదజల్లుతున్నారని ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఫిర్యాదు కూడా చేశారు. సీఎం రేంత్ ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని ఆయనను ప్రజలు బూతులు తిడుతున్నారు. యూట్యూబ్ ఛానల్స్ ఆ బూతులను యథాతథంగా ప్రసారం చేస్తున్నాయి. యూట్యూబ్స్‌లో యథాతథంగా ప్రసారం చేయడంపై సీఎం కోరుకుంటున్నట్టు చర్చ జరగడం మంచిదే. మంచి, చెడు, గౌరవ ప్రదమైన భాష గురించి తెలియని గ్రామీణుడు అలా మాట్లాడటాన్ని మనం తప్పుపడుతున్నాం, తప్పుబట్టాలి కూడా. అది ముమ్మాటికీ తప్పే. ఆ బాధితుడి మాటలను అంతగా వ్యతిరేకిస్తున్న మనం ముఖ్యమంత్రి వంటి అత్యున్నతమైన పదవిలో ఉండి ఉచ్చ నీచాలు మరిచి మాట్లాడుతున్న మాటల మీద మరి చర్చ అవసరం లేదా?కవితకు బెయిల్ వచ్చినప్పుడు ముఖ్యమంత్రిగా ఉంటూ రేవంత్‌రెడ్డి అభ్యంతరకరంగా మాట్లాడటాన్ని చివరికి సుప్రీంకోర్టు కూడా సీరియస్‌గా తీసుకొని ఈ




అంశంపై నిర్ణయం తీసుకుంటామని ప్రకటించిన తర్వాత ముఖ్యమంత్రి క్షమాపణలు చెప్పారు. రేవంత్‌రెడ్డి మాటల మీద సుప్రీంకోర్టులో చర్చ జరిగితే బాగానే ఉండేది. రేవంత్‌రెడ్డి క్షమాపణతో ఆ అవకాశం లేకుండా పోయింది. ప్రకటనల కోసం కోట్ల రూపాయలు ఖర్చుచేస్తున్నా, సొంత, అధికార, పార్టీ యూ ట్యూబ్స్ టీమ్స్ ఉన్నా, మీడియా అండగా నిలిచినా వీటిని మించిన ప్రచారం బూతు మాటల యూట్యూబ్స్‌కు లభిస్తున్నది. దానితో రేవంత్ తీవ్ర అసహనానికి గురవుతున్నారు. బాధితుల బూతు లు, వాటిని యూట్యూబ్‌లో యథాతథంగా ప్రసారం చేయడం వ్యతిరేకించాల్సిందే. దీనిపై చర్యలు తీసుకోవాలిసిందే. మరి అంతకుమిం చి బూతులు మాట్లాడుతున్న రాజకీయ నాయకులపై ఏ చర్చ వద్దా? ఏ చర్య వద్దా?'నన్నేమైనా అనండి భరిస్తాను కానీ, తెలంగాణను అవమానిస్తే పాతి పెడతాను' అని సీఎంగా ఉన్నప్పుడు వరంగల్‌లో కేసీఆర్ అంటే జాతీయస్థాయిలో విమర్శలు చేశారు. ఇప్పుడు నిండు సభలో బట్టలూడదీసి కొడతాను, చెడ్డీలో తొండలు వదులుతానని మీడియాను సీఎం హెచ్చరిస్తున్నారు. బట్టలూడదీసి కొట్టే అధికారం సీఎంకు ఏ చట్టం ద్వారా సం క్రమించిందో చెప్తే తెలుసుకుందాం. టీడీపీ అధ్యక్షునిగా ఉన్నప్పుడు, పీసీసీ అధ్యక్షునిగా ఉన్నప్పుడు, ఇప్పుడు రేవంత్‌రెడ్డి బూతులు మానలేదు. సుప్రీంకోర్టుకు క్షమాపణలు చెప్పి న తర్వాత మాట తీరు మారుతుందనుకుంటే మరింత అసహనం పెరిగిపోయింది. తనకు వ్యతిరేకంగా రాశారని గతం లో అనేకసార్లు మీడియాను మీరు డీఎన్ఏ పరీక్ష చేయించుకోండి అని రేవంత్‌రెడ్డి తిట్టా రు. తెల ంగాణను అవమానిస్తే పాతరేస్తా అన్న మాటల్లో తప్పు కనిపించినవారికి డీఎన్ఏ పరీ క్ష చేయించుకోండి అనే తిట్టు మాత్రం మురిసిపోయేట్టు చేసింది. ఎవరు జర్నలిస్టో చట్టం స్పష్టమైన నిర్వచనం చెప్పిన తర్వాత సంఘాలు అంతకుమించి నిర్వచనం ఇస్తాయా?ఎవరు జర్నలిస్టో తేల్చే అధికారం సంఘాలకు ఉంటుందా? ప్రభుత్వం ఇచ్చే సౌకర్యా లు, ప్రకటనలు, అక్రిడేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే వారిలో ఎవరికివ్వాలో, ఎవరికివ్వవద్దో తేల్చే అవకాశం సంఘాల చేతిలో ఉండవచ్చు. ప్రభుత్వ సౌకర్యాలు కోరుకోకుండా ఉండేవారిని ఏం చేయగలరు. మీడియానా? మీడియా కాదా? అని కాదు. ఇష్టం వచ్చినట్టు బూతులు మాట్లాడే యూట్యూబ్స్ మీద, నాయకుల మీద ఇప్పుడు ఉన్న చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. అయితే, మన వ్యవస్థల్లో పెద్దలకు ఒకవైపే కనిపిస్తుంది. అధికార పక్షం వైపు చూపు పని చేయదు.ప్రతిపక్ష నాయకుడు స్ట్రెచర్ మీదినుంచి మార్చురీకి వెళ్లాలా? సీఎం స్థాయి వాళ్లే ఇలాంటి అనాగరిక భాష మాట్లాడితే బాధితులు ఎలా మా ట్లాడుతారు. సంఘాలు రాజకీయ పార్టీల అనుబంధ విభాగాలు. ఇక మీడియా రాజకీయ అనుబంధం తర్వాత తన ప్రాధాన్యం కోల్పోయింది.రాహుల్ గాంధీని పప్పు అని ప్రచారం చేయడానికి బీజేపీలో ఒక పెద్ద వ్యవస్థనే ఉన్న ది. ఇన్ని వేల యూట్యూబ్స్ ఛానల్స్‌లో రాహుల్‌గాంధీని ట్రోల్ చేస్తుంటే ఎలా భరిస్తున్నారో అని సివిల్స్ కోచింగ్ ఇచ్చే వికాస్ దివ్యకృతి ఓ ఉపన్యాసంలో ఆశ్చర్యపోయారు. తాను యూట్యూబ్ గుంపు ద్వారా ప్రత్యర్థులను ట్రోల్‌చేసి, సీఎం అయ్యాక తనను ట్రోల్ చేస్తుంటే రేవంత్‌రెడ్డి తట్టుకోలేకపోతున్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, బాధ్యత లేని యూట్యూబర్స్ భాషను మించి బూతులు తిడుతున్నారు. రాహుల్, రేవంత్ పరిణతికి మధ్య తేడా ఇది. 2004లో బాబు ఓడిపోయాక, ఆయనను అవమానించవద్దని రాహుల్ బహిరంగంగా ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కేసీఆర్ గాయపడితే సీఎంగా రేవంత్ వెళ్లి పరామర్శించారు. కొంత ఆశ్చర్యం వేసిం ది. అయితే, రాహుల్ వెళ్లమంటే వెళ్లాను, లేకపోతే నేనెందుకు వెళ్తానని రేవంత్‌రెడ్డి స్వయం గా ప్రకటించిన తర్వాత ఓహో దీనివెనుక రాహుల్ ఉన్నారా అని అప్పుడు తెలిసింది. మాట్లాడేప్పుడు తాను సీఎంను అని రేవంత్ గుర్తుపెట్టుకుంటే మంచిది. ఆ భాష వల్ల సీఎంకు నష్టం లేకపోవచ్చు కానీ, తెలంగాణకు నష్టం.

# భోజనం చేసిన వెంటనే సోంపు తింటే ఇన్ని ప్రయోజనాలా తెలిస్తే వెంటనే మొదలు పెడతారు

భోజనం చేసిన అనంతరం చాలా మంది రకరకాల ఆహారాలను తింటుంటారు. లేదా జ్యూస్‌లు, ఇతర డ్రింక్స్‌ను సేవిస్తుంటారు. భోజనం చేశాక కొందరు టీ, కాఫీ తాగుతారు. అయితే వాస్తవానికి భోజనం చేసిన అనంతరం సోంపు గింజలను తింటుండాలి. మన పెద్దలు భోజనం చేసిన వెంటనే సోంపు గింజలను నోట్లో వేసుకుని నమిలే వారు. అందుకనే వారు ఎంతో ఆరోగ్యంగా ఉండేవారు. కానీ మనం అలా చేయడం లేదు. దీంతో అనారోగ్యాల బారిన పడుతున్నాం. భోజనం చేసిన అనంతరం సోంపు గింజలను నమలడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని వైద్యులు సైతం చెబుతున్నారు. మనకు కలిగే అనారోగ్య సమస్యలను నయం చేయడంలో సోంపు గింజలు ఎంతగానో పనిచేస్తాయి. భోజనం చేసిన వెంటనే సోంపు గింజలను గుప్పెడు తీసుకుని నమిలితే ఎన్నో లాభాలను పొందవచ్చు.

### జీర్ణ వ్యవస్థ పనితీరుకు..

సోంపు గింజల్లో అనేక పోషకాలు ఉంటాయి. పోషకాలకు వీటిని గనిగా చెప్పవచ్చు. ఈ గింజల్లో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి, పొటాషియం, మెగ్నిషియం సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల ఈ గింజలను తింటే మనకు పోషణ లభిస్తుంది. ఈ పోషకాలు మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రోగాల నుంచి రక్షిస్తాయి. భోజనం చేసిన వెంటనే సోంపు గింజలను తినడం వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ఈ గింజల్లో అనెథోల్ ఉంటుంది. ఇది జీర్ణాశయ ఎంజైమ్‌లను ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీంతో జీర్ణక్రియ మెరుగు పడుతుంది. అలాగే కడుపు ఉబ్బరం, అసిడిటీ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.

### నోటి దుర్వాసన తగ్గుతుంది..

సోంపు గింజల్లో యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. కనుక ఈ గింజలను నోట్లో వేసుకుని నమిలితే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోరు శు భ్రమవుతుంది. నోటి దుర్వాసన నుంచి విముక్తి లభిస్తుంది. కనుకనే భోజనం చేసిన అనంతరం నోరు శుభ్రంగా ఉండేందుకు మన పెద్దలు అప్పట్లో సోంపు గింజలను నమిలే వారు. అలాగే ఈ గింజలను నమిలితే ఫైబర్, మినరల్స్ సమృద్ధిగా లభిస్తాయి. ఇవి శరీర మెటబాలిజంను పెంచుతాయి. దీంతో క్యాలరీలు వేగంగా ఖర్చవుతాయి. ఫలితంగా శరీరంలో ఉండు కొవ్వు కరుగుతుంది. దీని వల్ల అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలని చూస్తున్న వారు భోజనం చేసిన అనంతరం రోజూ సోంపును తింటుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది.

### బీపీ కంట్రోల్ అవుతుంది..



సోంపు గింజల్లో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ముఖ్యంగా ఫ్లేవనాయిడ్స్, క్వర్సెటిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఈ గింజల్లో సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో కణాలు డ్యామేజ్ అవకుండా ఉంటాయి. అలాగే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. కాబట్టి భోజనం చేసిన వెంటనే సోంపు గింజలను తినడం అలవాటు చేసుకోవాలి. అలాగే ఈ గింజల్లో ఉండే పొటాషియం శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో హైబీపీ తగ్గుతుంది. బీపీ ఉన్నవారికి సోంపు గింజలు ఒక వరమనే చెప్పవచ్చు. వీటిని రోజూ తింటుంటే బీపీని కంట్రోల్ చేయవచ్చు. ఇలా భోజనం చేసిన వెంటనే సోంపు గింజలను నమలడం వల్ల అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

## వర్చువల్ భ్రాంతి

# వాస్తవానికి అశాంతి

లైక్‌లే నిజాలు అనుకుంటున్నారా? కామెంట్లే కొలమానాలుగా భావిస్తున్నారా? రోజుకో డీపీ మార్చుకుంటూ%ొ% వర్చువల్ ఇమేజ్‌ను పెంచుకుంటూ పోతున్నారా? ఇలాంటి లక్షణాలు ఉన్నాయంటే.. మీరు బిల్డప్ బుల్లెమ్మలే! డిజిటల్ చట్రంలో ఇరుక్కుపోతే ఎప్పుడో ఫేక్ అయిపోతారు జాగ్రత్త!! ఈ తరం యువతీయువకుల్లో ఈ ఫేక్ ఐడెంటిటీ భావన వారికి తెలియకుండానే ముదిరిపోతున్నదట! లేనివి ఉన్నట్టుగా ఊహించుకుంటూ, తమ వాస్తవ పరిస్థితిని అసహ్యించుకునే స్థాయికి వెళ్లిపోతున్నారట. వర్చువల్ లైఫ్, రియల్ లైఫ్‌ను బ్యాలెన్స్ చేయలేక మనోవ్యథకు గురవుతున్నారట!! శ్రావ్య కాస్త బొద్దుగా ఉంటుంది. ముద్దుగానే ఉంటుంది. కానీ, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లో మాత్రం స్లిమ్‌గా, హాట్‌గా కనిపించే పిక్‌లు పెడుతుంది. వాటికొచ్చే లైక్‌లు, కామెంట్లు చూసుకొని మురిసిపోతుంది. వర్చువల్ ఇమేజ్ కోసం సోషల్ మీడియాలో తెగ యాక్టివ్‌గా ఉంటుంది. కానీ, నిజమేంటో ఆమెకు తెలుసు. ఆ నిజం ఆమెను ఒత్తిడికి గురిచేస్తున్నది!! విశాల్ మధ్యతరగతి అబ్బాయి. ఒకరోజు ఫ్రెండ్ బైక్ మీద టక్కుస్టైల్‌గా రేబాన్ కళ్లజోడు పెట్టుకుని తీసుకున్న సెల్ఫీ ప్రొఫైల్ పిక్‌గా పెట్టాడు. ఏఐ ఎడిటింగ్స్‌తో సాదాసీదా బాడీకి ఫిట్‌నెస్ కూడా అద్దాడు. హీరోలా కనిపించేసరికి విపరీతంగా లైక్‌లు వచ్చిపడ్డాయి. అమాంతంగా వచ్చిన స్టార్‌డమ్‌ను ఎంజాయ్ చేయాలనుకున్నాడు. ఫ్రెండ్స్‌తో షాపింగ్ మాల్స్ చుట్టేస్తూ, కారులో విహరిస్తూ.. దిగిన ఫొటోలు అప్‌లోడ్ చేస్తూ పోయాడు. ఫాలోవర్లూ పెరిగారు. కానీ, అతను పెట్టుకున్న కళ్లజోడు, తిరుగుతున్న కారు.. ఇవేవీ తనవి కావు. కానీ, సోషల్ మీడియాలో చూసేవారంతా విశాల్ రేంజ్ వేరని ఫిక్సయ్యారు. అంతేకాదు, తనని కూడా అలా ఫిక్సయ్యేలా భ్రమ కల్పించారు. కానీ, విశాల్ మనసులో ఏదో ఒక మూల తెలియని అశాంతి. దీంతో తను ఇష్టంగా తొక్కే సైకిల్‌తో సెల్ఫీ తీసుకోలేని పరిస్థితికి వచ్చేశాడు. వర్చువల్ ప్రపంచంలో విహరిస్తున్న యువతీయువకులు కూడా అచ్చం శ్రావ్య, విశాల్ లాగానే ప్రవర్తిస్తున్నారు. ఫేక్ ఐడెంటిటీని మాస్క్‌లా తగిలించుకొని సోషల్ దునియాను దున్నేస్తున్నామని భావిస్తున్నారు. ముఖ్యంగా యువతులు ఈ డిజిటల్ అట్రాక్షన్స్‌కు ఎక్కువగా గురవుతున్నారని పలు సర్వేలు హెచ్చరిస్తున్నాయి. తమను తాము ఓ బ్రాండ్‌గా ప్రొజెక్ట్ చేసుకోవాలనే తపనే.. చాలామంది అమ్మాయిలను సోషల్ లైఫ్‌కు దగ్గర చేస్తున్నదని మానసిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వాస్తవ ప్రపంచంలో ఒకలా, సోషల్ మీడియాలో మరొకలా వ్యవహరిస్తూ.. ఒక్కరిలోనే ఇద్దరు ఉంటున్నారు. మీలోనూ ఆ ఇద్దరు ఉన్నారా? సోషల్ మీడియాలో ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మారాలని చాలామంది ఆరాటం. బయట ఎలా ఉన్నా.. ఎఫ్‌బీ, ఇన్‌స్టాల్లో ఆదర్శభావాలను వల్లిస్తుంటారు. ఎక్కడో బ్రౌజింగ్‌లో కనిపించిన కొటేషన్లను స్టేటస్‌గా పెట్టేసి గొప్పగా ఫీలవుతారు. దాన్ని ఎంతమంది చూశారు, ఎవరెలా రెస్పాండ్ అయ్యారు అని తరచూ చెక్ చేసుకుంటూ ఉంటారు. నాలుగు లైక్‌లు రాగానే నెట్టింట్లో అందరూ తమనే ఫాలో అవుతున్నారని ఊహించుకుంటారు. కానీ నిజ జీవితానికి వచ్చేసరికి ఆ కొటేషన్‌లో చెప్పిన ఆదర్శభావాలు పాటిస్తున్నామా అన్న ప్రశ్న ఉదయించగానే మానసిక సంఘర్షణకు గురవుతున్నారు. ఈ క్రమంలో డిజిటల్ ప్రపంచంలో సంపాదించుకున్న డమ్మీ ఇమేజ్‌ను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తుంటారు కానీ, తమ రియల్ లైఫ్‌ను అంగీకరించలేరు.

### పరిధి దాటొద్దు

వాస్తవ ప్రపంచంలో అయినా.. సోషల్ వరల్డ్ లో అయినా.. స్థిమితంగా ఉండటం అవసరం. పదే పదే డీపీ మార్చేయడం, అదేపనిగా స్టేటస్ చెక్ చేయడం.. లాంటి వైఖరులు సోషల్‌లైఫ్‌లో మీరు స్థిరంగా లేరన్న దానికి సంకేతంగా భావించాలి. ఎవరిదో బెంజి కారు పార్క్ చేసి ఉంటే సెల్ఫీ తీసుకుని సోషల్ మీడియాలో పోస్టు చేస్తుంటారు కొందరు. దానికొచ్చే లైక్‌లు, కామెంట్లతో ఎంజాయ్ చేస్తారు. ఈ ఆర్భాటం మీ జీవితాన్ని అగాథంలోకి నెట్టే ప్రమాదం ఉంది. లేనిది ఉన్నట్టుగా చూపించాలనుకోవడం ప్రమాదకరం. వర్చువల్ లైఫ్‌ను ఆస్వాదించడం మొదలైతే.. వాస్తవ జీవితంలోకి రావడానికి ధైర్యం సరిపోదు. ఎందుకంటే.. రకరకాల ఫిల్టర్లు, కెమెరా ఆప్షన్లు వాడి మీ అసలు ముఖాన్ని చెరిపేశారు. మీ ఫాలోవర్లు మీ వాస్తవ రూపం చూడాలనుకుంటే మీరెలా స్పందిస్తారు? ఆ పరిస్థితే వస్తే ఫేస్ చేయగలరా? ఆ ఒత్తిడిని తట్టుకోగలరా? మీరో బ్రాండ్ అవ్వడం అంటే.. మీదైన ప్రత్యేకతను చాటుకోవాలి. అంతేకానీ, అరువు తెచ్చుకున్న అందాలను అద్దుకొని మురిసిపోవడం కాదు! మీకున్న టాలెంట్‌తో సోషల్ వేదికల్లో పరిచయమవ్వండి. నిజాయతీగా ప్రయత్నిస్తే ఎప్పటికైనా మీరు ఆశించిన సెలెబ్రిటీ హోదా దక్కుతుంది. మరో మాట పనివేళల్లో, ఆఫీస్ కంప్యూటర్స్‌లో సోషల్ మీడియా సర్వీసులను యాక్సెస్ చేయొద్దు. సామాజిక మాధ్యమాల్లో లైక్‌లే పరమావధిగా ఏది పడితే అది షేర్ చేయొద్దు. ఓ పరిధి మేరకే విషయాలను పంచుకోవాలన్న విషయాన్ని గ్రహించాలి. వర్చువల్‌లో ధరించిన ఫేక్ ముసుగు.. రియల్ వరల్డ్‌లో మీ ఇమేజ్‌ని అమాంతం నేలకు దించేస్తుందని మర్చిపోవద్దు.

### ఎడిటింగ్ మాయ కొంత

సోషల్ మీడియా మయసభను మించిన మాయా ప్రపంచం! కృత్రిమ మేధకు దత్త సంతతిలా పుట్టుకొచ్చిన ఎడిటింగ్ ఫీచర్లు అస్త్రాలుగా చాలామంది రకరకాల గిమ్మిక్కులు చేస్తున్నారు. ఫేక్ పోస్టింగులు పెడుతున్నారు. లావుగా ఉన్నవాళ్లు మెరుపుతీగలా కనిపించేలా మాయ చేస్తున్నారు. బానపొట్టతో ఉన్న పురుషుడి ఫొటో ఏఐ సాయంతో సిక్స్‌ప్యాక్‌లోకి మారిపోతున్నది. వీటిని ఫాలో అయ్యేవారు ఆ క్షణం మురిసిపోయి లైక్ కొట్టి ఊరుకుంటారు.



అక్కడితో వాళ్ల పాత్ర ముగిసిపోతుంది. ఆ లైక్‌ల ప్రభావంతో ఇమేజ్ చట్రంలో ఇరుక్కుపోతున్నారు కొందరు. అయితే ఈ ఫేక్ ఎన్నోరోజులు నిలబడదు. సోషల్ మీడియా అకౌంట్‌లో ఉన్న మీరు.. అసలైన మీరు కాదని ప్రపంచానికి తెలియకపోవచ్చు. కానీ, ఏదో ఒకరోజు.. 'అది నేను కాదు!' అన్న నిజాన్ని మీరు అంగీకరించక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. అప్పుడు మనసు, మెదడూ రెండూ ప్రశ్నిస్తాయి. మీరు 'ఒక్కరా? ఇద్దరా?', 'నీ నిజ స్వరూపం ఏది?' అని. అప్పటికైనా వాస్తవం గుర్తించగలిగితే ఫర్వాలేదు. ఇంకా భ్రమల్లోనే ఉంటామంటే మిమ్మల్ని మీరు మోసం చేసుకున్నట్టే!

# రూపీ @84.91

**ఆల్‌టైమ్ కనిష్ఠానికి దేశీయ కరెన్సీ**

**మరో 11 పైసలు పతనం**



రూపాయి విలువ మరింత క్షీణించింది. సోమవారం ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే రూపీ మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠానికి దిగజారింది. ఈ ఒక్కరోజే మరో 11 పైసలు పడిపోయి మునుపెన్నడూ లేనివిధంగా 84.91 స్థాయికి పతనమైంది. పెరిగిన అమెరికా బాండ్ ఈల్డ్స్, దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలు, దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్.. రూపీని కూలదోశాయని ఫారెక్స్ ట్రేడర్లు చెప్తున్నారు. ఇక ఉదయం ఆరంభంలో రూపీ ట్రేడింగ్ 84.83 వద్ద మొదలైంది. ఈ క్రమంలోనే ఒకానొక దశలో 84.93 స్థాయికి తగ్గింది. అయితే చివర్లో కాస్త కోలుకొని 84.91 వద్ద స్థిరపడింది. శుక్రవారం కూడా రూపాయి 8 పైసలు కోల్పోయి రికార్డు స్థాయిలో 84.80 వద్ద ముగిసిన విషయం తెలిసిందే. కాగా, గతకొద్ది రోజులుగా ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్ ముందు రూపాయి వెలవెలబోతూనే ఉన్నది. దీంతో దేశీయ దిగుమతులు భారంగా మారుతున్నాయి. పరిస్థితులు మరింత దిగజారకుండా రిజర్వ్ బ్యాంక్, కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

# తగ్గిన బంగారం మెరుపులు

**మరో రూ.1,150 దిగిన తులం ధర**



బంగారం ధరలు క్రమంగా దిగొచ్చాయి. దేశీయంగా పెళ్లిళ్ల సీజన్ ముగియడం, స్టాకిస్టులు, రిటైలర్లు అమ్మకాలకు మొగ్గుచూపడంతో వరుసగా రెండోరోజు సోమవారం కూడా ధరలు భారీగా తగ్గాయి. దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ.1,150 తగ్గి రూ.79 వేల దిగువకు పడిపోయి రూ.78, 350 వద్ద ముగిసింది. అంతకుముందు ఇది రూ.79,500గా ఉన్నది. బంగారంతో పాటు వెండి కూడా తగ్గింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో కిలో వెండి రూ.300 దిగి రూ.92,500గా నమోదైంది. గత రెండు సెషన్లలో కిలో వెండి ఏకంగా రూ.4,500 తగ్గినట్లు అయింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ నూతన ఆర్థిక సంస్కరణలతో కొనుగోలుదారుల్లో అనిశ్చిత పరిస్థితి నెలకొన్నదని, దీంతో అమ్మకాలకు మొగ్గుచూపడం ధరలు తగ్గాయని ట్రేడర్ వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,678.50 డాలర్లకు చేరుకోగా, వెండి 31.11 డాలర్ల వద్ద ఉన్నది.

# చుట్టుముట్టిన ఫెడ్ భయాలు

**సెన్సెక్స్ 385, నిఫ్టీ 100 పాయింట్ల పతనం**



దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాలోకి జారుకున్నాయి. ఈ వారంలో వడ్డీరేట్లపై అమెరికా ఫెడరల్ రిజర్వు నిర్ణయం తీసుకునే అవకాశం ఉండటంతో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా ఐటీ, మెటల్ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడంతో సెన్సెక్స్ 82 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. వీటికితోడు చైనా ఆర్థిక వ్యవస్థ మరింత బలహీనపడుతుండటం, రూపాయి మారకం విలువ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో మదుపరుల్లో సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో ఒక దశలో 600 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 384.55 పాయింట్లు కోల్పోయి 81,748.57 వద్ద స్థిరపడింది. మరో సూచీ నిఫ్టీ 100 పాయింట్లు కోల్పోయి 24,668.25 వద్ద ముగిసింది. ఆసియా, యూరోపియన్ మార్కెట్లు నష్టాల్లోకి జారుకోగా, అమెరికా ఫెడ్ సమావేశం నిర్ణయం కోసం మదుపరులు వేచి చూసే దోరణి అవలంభించడం వల్లనే సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. సూచీల్లో టైటాన్, అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, టీసీఎస్, ఎన్‌టీపీసీ, భారతీ ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, హెచ్‌యూఎల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేర్లు నష్టపోయాయి.

# 40 శాతానికి పైగా రిటర్న్స్ అందించిన ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ ఇవే..!




ప్రతి ఒక్కరూ తమ కుటుంబం, పిల్లల అవసరాల కోసం తమ ఆదాయంలో కొంత మొత్తం పొదుపు చేస్తుంటారు. అలా పొదుపు చేసిన మొత్తం వేర్వేరు పెట్టుబడి, మదుపు పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తారు. ప్రత్యేకించి పిల్లల ఉన్నత విద్యాభ్యాసం, ఆడపిల్లల పెండ్లిండ్ల కోసం ఈ పెట్టుబడులు కొనసాగుతాయి. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్స్, మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీ మార్కెట్లు, బంగారం కొనుగోళ్లు, రియాల్టీ రంగంలో పెట్టుబడులు పెడుతుంటారు. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (ఎస్ఐపీ) కింద ప్రతి నెలా క్రమం తప్పకుండా మదుపు చేస్తే గడువు ముగిసే నాటికి మంచి రిటర్న్స్ ఇస్తాయి. 2024లో సుమారు 10 ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఎస్ఐపీ పెట్టుబడులపై 40 శాతానికి పైగా రిటర్న్స్ అందించాయి. 150కి పైగా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ 20 శాతానికి పైగా రిటర్న్స్ అందించాయి. ఈ ఏడాది కాలంలో ఇన్వెస్టర్లు 268 ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో సిప్ పెట్టుబడులు పెట్టారు. మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్స్‌లో నాలుగు టాప్ స్కీమ్స్ ఇందులో చోటు దక్కించుకున్నాయి. మోతీలాల్ ఓస్వాల్ మిడ్ క్యాప్ ఫండ్ 60.78 శాతం, మోతీలాల్ ఓస్వాల్ స్మాల్ క్యాప్ ఫండ్ 54.72 శాతం రిటర్న్స్ అందించాయి. మోతీలాల్ ఓస్వాల్ ఈఎల్ఎస్ఎస్ టాక్స్ సేవర్ ఫండ్ 49.23 శాతం, మోతీలాల్ ఓస్వాల్ లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్ 48.72 శాతం రిటర్న్స్ ఇచ్చాయి. ఇన్వెస్టర్లకు బంధన్ స్మాల్ క్యాప్ ఫండ్ 46.44 శాతం రిటర్న్స్ ఇచ్చింది. మోతీలాల్ ఓస్వాల్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ లో పెట్టుబడులపై 45.99 శాతం రిటర్న్స్ వచ్చాయి. ఇన్ వెస్కో మ్యూచువల్ ఫండ్ లో మూడు స్కీమ్స్ మంచి రిటర్న్స్ అందించాయి. ఇన్వెస్కో ఇండియా మిడ్‌క్యాప్ ఫండ్ 45.06 శాతం, ఇన్ వెస్కో ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్ 42.29, ఇన్వెస్కో ఇండియా ఫోకస్డ్ ఫండ్ 40.88 శాతం రిటర్న్స్ ఇచ్చాయి. ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్ స్మాల్ క్యాప్ ఫండ్ 40.03 శాతం రిటర్న్స్ అందించింది. మరో 258 ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ -0.98 శాతం నుంచి 39.84 శాతం మధ్య రిటర్న్స్ అందించాయి.

# ఎడాపెడా రైటాఫ్‌లు






**పదేండ్లలో రూ.12.3 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ చేసిన బ్యాంకులు**
**ఒక్క ఏడాదిలోనే రూ.2.4 లక్షల కోట్ల లోన్లు తొలగింపు**
**అగ్రస్థానంలో నిలిచిన సర్కారీ బ్యాంక్ ఎస్బీఐ**
**పార్లమెంట్‌లో వెల్లడించిన కేంద్రం**

**మొండి బకాయిల ఊబిలో భారతీయ బ్యాంకింగ్ రంగం కూలబడింది. గడిచిన పదేండ్లలో ఆయా బ్యాంకులు రైటాఫ్ చేసిన రుణాల విలువ రూ.12 లక్షల కోట్లపైనే మరి. పార్లమెంట్ సాక్షిగా నరేంద్ర మోదీ సర్కారు చేసిన ఈ ప్రకటన.. దేశంలో బ్యాంకుల అవస్థలకు అద్దం పడుతున్నదిప్పుడు.**

భారతీయ బ్యాంకింగ్ రంగం మెడకు నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ లేదా మొండి బకాయిలు) గుదిబండలా తయారయ్యాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత ప్రధానమైన వాణిజ్య బ్యాంకులు గత పదేండ్లలో వదిలించుకున్న ఎన్‌పీఏల తీరే ఇందుకు నిదర్శనం. కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కారు కొలువుదీరిన దగ్గర్నుంచి ఏకంగా రూ.12 లక్షల కోట్లకుపైగా లోన్లను బ్యాంకర్లు రైటాఫ్ చేశారు. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు దేశీయ కమర్షియల్ బ్యాంకులు రూ.12.3 లక్షల కోట్ల రుణాలను ఖాతా పుస్తకాల నుంచి తొలగించినట్టు తాజాగా పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

### రూ.6.5 లక్షల కోట్లు...

గడిచిన ఐదేండ్లలో బ్యాంకుల్లో జరిగిన రైటాఫ్‌ల్లో అత్యధికం ప్రభుత్వ బ్యాంకులు చేసినవే కావడం గమనార్హం. ఏకంగా రూ.6.5 లక్షల కోట్ల లోన్లను ఎన్‌పీఏలుగా నిర్ధారించి ఖాతా పుస్తకాల నుంచి తీసేశాయి. ఇక గత ఆర్థిక సంవత్సరం (2023-24) బ్యాంకు రుణాల్లో ఒక శాతం రైటాఫ్‌ల కిందికే పోయాయి. ఈ నేపథ్యంలోనే కొత్త రుణాల్లో ప్రభుత్వ బ్యాంకుల వాటా 51 శాతానికి పడిపోయింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23) ఇది 54 శాతంగా ఉన్నది. మరోవైపు ఈ ఏడాది సెప్టెంబర్ ఆఖరునాటికి ప్రభుత్వ బ్యాంకుల మొత్తం రుణాల్లో స్థూల నిరర్థక ఆస్తులు 3.01 శాతానికి పెరిగాయి. ప్రైవేట్ బ్యాంకుల్లో ఇవి 1.86 శాతమే.

### ఎస్బీఐ టాప్...

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ).. లోన్ రైటాఫ్‌ల్లో టాప్‌లో ఉన్నది. గత పదేండ్లలో ఎస్బీఐ తమ ఖాతా పుస్తకాల నుంచి తీసేసిన రుణాల విలువ రూ.2 లక్షల కోట్లుగా ఉన్నది. ఆ తర్వాత పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రూ.94,702 కోట్లతో కొనసాగుతున్నది. కాగా, లోన్ రైటాఫ్ అంటే రుణాలను తీసుకున్నవారిని పూర్తిగా వదిలేయడం కాదని, వారి నుంచి రుణ బకాయిలను వసూలు చేస్తామని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి చెప్తున్నారు. రికవరీ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుందని అంటున్నారు. అయితే ఇచ్చిన రుణం, దానిపై వడ్డీ మొత్తాల్లో ఎంతో కొంతే చివరకు తిరిగొస్తుందని, కొన్ని కేసుల్లో బ్యాంకులు పెద్ద ఎత్తున నష్టపోయిన సందర్భాలూ ఉంటున్నాయని బ్యాంకింగ్ ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి. కోర్టులు, డెట్ రికవరీ ట్రైబ్యునళ్లు, సెటిల్మెంట్లు ఇలా అనేక ఖర్చుల్ని బ్యాంకులు భరించాల్సి వస్తున్నదని కూడా గుర్తుచేస్తున్నారు.

### ఇదీ సంగతి..

సామాన్యులు, సగటు వేతన జీవులు, చిరు వ్యాపారులు రుణాల కోసం వెళ్తే లక్ష ప్రశ్నలతో, సవాలక్ష విచారణలు, పరిశీలనలు చేస్తున్న బ్యాంకులు.. కార్పొరేట్లకు మాత్రం రెడ్ కార్పెట్ పరుస్తున్నాయి. అడిగిందే ఆలస్యం కోట్ల రూపాయల్లో లోన్లను మంజూరు చేస్తున్నారు. ప్రభుత్వాలు సైతం ఇందుకు వంత పాడుతున్నాయి. చివరకు తీర్చలేమని వారు చేతులెత్తేస్తే.. దివాలా ముసుగులో బ్యాంకర్లూ ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడుతున్నది. అవును.. బ్యాంకులు రైటాఫ్ పేరిట ఖాతా పుస్తకాలను క్లీన్ చేసుకుంటున్న రుణాల్లో బడా వ్యాపార, పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్లు పొందిన రుణాలే ఎక్కువ మరి. నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ, విజయ్ మాల్యా తదితర కేసులే ఇందుకు ఉదాహరణ. బ్యాంకులను మోసం చేసి వేల కోట్ల రూపాయల రుణాలను తీసుకుని వీరంతా దేశం విడిచి పారిపోయిన సంగతి విదితమే. ఈ కేసులను సీబీఐ, ఈడీలు విచారిస్తుండగా.. విదేశీ కోర్టుల్లో న్యాయం కోసం పోరాడాల్సిన దుస్థితి నెలకొన్నది. 2018-19లో గరిష్ఠంగా రూ.2.4 లక్షల కోట్ల రుణాల రైటాఫ్. 2023-24లో 1.7 లక్షల కోట్లు. కొత్తగా రుణాలనిచ్చేందుకు వెనుకాడుతున్న ప్రభుత్వ బ్యాంకులు. ఈ సెప్టెంబర్ 30నాటికి పీఎస్‌బీల జీఎన్‌పీఏ రూ.3,16,331 కోట్లు. ప్రైవేట్ బ్యాంకుల్లో 1,34,339 కోట్లే. ఈ ఏడాది ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య ప్రభుత్వ బ్యాంకుల లోన్ రైటాఫ్ రూ.42,000 కోట్లు.

# ఎగుమతులు బెదుర్స్

## నవంబర్‌లో 5 శాతం తగ్గిన ఎక్స్‌పోర్ట్స్




దేశీయ ఎగుమతులు మళ్లీ నీరసించాయి. అక్టోబర్ నెలలో రెండంకెల వృద్ధిని నమోదు చేసుకున్న ఎగమతులు ఆ మరుసటి నెలలో ప్రతికూలానికి పడిపోయాయి. గత నెలలో ఎగుమతుల్లో వృద్ధి మైనస్ 4.85 శాతం తగ్గి 32.11 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఇదే సమయంలో దిగుమతులు ఏడాది ప్రాతిపదికన 27 శాతం ఎగబాకి 69.95 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. వంటనూనెలు, ఎరువులు, పసిడి, వెండి దిగుమతులు పుంజుకోవడంతో వాణిజ్యలోటు చారిత్రక గరిష్ఠ స్థాయి 37.48 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఈ సందర్భంగా వాణిజ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శి సునీల్ బర్త్వాల్ మాట్లాడుతూ..చమురు ధరల్లో హెచ్చుతగ్గుదలు కారణంగా ఎగుమతులపై ప్రతికూల ప్రభావం చూపాయన్నారు. గత నెలలో పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు 50 శాతం తగ్గి 3.71 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. చమురేతర ఉత్పత్తుల ఎగుమతులు రికార్డు స్థాయికి చేరుకున్నాయని, దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఎగుమతులు 800 బిలియన్ డాలర్లు అధిగమించే అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు.

### పసిడి దిగుమతులు హైజంప్...

పసిడి దిగుమతులు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. గత నెలలో భారత్ 14.86 బిలియన్ డాలర్ల విలువైన పసిడి దిగుమతైంది. క్రితం ఏడాది ఇదే నెలలో చేసుకున్న 3.44 బిలియన్ డాలర్లతో పోలిస్తే నాలుగు రెట్లు పెరిగింది. ముఖ్యంగా పండుగ సీజన్‌తోపాటు పెళ్లిళ్ల సీజన్ కూడా తోడవడంతో బంగారానికి అనూహ్యంగా డిమాండ్ నెలకొన్నదని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు పసిడి దిగుమతులు ఏడాది ప్రాతిపదికన 49 శాతం ఎగబాకి 49 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గతేడాది ఇది 32.93 బిలియన్ డాలర్లుగా ఉన్నది. బంగారం 25 శాతం వార్షిక రిటర్నులు పంచింది. ప్రస్తుతేడాది అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఆస్తులు ఇదే కావడం విశేషం. అంతర్జాతీయ దేశాల్లో అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం, బ్యాంకుల నుంచి డిమాండ్ అధికంగా ఉండటం, పుత్తడిపై దిగుమతి సుంకాలు తగ్గించడం కూడా డిమాండ్ పెరగడానికి ప్రధాన కారణమని విశ్లేషించింది. ప్రస్తుతేడాది బంగారం ధర 23 శాతం ఎగబాకి రూ.78,350కి చేరుకున్నది. ఏప్రిల్ నుంచి నవంబర్ మధ్యకాలంలో ఎగుమతులు 2.17 శాతం పెరిగి 284.31 బిలియన్ డాలర్లకు చేరుకోగా, దిగుమతులు 8.35 శాతం ఎగబాకి 486.73 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దీంతో వాణిజ్యలోటు 202.42 బిలియన్ డాలర్లుగా ఉన్నది. అంతక్రితం ఏడాది ఇది 170.98 బిలియన్ డాలర్లు. గత నెలలో సర్వీసుల ఎగుమతులు 28.11 బిలియన్ డాలర్ల నుంచి 35.67 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. క్రూడాయిల్ దిగుమతులు 7.9 శాతం అధికమై 16.11 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

# వ్యాపారాల్లో సవాళ్లు.. 100 బిలియన్ డాలర్ల క్లబ్ నుంచి అంబానీ.. అదానీ ఔట్..!




భారతీయ బిలియనీర్లు ముకేశ్ అంబానీ, గౌతం అదానీ సంపద తగ్గిపోయింది. వారిద్దరూ 100 బిలియన్ డాలర్ల క్లబ్ నుంచి ఔటయ్యారని బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ పేర్కొంది. వ్యాపార పరంగా వారిద్దరికి ఎదురైన సవాళ్లే కారణమని వెల్లడించింది. రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ వ్యక్తిగత సంపద గత జూలైలో 120.8 బిలియన్ డాలర్లయితే, ఈ నెల 13 కల్లా 96.7 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. రిలయన్స్ అనుబంధ రిటైల్, ఎనర్జీ రంగాలు ఆశించిన మేరకు రాణించక పోవడంతో ముకేశ్ అంబానీ వ్యక్తిగత సంపద తగ్గిందని బ్లూంబర్గ్ బిలియనీర్స్ తెలిపింది. ఇక అదానీ గ్రూప్ చైర్మన్ గౌతం అదానీ సంపద 122.3 బిలియన్ డాలర్ల నుంచి 82.1 బిలియన్ డాలర్లకు దిగి వచ్చింది. సౌర విద్యుత్ సరఫరా ఒప్పందాల కోసం భారత్ లోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాల అధికారులకు ముడుపులు ఇచ్చారని అమెరికాలో కేసు నమోదు కావడంతో అదానీ గ్రూప్ సంస్థల షేర్లు భారీగా పతనం అయ్యాయి. అంతకు ముందు అమెరికా షార్ట్ షెల్లింగ్ సంస్థ హిండెన్ బర్గ్ రీసెర్చ్ కూడా అదానీ గ్రూప్ సంస్థలపై ఆరోపణలు చేసింది. అదానీ గ్రూప్ తన కంపెనీల షేర్ల విలువ కృత్రిమంగా పెంచిందని హిండెన్ బర్గ్ తెలిపింది. గౌతం అదానీ, ముకేశ్ అంబానీ వ్యక్తిగత సంపద నష్టపోయినా, దేశంలోని టాప్-20 బిలియనీర్ల సంపద 67.3 బిలియన్ డాలర్లు వృద్ధి చెందడం గమనార్హం. వారిలో ప్రముఖ పారిశ్రామికవేత్త శివ్ నాడార్ 10.8 బిలియన్ డాలర్లు, ఉక్కు పారిశ్రామికవేత్త సావిత్రి జిందాల్ 10.1 బిలియన్ డాలర్ల సంపద పెంచుకున్నారు.వ్యాపారాల్లో సవాళ్లు.. 100 బిలియన్ డాలర్ల క్లబ్ నుంచి అంబానీ.. అదానీ ఔట్..!

భారతీయ బిలియనీర్లు ముకేశ్ అంబానీ, గౌతం అదానీ సంపద తగ్గిపోయింది. వారిద్దరూ 100 బిలియన్ డాలర్ల క్లబ్ నుంచి ఔటయ్యారని బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ పేర్కొంది. వ్యాపార పరంగా వారిద్దరికి ఎదురైన సవాళ్లే కారణమని వెల్లడించింది. రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ వ్యక్తిగత సంపద గత జూలైలో 120.8 బిలియన్ డాలర్లయితే, ఈ నెల 13 కల్లా 96.7 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. రిలయన్స్ అనుబంధ రిటైల్, ఎనర్జీ రంగాలు ఆశించిన మేరకు రాణించక పోవడంతో ముకేశ్ అంబానీ వ్యక్తిగత సంపద తగ్గిందని బ్లూంబర్గ్ బిలియనీర్స్ తెలిపింది. ఇక అదానీ గ్రూప్ చైర్మన్ గౌతం అదానీ సంపద 122.3 బిలియన్ డాలర్ల నుంచి 82.1 బిలియన్ డాలర్లకు దిగి వచ్చింది. సౌర విద్యుత్ సరఫరా ఒప్పందాల కోసం భారత్ లోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాల అధికారులకు ముడుపులు ఇచ్చారని అమెరికాలో కేసు నమోదు కావడంతో అదానీ గ్రూప్ సంస్థల షేర్లు భారీగా పతనం అయ్యాయి. అంతకు ముందు అమెరికా షార్ట్ షెల్లింగ్ సంస్థ హిండెన్ బర్గ్ రీసెర్చ్ కూడా అదానీ గ్రూప్ సంస్థలపై ఆరోపణలు చేసింది. అదానీ గ్రూప్ తన కంపెనీల షేర్ల విలువ కృత్రిమంగా పెంచిందని హిండెన్ బర్గ్ తెలిపింది. గౌతం అదానీ, ముకేశ్ అంబానీ వ్యక్తిగత సంపద నష్టపోయినా, దేశంలోని టాప్-20 బిలియనీర్ల సంపద 67.3 బిలియన్ డాలర్లు వృద్ధి చెందడం గమనార్హం. వారిలో ప్రముఖ పారిశ్రామికవేత్త శివ్ నాడార్ 10.8 బిలియన్ డాలర్లు, ఉక్కు పారిశ్రామికవేత్త సావిత్రి జిందాల్ 10.1 బిలియన్ డాలర్ల సంపద పెంచుకున్నారు.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad “office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332